ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 217 పేజీలు: 10+4 వెల: 6.50

దేశవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు 3లో

భారత్, బెల్జియం మధ్య పది ఒప్పందాలు 5లో



## కాంగ్రెస్‌లోనే ఉంటాం

### ఎక్కడికీ వెళ్లం: స్పష్టం చేసిన కొండా సురేఖ

### సోషల్ మీడియా పోస్టులతో తమకు సంబంధం లేదని వివరణ

### కేబినెట్ నుంచి తనను తొలగించడం అన్యాయమని వాదన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు4:** తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దనికోరారు. తనఅధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు.
కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సిఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతోసహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత >>2

### సురేఖ బుల్లెట్ ప్రూఫ్ వాహనం, గన్‌మెన్ ఉపసంహారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన ప్రభుత్వం తాజాగా మరో షాక్ ఇచ్చింది. ఆమె బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని స్వాధీనం చేసుకుంది. ఎస్కార్టు,ఇంటెలిజెన్స్ నుంచి ఉన్న 8 మంది గన్‌మెన్లను కూడా తొలగించింది. హనుమకొండలోని నివాసం వద్ద కూడా బందోబస్తును రద్దు చేసినట్లు తెలుస్తోంది.

## 'ఘ'న విజయం



శుక్రవారం శ్రీహరికోట ప్రయోగ కేంద్రం నుంచి నింగిలోకి దూసుకుపోతున్న జిఎస్ఎల్‌వి ఎఫ్-17 రాకెట్

### జిఎస్ఎల్‌వి ఎఫ్-17 సూపర్ సక్సెస్

### కక్ష్యలోకి ఇఒఎస్ 05 ఉపగ్రహం

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గగనతనంలో ఇస్రో మరో ఘన విజయాన్ని సాధించింది. జిఎస్ఎల్‌వి ఎఫ్-17 రాకెట్ ద్వారా ఇఒఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశించిన కక్షలోకి ప్రవేశపెట్టి తన సత్తా చాటింది. గత కొంతకాలంగా ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించి అత్యంత ప్రతిష్టాత్మకమైన కీలక ప్రయోగాన్ని సక్సెస్ చేసి ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత దేశ కీర్తి పతాకాను ఎగురువేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలోని రెండవ లాంచ్‌ప్యాడ్‌నుంచి శుక్రవారం వేకువ జామున జిఎస్ఎల్‌వి ఎఫ్-17 >>2



## 50:50 వాటా ఇవ్వండి

- ఎల్ఎన్‌నో వల్ల నిష్పాక్షికంగా నీటి పంపిణీ చేయాలని తెలంగాణ డిమాండ్
- ఎపి వాదన అంగీకరించని ఇఎన్‌సి రమేశ్ బాబు
- శ్రీశైలం నుంచి జలవిద్యుదుత్పత్తిని తెలంగాణ వెంటనే నిలిపి వేయాలని కృష్ణాబోర్డు సూచన
- వాడివేడిగా కెఆర్ఎంబి త్రిసభ్య సమావేశం..
- ఏకాభిప్రాయం లేకపోవడంతో చర్చలు చివరి వారానికి వాయిదా

**హైదారాబాద్,సెప్టెంబరు 4,ప్రభాతవార్త:** శ్రీశైలం జలాలతో తెలంగాణ వెంటనే జలవిద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి తాగునీటికి మాత్రమే వాటిని వినియోగించేందుకు పొదుపు చేయాలని కెఆర్ఎంబి తెలంగాణ ప్రభుత్వంను ఆదేశించింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ శుక్రవారం నాటి సమావేశం నీటి పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిలు తాగునీటి పంపకాలపై వాడివేడిగా చర్చను సుదీర్ఘంగా జరిపారు. వెలిగొండ పోతిరెడ్డిపాడు తదితర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ వెంటనే పోతిరెడ్డిపాడు,నీటి వాటా విషయం తెరపైకి తెచ్చింది దీనితో ఆంధ్ర,తెలంగాణ వాదోపవాదాలు చేసుకోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. రెండు రాష్ట్రాలు ఎవరి వాదనలు వారు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి ఇఎన్‌సి రమేష్‌బాబు,ఆంధ్రప్రదేశ్‌నుంచి ఇఎన్‌సి నరసింహా మూర్తి హాజరైనారు. తెలంగాణ ప్రభుత్వం అవసరం లేకున్నా కూడా >>2

## కొడంగల్‌లో పరిశ్రమలకు 4వేల ఎకరాలు

### సేకరించిన భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు

### అక్టోబరులో పారిశ్రామిక, వ్యావసాయిక ఎక్స్‌పోజర్‌లు

### ఫేజ్-2 గ్రావిటీ కెనాల్ పనులకు టెండర్లు

### హాకీంపేట ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణాలు పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం హాకీంపేట ఎడ్యుకేషన్ హాబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**దుద్యాల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలో సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు కోసం 4 వేల ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ఇప్పటికే సేకరించిన భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలు జరగకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. అక్టోబర్‌లో ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్‌తోపాటు వ్యవసాయ ఎక్స్‌పోజర్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు కోసం 4వేల ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ఇప్పటికే సేకరించిన భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలు జరగకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. అక్టోబర్‌లో ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్‌తోపాటు వ్యవసాయ ఎక్స్‌పోజర్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫేజ్-2 గ్రావిటీ కెనాల్ పనులకు త్వరగా టెండర్లు పిలవాలని, భూసేకరణను పారదర్శకంగా నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. మూడు ఫేజ్‌లకు కలిపి ఇప్పటివరకు రూ.1,053 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వివరించారు. 81 కి.మీ. రేడియల్ రోడ్డుకు గడువురంగారెడ్డి- వికారాబాద్-నారాయణపేట 81 కి.మీ. రేడియల్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణను అక్టోబర్ చివరినాటికి పూర్తి చేసి టెండర్ ప్రక్రియను ముగించాలని సిఎం ఆదేశించారు. నవంబర్ 1 నుంచి పనులు ప్రారంభించి 18 నెలల్లో రహదారిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఎడ్యుకేషన్ హాబ్‌పై ప్రత్యేక దృష్టి**

హాకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ >>2

మద్దూరులో అభివృద్ధి పనులు పరిశీలించిన ముఖ్యమంత్రి 7లో

కేబినెట్ విస్తరణ రేపా! దసరాకా? 2లో



శుక్రవారం న్యూఢిల్లీలో ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్ సాయితో భేటీ అయిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## సమ్మక్కసాగర్‌కు త్వరగా ఎన్‌ఒసి ఇవ్వాలి

### ముంపునకు గురయ్యే భూములు, ఇళ్లకు పూర్తి పరిహారం చెల్లిస్తాం

### పరిహార నిధులను అవసరమైతే ముందుగానే జమచేస్తాం

### ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్ సాయితో ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ భేటీ

**హైదరాబాద్,సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** సమ్మక్క-సారక్క బ్యారేజీగాపిలిచే సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర ధృవీకరణ వీలైనంత త్వరగా జారీ చేయాలని తెలంగాణ నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, ఇళ్లకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లిస్తుందని, అవసరమైతే పరిహార నిధులను ముందుగానే జమచేసేందుకుకూడా సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, పరస్పర సహకారం, సంప్రదింపులద్వారా పెండింగ్ అంశాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై సమ్మక్క సాగర్ బ్యారేజీని నిర్మించారు. మొత్తం 1,143 మీటర్ల పొడవున్న ఈ బ్యారేజీకి 59 రేడియల్ గేట్లు ఉన్నాయి. పూర్తి జలాశయ మట్టం ఎఫ్ఆర్ఎల్ +83 మీటర్ల వద్ద 6.94 టిఎంసిల నీటిని నిల్వ చేసేలా దీనిని రూపొందించారు. సాగునీటి అవసరాల కోసం గోదా >>2

## 22ఎ భూములపై గగ్గోలు

### పట్టాలున్నా హక్కులు వినియోగించుకోలేని దుస్థితి

### రైతుల సమస్యను అసెంబ్లీలో లేవనెత్తుతాం

### కౌటాల సభలో హరీష్‌రావు

**కౌటాల, సెప్టెంబరు 4,ప్రభాతవార్త :** సిర్పూర్ నియోజకవర్గంలో 22ఎ నిషేధిత జాబితాలో చేరిన భూముల సమస్యతో వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. పట్టా పాస్‌పుస్తకాలు ఉన్నప్పటికీ భూములపై పూర్తిస్థాయి హక్కులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొనడం ఆందోళనకరమన్నారు. రైతుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో రైతులు, భూ బాధితులతో నిర్వహించిన సమావేశంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగామాట్లాడి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**22ఏతో భూ లావాదేవీలకు బ్రేక్..**

తమ పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములు 22ఏ నిషేధిత జాబితాలో చేరడంతో క్రయవిక్రయాలు, ఇతర భూ లావాదేవీలు నిర్వహించలేకపోతున్నామని పలువురురైతులు హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. పట్టా పాస్‌పుస్తకాలు ఉన్నప్పటికీ 22 ఏకారణంగా బ్యాంకులనుంచి పంట రుణాలు, ఇతర రుణాలు పొందడంలో ఇబ్బందులు >>2



శుక్రవారం కౌటాలలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న హరీష్‌రావు

## రేపు కాంగ్రెస్ మహా ధర్నా

### ప్రతిపక్షనేత పదవికి కెసిఆర్ రాజీనామా చేయాలని డిమాండ్

**హైదారాబాద్,సెప్టెంబరు 4,ప్రభాతవార్త:** శాసన సభలో ప్రతిపక్ష నేత పదవికి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆదివారం తలపెట్టిన మహాధర్నా ఏర్పాట్లపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఇతర >>2

## 'సర్' 3 వారాలు పొడిగింపు!


### నవంబరు చివరి వారంలో తుది జాబితా!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు4:** తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితాల సర్ ప్రక్రియకు గడువు పొడిగించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుత షెడ్యూల్‌ను కనీసం మూడువారాలపాటు పొడిగించేందుకు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సిద్ధమవుతున్నట్లు తెలంగాణ ముఖ్య ఎన్నికల కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశంఉంది. సర్ ప్రక్రియకు అదనపు సమయం ఇవ్వాలనికోరుతూ ప్రభుత్వం ఇప్పటికే ఇసిఐకి లేఖ రాసింది. ముఖ్యమంత్రి >>2



## నిశ్శబ్ద కల్లోలం!

- వేగంగా కరుగుతున్న హిమానీ నదాలు
- భారత్‌కు పెనుముప్పు ఏర్పడే అవకాశం
- ఓవంక అతివృష్టి, మరోవంక అనావృష్టి
- అప్రమత్తం కాకుంటే తీవ్ర పరిణామాలు
- ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరిక



**జెనీవా, సెప్టెంబరు 4:** భూమి నిశ్శబ్దంగా రగిలిపోతోంది. ప్రకృతి తన సహనాన్ని కోల్పోతూ మానవాళికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇందుకు తాజాగా జరిగిన నేపాల్-టిబెట్ విపత్తే ఉదాహరణ. పారిశ్రామిక విప్లవానికి ముందు రోజులతో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరగడం వల్లే ఇలాంటి విపత్తులకు కారణమని ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోంది. అయితే, ఇది ఇంతటితో ఆగదని, ముస్ముందు మరిన్ని విపత్తులను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరించింది. అన్నిటికంటే ముఖ్యంగా, మిగిలిన దేశాలతో పోల్చితే భారతదేశం ఎదుర్కోబోయే విపత్తులకు సంబంధించిన సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం యుఎన్ఇపి 'లిమిటింగ్ ఓవర్‌షూట్స్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. >>2



మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో శుక్రవారం ఘనంగా జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల దృశ్యం

## రేపు ఎర్రవెల్లిలో బిఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** ఈ నెల 7వ తేదీ నుంచి రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కెసిఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం (6వ తేదీన) ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కెసిఆర్ అధ్యక్షతన పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతోకూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీసమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కెసిఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

## గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసిన లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను బిజెపి ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్ ఆరోగ్య పరిస్థితి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## రేపు కాంగ్రెస్ మహా ధర్నా

>> ముఖ్య నేతలు పాల్గొని ఆదివారం జరిగే మహా ధర్నాను విజయవంతం చేసేందుకు కార్యాచరణ, ఏర్పాట్లపై సమావేశంలో చర్చ చేస్తారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీ ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా చేస్తారు. వెయ్యి రోజులుగా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష పాత్ర పోషించకుండా, అసెంబ్లీకి హాజరుకాకుండాఉన్న మాజీ సిఎం కెసిఆర్ తనఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోన్నది. మహా ధర్నాలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

## సూపర్ సక్సెస్

>> రాకెట్ చీకట్లను చీల్చుకుంటూ నిప్పులు చెరుగుతూ నింగికేగిసింది. బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్ డౌన్ 27 గంటల 30 నిమిషాల పాటు కొనసాగిభారత కాలమాన ప్రకారం రెండు గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్‌విఎఫ్ 17 రాకెట్ ఇఒఎస్ 05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని జియో సింక్రోనెస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన రాకెట్ గమన 19 నిమిషాల సమయాన్ని ఆశించిన రీతిలో పూర్తి చేసింది. 51.70 మీటర్ల పొడవు, 2,367 టన్నుల బరువుగల ఈ రాకెట్ మొదటి దశలో నాలుగు ద్రవ ఇంధన స్ట్రాపన్ బూస్టర్ల సాయంతో నింగికెగిసి 40 టన్నుల ద్రవ ఇంధనంతో మొత్తం 160 టన్నుల ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో పూర్తి చేసింది. 420.5 రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహానికి అమర్చిన హిట్ షీట్స్ మొదటి దశ రెండో దశకు మధ్యలోనే శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం విడిపోయాయి. 40టన్నుల ద్రవైందన సహాయంతో రెండో దశను 293.08 సెకండ్లలో అధికమించింది. స్వదేశీ సాంకేతికతో రూపొందించిన 15 టన్నుల క్రయోజనిక్ సహాయంతో 1106.60 సెకండ్ల మూడవ దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన 19 నిమిషాల గమన సమయంలో 28934 ఎత్తులోని జియోట్రాన్స్ఫర్ ఆర్బిట్‌లోకి చేరుకుంది. అనంతరం భూభాగంలోని మాస్టర్ కంట్రోల్ సెంటర్లవారు ఉపగ్రహాన్ని తమ ఆధీనంలోకితీసుకొని 36,000 కిలోమీటర్ల ఎత్తులోని కక్షలోకి ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టారు.

## భూములపై గగ్గోలు

>> ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.భూ సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లాలని, అక్కడికి వెళ్తే కలెక్టర్‌ను కలవాలని సూచిస్తున్నారని రైతులు తెలిపారు. చివరకు ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యను చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.సిర్పూర్‌లో 42,672 ఎకరాలు, కౌటాలలో 6,350 ఎకరాలు, సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 42,672 ఎకరాల భూములు 22ఎ జాబితాలో ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క కౌటాల మండలంలోనే సుమారు 6,350 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో భూములు 22ఏ పరిధిలో ఉండటంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టాలు ఉన్న రైతులు తమ భూములను స్వేచ్ఛగా వినియోగించుకోలేని పరిస్థితి రావడం బాధాకరమన్నారు. 22ఏ జాబితాలో భూములు చేరడానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి, అర్హత ఉన్న రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**అసెంబ్లీలో 22ఎ అంశాన్ని లేవనెత్తుతాం..**

రైతుల భూ సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. 22ఎ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించి, అర్హులైన రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.రైతులు తమ హక్కుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. 22ఎ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర విచారణ జరిపి, న్యాయబద్ధంగా అర్హత ఉన్న భూములను జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 50:50 వాటా ఇవ్వండి

>> తక్కువగా ఉన్న నీటిని విద్యుత్ ఉత్పత్తికి వాడటం తగదని ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి నరసింహామూర్తి అభ్యంతరం వ్యక్తంచేశారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డి పాడునుంచి ఆంధ్రప్రదేశ్ నిబంధనలకు విరుద్ధంగా నీటిని బేసిన్ దాటి పోయేలా తరలిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఉందని ఉన్ననీటిని 50శాతం చొప్పున చెరిసగం పంచుకోవాలని రమేష్‌బాబు కెఆర్ఎంబి ముందు ప్రతిపాదన పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున నరసింహామూర్తి మాట్లాడుతూ 66;34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కృష్ణానదిలోని రిజర్వాయర్లలో 142 టిఎంసిలు ఉన్నాయని ఇఎన్‌సి రమేశ్ బాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి మాత్రం ఖరాఖండిగా 66:34శాతం వాటా ప్రకారం 97 టిఎంసిలు విడదల చేయాలని కోరారు.సభ్యుడు నరసింహామూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశం ఏకాభిప్రాయం కుదరక అసంతప్తితో ముగిసిందని వ్యాఖ్యానించారు. కృష్ణా నదిలో లభ్యమయేయ్య నీరు 66:34 నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టిఎంసిలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టిఎంసిలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని అన్నారు.తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు.రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డితోపాటు వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకొని పోతున్నారని మొత్తం తెలంగాణకు 200టిఎంసిలు, ఎపికి 100టిఎంసిలు ఇవ్వాలని కోరారు. ఇదిఇలా ఉంటే విద్యుత్ ఉత్పత్తికి కృష్ణనదినీటిని వాడొద్దని కెఆర్ఎంబి తెలిపింది.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 లోని 11వ షెడ్యూల్ లో 2, 3 పేరాలను అనుసరించి నీటి వినియోగం ఉండాలనీ తెలంగాణను కెఆర్ఎంబి ఆదేశించింది.సాగు నీరు, త్రాగునీరు,విద్యుత్ ఉత్పత్తి వంటి ప్రాధాన్యత అంశాలు విపత్తు పరిస్థితులు వస్తే, త్రాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ కెఆర్ఎంబి తెలిపింది.తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి నీటిని వినియోగించడం వెంటనే నిలిపి వేయాలని కెఆర్ఎంబి హెచ్చరించింది.త్రాగు నీటి అవసరాలకే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని వినియోగించాలి. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి శ్రీశైలం నీటిని వినియోగించడం పై అభ్యంతరం వ్యక్తం చేసింది.

## సమ్మక్కసాగర్‌కు త్వరగా ఎన్ఒసి ఇవ్వాలి

>> వరి నది నుంచి 46.96 టిఎంసిల నీటిని మళ్లించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు.శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ పరిధిలోని 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం సమ్మక్క సాగర్ ప్రధాన ఉద్దేశం. దీనికితోడు రామప్ప–పాకాల అనుసంధాన కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పరిధిలోని కొంత ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు మార్గమధ్యంలోని గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చడం కూడా ప్రాజెక్టు లక్ష్యాల్లో భాగంగా ఉందన్నారు. పి.వి. నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో అనుమతి లభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం చేపట్టిన రీ–ఇంజినీరింగ్‌లో భాగంగా బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని తుపాకుల గూడెంకు మార్పుచేసి సమ్మక్క సాగర్‌గా పేరుపెట్టారు. ప్రాజెక్టుకు 2017లో పరిపాలనా అనుమతులు మంజూరు కాగా, 2020లో దీనికి సమ్మక్క సాగర్‌గా నామకరణం చేశారు. 2024 డిసెంబర్‌లో సవరించిన పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయని ఆయన తెలిపారు.ప్రాజెక్టుకు 2020లో పర్యావరణ అనుమతి లభించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికను 2021 ఆగస్టులో కేంద్ర జల సంఘానికి సమర్పించారు. ఇప్పటికే పలు సాంకేతిక అనుమతులు లభించినప్పటికీ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్ఒసి రాకపోవడంతో అంతర్రాష్ట్ర అంశాల పరిశీలన పెండింగ్‌లో ఉంది. బ్యారేజీలో పూర్తిస్థాయి నీటి నిల్వతోపాటు మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అనుమతి ఇప్పుడు అత్యంత కీలకంగా మారిందని ఉత్తమ్ వివరించారు.బ్యాక్‌వాటర్ అధ్యయనానికి రూ.9.883 కోట్లుసమ్మక్క సాగర్ బ్యారేజీ కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.988.30 లక్షలు, అంటే రూ.9.883 కోట్లను బీజాపూర్‌లోని ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు చెల్లించింది. ఈ మొత్తాన్ని 2026 ఏప్రిల్ 29న విడుదల చేసింది.పూర్తి జలాశయ మట్టం, అత్యధిక వరద నీటిమట్టానికి సంబంధించిన డీజీపీఎస్ సర్వేలు పూర్తయ్యాయని ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ 2026 ఆగస్టు 7న తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. ప్రస్తుతం లైడార్ డ్రోన్ సర్వేలతోపాటు క్షేత్రస్థాయి సమాచార సేకరణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఈ అధ్యయనాల ఆధారంగా ముంపు ప్రభావిత ప్రాంతాలు, భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల వివరాలను నిర్ధారించి పరిహార ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నారు.ఎన్ఒసి కోసం నిరంతర సంప్రదింపులుసమ్మక్క సాగర్ ఎన్ఒసి అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలోనూ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో పలుమార్లు చర్చించారు. 2025 సెప్టెంబర్ 22న రాయ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో ప్రాజెక్టు ప్రాధాన్యం, తెలంగాణ రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం 2026 జూన్ 11న హైదరాబాద్‌లో మరోసారి సమావేశమై ఎన్ఒసి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఆ ప్రయత్నాలకు కొనసాగింపుగా న్యూఢిల్లీలో తాజాగా భేటీ అయి, నిరభ్యంతర పత్రాన్ని సాధ్యమైనంత త్వరగా జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ముంపు ప్రభావిత కుటుంబాల హక్కులు, ప్రయోజనాలను సంపూర్ణంగా పరిరక్షిస్తూనే సమ్మక్క సాగర్ ద్వారా నిర్దేశించిన సాగునీటి ఫలాలను రైతులకు అందించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, నిరంతర సంప్రదింపుల ద్వారా పెండింగ్ అంశాలను పరిష్కరించి, సమ్మక్క సాగర్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కోరారు,

## 3 వారాలు పొడిగింపు!

>> ఎ. రేవంత్‌రెడ్డి.. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాస్తూ, ఓటర్ల నుంచి వాదనలు, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతంగా ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు తమ వాదనలు వినిపించేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు మరింత సమయం అవసరమని సిఎం రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం మరో నాలుగు వారాల పాటు గడువు పొడిగించాలని కోరినప్పటికీ.. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం కనీసం మూడు వారాల పొడిగింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలను సెప్టెంబరు 16 వరకు స్వీకరిస్తారు. అనంతరం నోటీసుల జారీ, విచారణ, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగుతుంది. చివరగా అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉంది. అయితే గడువు పొడిగిస్తే ఈ తేదీలన్నీ మారే అవకాశం ఉంది. తాజా ప్రతిపాదన ప్రకారం తుది ఓటర్ల జాబితా నవంబర్ చివరి వారంలో వెలువడే అవకాశం ఉందని ఎన్నికల కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

## నిశ్శబ్ద కల్లోలం!

>> ఇందులో అనేక సంచలన విషయాలు దాగి ఉన్నాయి. భారతదేశ జనాభాలో దాదాపు 80శాతానికి పైగా ప్రజలు విపరీతమైన ఎండలు, అనూహ్య వరదలు, కరువులు, తుఫానుల వంటి వాతావరణ ఆధారిత విపత్తులు పొంచి ఉన్న జిల్లాల్లోనే నివసిస్తున్నారు. 2026 నాటి తాజా పరిశోధనల ప్రకారం, 1981 నుంచి 2020 మధ్యకాలంలో భారతదేశ సగటు వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రత సుమారు ఒక డిగ్రీ సెంటిగ్రేడ్ మేర పెరిగింది.

హీట్‌వేవ్‌ల సంఖ్య, వాటి తీవ్రత, అవి కొనసాగే సమయం విపరీతంగా పెరిగిపోయాయి. మానవ శరీరం తనంతట తానుగా చల్లబరుచుకోలేని అత్యంత ప్రమాదకరమైన ఉక్కపోత పరిస్థితి ఇప్పుడు దేశమంతటా వ్యాపిస్తోందని మరో నివేదిక వెల్లడించింది. ఇది కేవలం ఎండకాలానికే పరిమితం కాకుండా, వర్షాకాలంలోనూ మానవ సామర్థ్యాన్ని, ఆరోగ్యాన్ని నిర్దాక్షిణ్యంగా దెబ్బ తీస్తోంది. ఉష్ణోగ్రత పెరుగుదల నేరుగా ఆహార, నీటి భద్రతలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల పెరుగుదల కారణంగా సంభవించే వాతావరణ మార్పులు ఎల్‌నినో ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని ఇటీవలి పరిశోధనలు స్పష్టం చేశాయి. ఎల్ నినో ప్రభావం భారత రుతుపవనాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి వర్షపాతాన్ని అస్తవ్యస్తం చేయడం ద్వారా కరువు ముప్పును మరింత పెంచుతోంది. మరోవైపు దేశ జీవనదులైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర వంటి నదుల మనుగడ హిందూకుష్ హిమాలయాలపై ఆధారపడి ఉంది.

అయితే, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటైన్ డెవలప్‌మెంట్ 2026 ప్రారంభంలో విడుదల చేసిన డేటా అత్యంత భయానకమైన వాస్తవాన్ని వెల్లడించింది. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు కరిగిపోయే వేగం రెట్టింపు అయింది. ఈ ఆకస్మిక కరుగుదల నదీ లోయల్లో ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి దారితీయడమే కాక, భవిష్యత్తులో కోట్ల మంది ప్రజలను తీవ్ర నీటి ఎద్దడిలోకి నెట్టే ప్రమాదం ఉంది. ఈ విపత్తుల వెనుక అభివృద్ధి చెందిన దేశాల అన్యాయం స్పష్టంగా దాగి ఉంది. ఇటీవల పొరుగు దేశమైన నేపాల్‌లో వాతావరణ విలయాల కారణంగా వెయ్యి మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడమే దీనికి నిదర్శనం.

ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో నేపాల్ వంటి దేశాల పాత్ర నామమాత్రమే. కానీ, అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు దశాబ్దాలుగా సాగించిన పారిశ్రామిక విధ్వంసానికి మూల్యం మాత్రం ఏ పాపం ఎరుగని గ్లోబల్ సౌత్ దేశాలే చెల్లించాల్సి వస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాల తగ్గించడంతో పాటు నష్టపరిహారం, వాతావరణ ఆర్థిక సహాయం తప్పనిసరిగా చేయాలని బ్రెజిల్‌లో జరిగిన సిఒపి 30 సదస్సులో భారత్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో, ఈ యేడాది నవంబర్‌లో టర్కీలో జరగనున్న సిఒపి31 సదస్సు కీలకంగా మారింది.

ప్రకృతి విసురుతున్న ఈ సవాలును తీరిగ్గా కూర్చుని సరిదిద్దుకునేంత సమయం లేదు. ఒకటిన్నర డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగితేనే, ఈ స్థాయిలో ప్రభావం ఉంటుందని అర్థమైనప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. ఉష్ణోగ్రత పెరుగుదలలో నివారించగలిగే ప్రతి చిన్న అంకె కూడా భవిష్యత్తులో వేలాది ప్రాణాలను, కోట్ల ఎకరాల పంటలను, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుతుంది.

### వారం - వర్జ్యం

05-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.నవమి రా.9.53,న.మృగశిర రా.9.30
వ.తె.5.20 – ఉ.6.49
దు.తె.5.54 – ఉ.7.32
రాహు. ఉ.9.00–ఉ.10.30
శుభ లేదు

### వార్తాఫలం

**మేషం :** ఇంటా బయటా ఎదురైన ఒత్తిడులు తొలగుతాయి. గృహనిర్మాణ ఆలోచనల్లో తొందరపాటు వద్దు.అదనపు బాధ్యతలు.

**వృషభం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. వివాహానికి అనుకూలమైన కాలం.

**మిథునం :** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. జీవితభాగస్వామినుండి వస్తు, వస్త్రలాభాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

**కర్కాటకం :** ఋణాలు కొంతవరకు తీరుస్తారు.వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**సింహం :** నూతన ఉత్సాహంతో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో ఆదరణ పెరుగుతుంది.

**కన్య :** ఆర్థిక ఇబ్బందులు అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. శ్రమ ఫలిస్తుంది.

**తుల :** సోదరుల నుండి ఆస్తి, లాభం పొందుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** భూ వివాదాలు పరిష్కరించు కొంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**మకరం :** వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మీనం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం మద్దూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## 4 వేల ఎకరాలు

>> స్కూల్, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలలు, 430 పడకల ఆసుపత్రి తదితర నిర్మాణాలను సిఎం పరిశీలించారు. పనుల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని, నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.వర్షపు నీరు నిల్వ కాకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి, సేకరించిన నీటిని ల్యాండ్‌స్కేపింగ్‌కు వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పట్టణ మౌలిక వసతులపై ఆరాకొడంగల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. అమృత్–2.0 తాగునీటి పనులను వేగవంతం చేయాలని, మద్దూర్‌లో రోడ్డు విస్తరణ, డ్రైన్ పనులు పూర్తి చేయాలని సూచించారు. కొడంగల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పనులు, రోడ్డు విస్తరణ పనులను సైతం సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వాగులపై నాణ్యమైన వంతెనలువాగులపై నాణ్యమైన వంతెనలు, కల్వర్టులు నిర్మించాలని సిఎం సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన డిజైన్లతో నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. పోతిరెడ్డి–సంపల్లి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో తాండూరు ఎమ్మెల్యే బి. మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, నారాయణపేట కలెక్టర్ ప్రియాంక, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేబినెట్ విస్తరణ రేపా? దసరాకా?

### మూడు మంత్రి పదవుల కోసం ఆశావహుల పోటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** రాష్ట్ర కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అయిన తర్వాత రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై మళ్లీ ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటికే ఖాళీగా ఉన్న 2 మంత్రి పదవులకు తోడు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో మరో బెర్త్ ఖాళీ అయ్యింది. దీంతో ప్రస్తుతం 3 మంత్రి పదవుల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు పోటీ పడుతున్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు రోజు ఆదివారం(6వ తేదీ) విస్తరణ కుదరకపోతే అక్టోబర్‌లో దసరా పండుగ సమయంలో విస్తరణ ఉండవచ్చుననే ప్రచారం జరుగుతోంది. ఆదివారం లోక్‌భవన్‌లో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ఇంత వరకు ఏర్పాట్లు జరగడం లేదని సమాచారం. మంత్రి పదవుల భర్తీ ప్రక్రియ ఎప్పుడు పూర్తయినా మంత్రి పదవుల ఎంపికలో సీనియారిటీతో పాటుగా సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, పార్టీకి చేసిన సేవలు, గెలుపు సామర్థ్యం, రాజకీయ అవసరాలు వంటివి పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో 18 మంది మంత్రులకు అవకాశం ఉండగా, అందులో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ మూడు స్థానాల కోసం ఆది శ్రీనివాస్, బాలునాయక్, రాంచందర్ నాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, మహేశ్ కుమార్‌గౌడ్ తదితర పేర్లు పలు సందర్భాల్లో తెరపైకి వచ్చాయి. ఈ 3 స్థానాల భర్తీలో ప్రస్తుతం కేబినెట్‌లో ఏ సామాజికవర్గానికి ఎంత ప్రాతినిధ్యం ఉంది? ఏ వర్గానికి మరింత ప్రాతినిధ్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది? అన్నది పరిశీలించే అవకాశం ఉంది. దీనికితోడు పార్టీ కోసం చేసిన సేవలు, నియోజక వర్గంలో గెలుపు సామర్థ్యం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సామర్థ్యం, పార్టీ అధిష్ఠానంతో సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ రేసులో ముందుగా వినిపిస్తున్న పేరు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆయన బీసీ కోటాలో బలమైన పోటీదారుగా ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు. కరీంనగర్ ప్రాంతానికి కేబినెట్‌లో మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న లెక్కతో పాటు బీసీ సామాజిక సమీకరణాన్ని బలోపేతం చేయాలన్న దిశలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇదే జిల్లా నుంచి ఇప్పటికే డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నల్లగొండ జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అదే జిల్లా నుంచి ఎస్టీ కోటాలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో సీతక్క ఎస్టీ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే లంబాడా సామాజిక వర్గానికి కూడా కేబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ ఉంది. ప్రస్తుత ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ పేరు కూడా పరిశీలనలోకి వస్తుంది. మరోవైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై చాలాకాలంగా ఆశలు పెట్టుకోగా, ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి కేబినెట్‌లో అవకాశం ఇవ్వాలా? అన్నది అధిష్ఠానం ముందున్న కీలక ప్రశ్న. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నప్పుడు అత్యధికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించుకున్న నల్లగొండ జిల్లా నుంచి ఎందుకు ముగ్గురు మంత్రులు ఉండకూడదని రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. కాగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన గడ్డం ప్రసాద్ కుమార్ పేరు గతంలో కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ చర్చల్లో వినిపించింది. అయితే ఆయన ప్రస్తుతం శాసనసభ స్పీకర్‌గా ఉన్నారు. స్పీకర్‌ను మంత్రి పదవిలోకి తీసుకోవాలంటే ముందుగా స్పీకర్ పదవికి మరో నేతను ఎంపిక చేయాల్సి ఉంటుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్(ఎమ్మెల్సీ) పేరు కూడా గతంలో మంత్రి పదవి కోసం వినిపించింది. ఆయనను కేబినెట్‌లోకి తీసుకుంటే పార్టీ అధ్యక్ష (టిపిసిసి చీఫ్)పదవిలో మార్పు చేయాల్సి ఉంటుంది. అందుకే మహేశ్ కుమార్ గౌడ్ విషయంలో నిర్ణయం తీసుకోవాలంటే ప్రభుత్వం, పార్టీ రెండింటినీ సమన్వయం చేసే రాజకీయ నిర్ణయం అవసరం. ఆయన పేరు ఉన్నప్పటికీ ఇది హైకమాండ్ స్థాయిలో తేలాల్సిన అంశం. గౌడ్ సామాజిక వర్గం కోటాలో మహేశ్‌కుమార్‌కు సర్దుబాటు చేస్తే ఇప్పప్పటికే మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్‌ను కదిలించే పరిస్థితి ఏర్పడ వచ్చునని చర్చ జరుగుతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రేమ్‌సాగర్ రావు వంటి పేర్ల విషయంలో పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది. అయితే సుదర్శన్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు బాధ్యతలు, ప్రేమ్‌సాగర్‌రావుకు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ బాధ్యతలు లభించాయి.

## కాంగ్రెస్‌లోనే ఉంటాం

>> ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సిఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సిఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సిఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బిజెపిలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ “నేను ఎక్కడికీ వెళ్లడం లేదు“ అని స్పష్టం చేశారు.

## సిఎంకు ఎవరిని బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరంలేదు

### కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం, పార్టీలో కొనసాగితే అవకాశాలు వస్తాయి

### పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 4,ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డికి ఎవరిని బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం కానీ పరిస్థితి కానీ లేదని మహేష్‌కుమార్‌గౌడ్ ఖరాఖండిగా తెలిపారు. కొండా సురేఖ ఆవేశం ఆవేదనతో మాట్లాడినారని ఇక ముందు అలా మాట్లాడకూడదని ఆమె బర్తరఫ్ చాలా బాధాకరమనీ, పార్టీలో కొనసాగితే ఇంత కంటె మంచి అవకాశాలు వస్తాయనీ టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ కొండా సురేఖ కాంగ్రెస్‌లో కొనసాగుతారని చెప్పారని, ఆమె పార్టీలో కొనసాగితే తప్పకుండా అవకాశం ఇస్తామని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కొండా సురేఖ ఆవేశం, ఆవేదనతో ఇకపై మాట్లాడకూడదని సమస్యలుంటే నేరుగా తన వద్దకు వచ్చి చెప్పుకోవచ్చని ఒక కొండా సురేఖనే కాదు ఎవరైనా మాట్లాడొచ్చని ఆయన తెలిపారు.కొండ సురేఖ తన కూతురు సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఖండించాల్సి ఉండాల్సిందని అలా ఖండించకపోవడం వల్లే ఎఐసిసి సీరియస్‌గా తీసుకొందని అన్నారు. కొండసురేఖ పార్టీలో కొనసాగాలని బలంగా కోరుకొంటున్నామనిఆయన స్పష్టం చేశారు. పార్టీ విధేయత క్రమశిక్షణను కాపాడేందుకు అదిష్టానం కఠినవైఖరి అవలంభించిందని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎంతటివారైన హైకమాండ్ చూస్తూ ఉపేక్షించదని హెచ్చరించారు.

# అప్పుడు సంతోషించాను కానీ.. ఇప్పుడు బాధేస్తోంది

## కొండా సురేఖ బర్తరఫ్‌పై బిజెపి ఎంపి డికె అరుణ వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 4:** కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించడం తనను తీవ్రంగా బాధించిందని బిజెపి ఎంపి డికె అరుణ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలే కొండా సురేఖ బర్తరఫ్‌కు దారి తీశాయని డీకే అరుణ ఆరోపించారు. శుక్రవారం జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ తనకు సీనియర్ మహిళా నాయకురాలు అని.. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో తాము ఇద్దరం కలిసి మంత్రులుగా పనిచేశామని ఆమె గుర్తు చేసుకున్నారు. తొలి మహిళా నాయకురాలు మంత్రిగా తెలంగాణకు సేవలందించడం చూసి అప్పుడు సంతోషించానని.. కానీ ఇప్పుడు అదే నాయకురాలిని మంత్రివర్గం నుంచి తొలగించడం తనకు తీవ్రంగా బాధను కలిగిస్తోందని డీకే అరుణ వ్యాఖ్యానించారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్య లకు కొండా సురేఖను బాధ్యురాలిని చేస్తూ మంత్రివర్గం నుంచి తొలగించడం సమర్థనీయం కాదని డీకే అరుణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒక మహిళా రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి రావడం సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. అలాంటి సీనియర్ మహిళా నాయకురాలిపై తీసుకున్న చర్య సరైన నిర్ణయం కాదని మండిపడ్డారు. బీసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఎంతో చేస్తున్నామని చెబుతున్నారని విమర్శించిన డీకే అరుణ.. అయితే ఓ బీసీ మహిళా మంత్రిని కేబినెట్ నుంచి తొలగించడం ద్వారా బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవం ఏమిటో అర్థమవుతోందని అన్నారు. అయితే కొండా సురేఖను బీజేపీలోకి ఆహ్వానించే అంశంపై ఇప్ప టివరకు తమ మధ్య ఎలాంటి చర్చ జరగలేదని డీకే అరుణ స్పష్టం చేశారు. దీంతో సురేఖ భవిష్యత్ రాజకీయ అడుగులపై కొనసాగుతున్న ఊహా గానాలకు ఆమె వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ఇస్రోకు చరిత్రాత్మక విజయం




## ఈ యేడాది ఆరు ప్రయోగాలు

### ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** జిఎస్ఎల్వి ఎఫ్ 17 విజయం చారిత్రాత్మకమైనదని, ఈ విజయంలో ఇస్రోలోని ప్రతి ఒక్కరి సమిష్టి కృషి ఉందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ అన్నారు. ప్రయోగ విజయానంతరం శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ద్వారా భారతదేశానికి అత్యంత ఉపయోగకరమైన ఇఓఎస్ 05 రాకెట్‌ను నిర్దేశించిన కక్షలోకి పంప గలిగామన్నారు. జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ప్రథమంగా అధిక బరువు గల ఉపగ్రహాన్ని గగనతలంలోకి తీసుకువెళ్లిందని తెలిపారు. 36 వేల కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపగ్రహం చేరుకొని పనిచేయడం ప్రారంభించిందని, ఇస్రో ఆధ్వర్యంలో ఇంత ఎత్తులో ప్రవేశ పెట్టడం ప్రథమమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ ప్రయోగం విజయవంతం అయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేటు సెక్టార్‌కు సంబంధించి విక్రమ్ వన్ రాకెట్ విజయం సాధించిందని తెలిపారు. ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రోకు మంచి రోజులు వచ్చాయని, ఇదే విజయ పరంపరను కొనసాగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తల బృందం నిరంతరం శ్రమిస్తామని నారాయణన్ తెలిపారు. ఈ యేడాదిలో మరో ఆరు ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇందులో గగన్‌యాన్ సంబంధించి మానవ రహిత ఉపగ్రహం ప్రయోగం, ఎన్‌వి ఎస్ 03 నావిగేషన్ శాటిలైట్ ప్రయోగం ఉంటాయని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈ ప్రయోగ విజయం ఇస్రో కుటుంబానికి స్ఫూర్తినిచ్చిందని ఆయన చెప్పారు. తమిళనాడులోని కులశేఖర పట్టణంలోని లాంచ్ ప్యాడ్‌లో ఇస్రో, ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణం కీలక దశలో ఉందని నారాయణన్ తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తల బృందంతో కలిసి పిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ నమూనాను చేత పట్టుకొని విజయోత్సవం జరుపుకు న్నారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ముత్తు చెళియన్, ఎపిఆర్సీ డైరెక్టర్ నారాయణ అప్పు, ఇస్రాక్ డైరెక్టర్ ఎంఆర్ రాఘవేంద్ర, మాస్టర్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ పంకజ్ దామోదర్ కిల్ దార్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ రాజీవ్, యుఆర్ ఎస్సీ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్, మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్, డాక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సుమంత్ కోసం కొనసాగుతున్న గాలింపు

## పోలీసు కస్టడీకి మాజీమంత్రి మాజీ ఓఎస్డీ అనుచరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్, అతని అనుచరులపై నమోదైన హత్యాయత్నం కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. బత్తిని అరుణ్‌కుమార్‌రెడ్డి, పసుపులేటి కార్తీక్‌కుమార్, ముత్యాల మహేందర్‌రెడ్డిలను ఈ నెల 24న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా నింది తులను విచారించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు సోమవారం వరకు పోలీస్ వారిని కస్టడీకి అనుమతించింది. దీంతో ముగ్గురినీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించి అదనపు డీసీపీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు విచారిస్తున్నారు. ఫిర్యాదుదారుడు హరికృష్ణపై దాడికి సంబంధించిన కారణాలు, ఘటనలో నిందితుల పాత్ర, ఇతర వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ కేసు నమోదు విష యంలో నిరక్ష్యంగా వ్యవహరించిన అప్పటి ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కేసులో పరారీలో ఉన్న నార్ల సుమంత్ తోపాటు మరో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న శంకర్‌గౌడ్

# 22-ఎ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## జనసేన తెలంగాణ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 22-ఎ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జనసేన తెలంగాణ ఆధ్వర్యంలో అర్హులైన ప్రజల ఆస్తులను 22-ఎ జాబితా నుంచి తొలగించి, వారి ఆస్తి హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేశించి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆస్తి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వమే ప్రజలను ఇబ్బందులకు గురిచేయటం సరికాదన్నారు. 22-ఎ సమస్య కేవలం కొద్దిమంది సమస్య కాదని, భూములు, ఆస్తులపై హక్కులు కలిగి ఉన్న అనేకమంది ప్రజల జీవితాలకు సంబంధించిన అంశమని తెలిపారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, న్యాయబద్ధమైన పరిష్కారం అందించేవరకు జనసేన పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. జనసేన ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కే.నాయుడు మాట్లాడుతూ ప్రజలు చట్టబద్ధంగా సంపాదించుకున్న భూములు, ఆస్తులపై అనవసరమైన ఆంక్షలు, అనిశ్చితి కొనసాగకుండా ప్రభుత్వం స్పష్టమైన పారదర్శకమైన విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దీక్షా కార్యాక్రమంలో పార్టీ నాయకులకు ఎం.దామోదర్‌రెడ్డి, మచ్చ సుధాకర్, మమ్మారెడ్డి, ప్రేమ్‌కుమార్, మేకల సతీష్‌రెడ్డి, గడల శ్రీనివాస్, సంపత్‌నాయక్, మండపాక కావ్య, పొన్నూరు శిరీష, ప్రజీత్‌గౌడ్, మిరియాల రామకృష్ణ తదితరులతోపాటు 22-ఎ బాధితులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# 2 రోజుల పోలీస్ కస్టడీకి రిచ్‌కిడ్స్ ట్రాప్ నిందితులు

## అనుమతించిన నాంపల్లి కోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు4:** రిచ్‌కిడ్స్‌ను ట్రాప్ చేసిన కేసులో ప్రధాన నిందితులను 2 రోజులపాటు విచారణ చేసేందుకు నాంపల్లి కోర్టు పోలీసులకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు నిందితులు కోడూరి మీనాకుమారి, వినీల్ చౌదరిలను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సంపన్నవర్గాల పిల్లలే లక్ష్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మైనర్లను ట్రాప్ చేసే ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు ఇటీవలే రట్టుచేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అర్జున్ అలియాస్ కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ముందుగా సంపన్న వర్గానికి చెందిన మైనర్లతో పరిచయం పెంచుకునేవాడు. మాయమాటలు చెప్పి నెమ్మదిగా వారిని ప్రేమలో దింపేవాడు. అనంతరం బాలికలను బలవంతంగా లోబరుచుకుని ప్రైవేటు వీడియోలు తీసుకునేవాడు. వీటిని అడ్డుపెట్టుకుని ఆ మైనర్లను, వారి కుటుంబ సభ్యులను బెదిరించి భారీ మొత్తంలో డబ్బును వసూలు చేసేవాడు. ఈ లావాదేవీలన్నీ నిందితుని తల్లి మీనాకుమారి అకౌంట్ ద్వారా జరిగేవి. ఈ కేసులో ప్రధాన నిందితులైన మీనాకుమారి, వినీల్ చౌదరిని జూబ్లీహిల్స్ పోలీసులు ఆగస్టు 11న రాజస్థాన్‌లో అరెస్ట్ చేశారు.

తాజాగా నిందితులను 2 రోజులపాటు విచారణ కోసం తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా.. నాంపల్లి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పోలీసులు అర్జున్ తల్లి మీనాకుమారి, వినీల్ చౌదరిలను తమ కస్టడీలోకి తీసుకున్నారు. విచారణలో వీరిద్దరి నుంచి మరిన్ని కీలక వివరాలు బయటకొచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

# అధిక ధరలకు ఎరువుల విక్రయం

## రూ.50 నుండి రూ.300 వరకూ అదనపు వసూళ్లు

### ఫెర్టిలైజర్స్ అమ్మకాల్లో దందా

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎరువుల దందా నడుస్తోంది. వ్యవసాయ సీజన్ జోరందుకున్న వేళ అన్నదాతల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న ఫర్టిలైజర్స్ దుకాణదారులు వారిని నిలువునా దోచుకుంటున్నారు. చివరకు ప్రభుత్వ యాప్ ద్వారా అధికారికంగా బుక్ చేసుకుని కొనుగోలు చేసినప్పటికీ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుకు ఫిర్యాదులు అందుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని కొన్ని ఫెర్టిలైజర్స్ షాపులు, సహకార సంఘాల్లో ఎమ్మార్పీ కంటే మించి అదనపు వసూళ్లకు పలువురు వ్యాపారులు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ప్రకారం యూరియా బస్తా ధర రూ. 267 మాత్రమే ఉండగా, వ్యాపారులు మాత్రం ఏకంగా రూ.320 నుంచి రూ.350 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇక డీఏపీ అసలు ధర రూ.1,350 కాగా, రైతుల వద్ద నుంచి ఏకంగా రూ.1,500 నుండి రూ.1,850 వరకు దండుకుంటున్నారు. కేవలం యూరియా, డీఏపీ మాత్రమే కాకుండా పంటలకు పిచికారీ చేసే పురుగు మందులు, స్ప్రే మందులను సైతం ఒక్కో దుకాణంలో ఒక్కో రేటుకు విక్రయిస్తూ ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, తీవ్ర నిరక్ష్యం వల్లే వ్యాపారులు, దళారులు ఇంతలా బరితెగించారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రతి షాపు ఎదుట విధిగా ధరల పట్టిక ఏర్పాటు చేయించి, అధిక ధరలకు అమ్ముతున్న దోపిడీదారులపై కఠినచర్యలు తీసుకోవాలని రైతాంగం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది.

# సిఎం రేవంత్‌రెడ్డి భద్రతా సమాచారం లీక్

## నిందితుల కోసం పోలీసుల వేట ముమ్మరం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన బందోబస్తుకు సంబంధించిన రహస్య వివరాలను పోస్ట్ చేసిన వ్యవహారంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. 'తెలుగు స్క్రైబ్' ఖాతా నిర్వాహకులపై సీఎం ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌ఓ) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. తొలుత జూలై 14న సైఫాబాద్ పీఎస్‌లో నమోదైన ఈ కేసును అదనపు సీపీ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. జూన్ 13న సీఎం ఢిల్లీ పర్యటన సందర్భంగా నిమిషాల వారీ షెడ్యూల్, కాన్వాయ్ బందోబస్తు, సీఎం బ్లడ్ గ్రూప్, ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లతో కూడిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, డీజీపీలకు వైర్‌లెస్ ద్వారా పంపారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటన కొనసాగుతుండగానే ఆ ప్రొటోకాల్ పత్రం తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతాలో దర్శనమివ్వడం ఉన్నతాధికారులను విస్మయానికి గురిచేసింది. వైర్‌లెస్ సందేశాలు బయటకు వెల్లడించడం నిబంధనలకు విరుద్ధమని, శాఖాపరమైన లీకేజీలే ఇందుకు కారణమని సీఎస్‌వో ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ కంచె చేను మేసిన ఉదంతంపై సైబర్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుల కోసం వేట ముమ్మరం చేశారు.

# దేశవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## మధుర, బృందావనం, ఇస్కాన్ ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

**మధుర, సెప్టెంబరు 4:** దేశవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా భక్తులు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మస్థలమైన మధురతో పాటు బృందావనం, ఇస్కాన్ ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, అందమైన పుష్పాలతో అలంకరించడంతో పరిసరాలు భక్తి, ఆనందంతో నిండిపోయాయి. మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి ఆలయంలో అర్ధరాత్రి జరిగే అభిషేకం, హారతి కోసం భక్తులు రాత్రి నుంచే బారులు తీరారు. ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగిస్తూ భక్తులు పూజలు చేస్తున్నారు. ఎటుచూసినా భజనలు, కీర్తనలు మార్మోగుతున్నాయి. బృందావనంలోని బంకే బిహారీ ఆలయం, ఇస్కాన్ ఆలయాలకు కూడా వేలాది మంది భక్తులు చేరుకుని శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. పూలమాలలు, రంగురంగుల దీపాలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీకృష్ణుడి బాల్యలీలలను ప్రతిబింబించే ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, కీర్తనలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశంలోని ఇస్కాన్ ఆలయాల్లోనూ జన్మాష్టమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఢిల్లీ, ముంబైతో పాటు పలు నగరాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజన



కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ అర్ధరాత్రి జరిగే శ్రీకృష్ణ జన్మవేళ పూజల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలకృష్ణుడి విగ్రహాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొన్ని ప్రాంతాల్లో దహీ హాండీ, రాసలీల కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. మథురబృందావన ప్రాంతంలో భారీగా భక్తులు తరలిరావడంతో భద్రతా ఏర్పాట్లను అధికారులు కట్టుదిట్టం చేశారు. పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి భక్తుల రద్దీని నియంత్రిస్తున్నారు. కృష్ణ నామస్మరణతో భక్తులు జన్మాష్టమి వేడుకల్లో మునిగిపోయారు. ఆలయాల వద్ద "జై శ్రీకృష్ణ, హరే కృష్ణ నినాదాలు మార్మోగుతున్నాయి. భక్తి, ఆనందం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల అలంకరణలు, విద్యుత్ దీపాల వెలుగులు, భక్తుల ఉత్సాహంతో పండుగ వాతావరణం దీపావళిని తలపిస్తోంది. మధురలో శ్రీకృష్ణుడు జన్మించినట్లు విశ్వసించే కారాగార గర్భగృహం (గర్భగృహం) ఉన్న ప్రాంతంలో ఈ ఆలయం నిర్మించబడింది. జన్మాష్టమి సందర్భంగా మధుర నగరం మొత్తం విద్యుత్ దీపాలంకరణలు, ఆలయ అలంకరణలు, రంగురంగుల ఝూంకీలతో శోభాయమానంగా మారింది. శ్రీకృష్ణుడి జీవితంలోని వివిధ ఘట్టాలను ప్రతిబింబించే ఈ ఝూంకీలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రాత్రివేళ ఆకాశంలో శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింబించే భారీ డ్రోన్ లైట్ షోలను కూడా నిర్వహించారు. శ్రీకృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడనే విశ్వాసంతో రాత్రి 12 గంటలకు జన్మాష్టమి వేడుకలు తారస్థాయికి చేరుకుంటాయి. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పవిత్ర జలాలతో ఘనంగా అభిషేకం నిర్వహిస్తారు.

# లక్షమందికిపైగా ఉద్యోగులకు వోక్స్‌వ్యాగన్ ఉద్వాసన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తొలగిం చేందుకు నిర్ణయిం చినట్లుగా ప్రకటిం చింది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం, కా ర్మిక సంఘాలు ఒక అంగీకారానికి వ చ్చాయని పేర్కొం ది. ఇందులో ఇప్పటికే 50 వేల ఉద్యోగాల కోతకు అంగీకరించగా తాజాగా మరో 50 వేల పోస్టులను తొలగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పింది. కంపెనీ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణగా నిలవనుంది. కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగినట్లుగా ఉద్యోగుల సంఖ్యను క్రమబద్ధీకరించడం తప్పనిసరని ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, ముఖ్యంగా చైనాకు చెందిన సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ కారణంగా యూరప్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే లేఆఫ్స్‌కు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఫోక్స్‌వ్యాగన్ కంపెనీలో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోని దాదాపు 43 శాతం మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆ కంపెనీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం అన్నమాట. ఈ ఉద్యోగాల కోతను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. తాజా ప్రకటనలో మాత్రం కార్మిక సంఘాలు కూడా అంగీకరించినట్లు తెలపడం గమనార్హం. హ్యానోవర్, ఎమ్డెన్, జ్వికావ్, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుపై స్పష్టత లేదని కంపెనీ తెలిపింది. ఈ ప్లాంట్లకు ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. పూర్తి స్థాయి ప్లాంట్లను జర్మనీలో మూసివేయడం వోక్స్‌వ్యాగన్‌కు ఇదే తొలిసారి కానుందని కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్లాంట్ల మూసివేతపై ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఐజీ మెటల్ యూనియన్ స్పష్టం చేసింది. కార్మికులు, లోయర్ సాక్సనీ రాష్ట్రంతో కలిసి చర్చల ద్వారా రాజీ కుదిరిందని తెలిపింది.

# కెటిఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

## లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 4:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14,15 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి లక్సిన్నోవేషన్, లక్సెంబర్గ్ ప్రవేట్ ఈక్విటీ అండ్ వెంచర్ క్యాపిటల్ అసోసి యేషన్(ఎల్‌పిఈఏ) తరఫున ఆహ్వానం అందింది.

ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వా మ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడి, ఆవిష్కరణ వ్యవస్థలతో అనుసంధానించడంలో కేటీఆర్‌కు ఉన్న అనుభవం యూరప్‌లోని పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులకు ఉపయోగపడు తుందని తమ ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. భారత్, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల మధ్య పెట్టుబడి సంబంధాలను పెంపొం దించడంలో ఆయన దృక్పథం కీలకమని వారు అభిప్రాయపడ్డారు.



యూరప్‌లోని ప్రముఖ పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు పాల్గొనే ఈ కార్యక్రమం స్టార్టప్ ఫైనాన్సింగ్, వ్యాపార వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

గత యేడాది జరిగిన లక్సెంబర్గ్ వెంచర్ డేస్‌కు 28 దేశాల నుంచి 3,400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 300 మందికిపైగా పెట్టుబడిదారులు, 110 వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులు ఉన్నారు. యూరో పియన్ ఇన్నోవేషన్ ఫండ్, నాటో ఇన్నోవేషన్ ఫండ్‌తో పాటు యూరప్‌కు చెందిన పలు ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. యేడాది సదస్సులో యూరోపియన్ బిజినెస్ ఆంగెల్ నెట్‌వర్క్ వార్షిక సమావేశం, నాటో ఇన్నోవేషన్ ఫండ్‌తో కలిసి నిర్వహించిన డిఫెన్స్ వెంచర్‌డేతో పాటు యూరప్ లోని స్టార్టప్‌లు, స్కేల్‌అప్‌లకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా యూరప్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్టులు, పెట్టుబడిదారులు, ఫ్యామిలీ ఆఫీసులు, విధాన నిర్ణేతలు, స్టార్టప్ వ్యవస్థాపకులతో కేటీఆర్ సమావేశమయ్యే అవకాశం ఉంది. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు, సాంకేతికత, ఆవిష్కరణలు, స్టార్టప్ వ్యవస్థకు సంబంధించిన అంశాలపై కేటీఆర్‌కు వరుసగా లభిస్తున్న గుర్తింపుల్లో లక్సెంబర్గ్ వెంచర్ డేస్ ఆహ్వానం మరో ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది.

# అంగన్‌వాడీలో ఫుడ్ పాయిజన్

## ముగ్గురు చిన్నారులు, ఇద్దరు తల్లులకు అస్వస్థత

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ఇప్పటి వరకూ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ సంఘటనలు జరుగుతుండగా, తాజాగా చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్వాడీ కేంద్రాలకు సైతం అటువంటి సంఘటనలు జరుగుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఫుడ్ పాయిజన్ కారణంగా ముగ్గురు చిన్నారులు, ఇద్దరు తల్లులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కిష్టారంలోని 3 వ సెంటర్ అంగన్ వాడీ కేంద్రంలో ఈ నెల 1వ తేదీన చిన్నారులకు అంగన్‌వాడీ హెల్పర్ గోంగూర పప్పుతో వండిన అన్నం పెట్టారు. అయితే అంగన్‌వాడీ ఆవరణలో ఉన్న గోంగూర చెట్లతోపాటు పూలు పూసే గన్నేరు మొక్కలు కూడా పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో 1న గోంగూరతో పాటు గన్నేరు చెట్ల ఆకులను కూడా కోసి గమనించకుండా పప్పు వండటం జరిగింది. ఆ పప్పు అన్నం తిన్న ముగ్గురు చిన్నారులతో పాటు పిల్లలకు అన్నం తినిపిస్తూ రెండు ముద్దలు అన్నం తిన్న ఇద్దరు తల్లులు కూడా అస్వస్థతకు గురైనట్లు తెలియవచ్చింది. దీంతో హుటాహుటిన ముగురు చిన్నారులు, ఇద్దరు తల్లులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పెరుగుతున్న పన్నుల ఆదాయం

## రూ.30 వేల కోట్ల అదనపు ఇన్‌కమ్ ప్లాన్

## గతంకంటే రూ.19 వేల కోట్లు ఎక్కువ రాబడి

## పన్నుల ద్వారా రూ.40,534 కోట్లు వసూళ్లు

## ఫలితమిస్తున్న సర్కార్ ఆర్థిక సంస్కరణలు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణలో పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని సమర్థవంతంగా నియంత్రించేందుకు రాష్ట్ర సర్కార్ చేపట్టిన కీలక ఆర్థిక చర్యలు సత్ ఫలితాలనిస్తున్నాయి. దీంతో ఖర్చు తగ్గంతో పాటు, ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం. ఆరు గ్యారం టీ పథకాల అమలుతోపాటు ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, సబ్సిడీలు వంటి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో, ఖజానాపై భారం తగ్గించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇదేసమయంలో పన్నుల ఆధారిత వసూళ్లను పెంచడమే కాకుండా, పన్నేతర ఆదాయాన్ని పెంచే వ్యూహాన్ని కూడా అమలు చేస్తోంది. విభిన్న ప్రభుత్వ శాఖల్లో నిధుల వినియోగంపై కఠిన ఆంక్షలు విధిస్తూ, అవసరమైన పనులకే నిధులు ఖర్చు చేయాలంటూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఆర్థిక శాఖ ఇప్పటికే పన్ను లీకేజీల నియంత్రణ, వ్యర్థ వ్యయాల అరికట్టడానికి చర్యలు ప్రారంభించింది. పన్ను రహిత ఆదాయ వనరులను గుర్తించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలపై అధిక భారం పడకుండా అదనపు ఆదాయం సమీకరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వ్యయం తగ్గి, ఆదాయం క్రమేపీ పెరుగుతోంది. వివిధ శాఖల ద్వారా ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని పెంచడంతో పాటు భూముల అమ్మకం ద్వారా అదనంగా దాదాపు రూ.30 వేల కోట్ల రూపాయలను సమీకరించే లక్ష్యంతో చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మైనింగ్ రాయల్టీలు, ఇసుక అమ్మకాలు, నిరుపయోగ భూముల విక్రయాలు, రాజీవ్ స్వగృహ హౌసింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన ఆదాయ వనరులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అలాగే రెవెన్యూ ప్రధానంగా భూముల విలువలను మళ్లీ సవరించడం, రవాణా, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, వాణిజ్య తదితర వాటి ద్వారా ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల కాలానికి (ఏప్రిల్-జూలై) ప్రభుత్వానికి వివిధ ఆదాయ మార్గాలు మరియు రుణాల ద్వారా రాష్ట్ర ఖజానాకు మొత్తం ఆదాయ వసూళ్లు 93 వేల 388 కోట్లు చేరాయి. ఇక గత ఏడాది ఇదే కాలానికి వచ్చిన ఆదాయం కంటే ఈసారి రూ.19 వేల కోట్లు ఎక్కువగా సమకూరింది. ముఖ్యంగా జీఎస్టీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ తదితర శాఖల ఆదాయం పురోగతితో ఆశాజనకంగా ఉండటంతో ఇది సాధ్యపడింది. వ్యయం చూస్తే ఈ కాలానికి మొత్తం రూ.88,182 కోట్లు చేసింది. పన్నుల ఆదాయంలో జీఎస్టీ కింద రూ.19,103 కోట్లు, అమ్మకం పన్ను రూ.12,584 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కింద రూ.6,144 కోట్లు, ఇతర పన్నుల ద్వారా రూ.2,703 కోట్లు రాగా, పన్నేతర ఆదాయం రూ. 4,274 కోట్లు ఖజానాకు చేరాయి. ఈ విధంగా సర్కార్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు సత్ ఫలితాలను ఇస్తూ, ఖర్చు తగ్గడంతో పాటు, ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుం టోందని ఆర్థిక శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి.

వార్త

క్రమశిక్షణ, సౌశీల్యం, అంతర్దృష్టి, మానవీయత, కరుణ మొదలైన గుణాలు లోపించిన నాయకుల చేతుల్లో రాజకీయాలు ఉండటం కంటే అసలు రాజకీయాలే లేకపోవడం ఎంతో మేలు.

- రామ్ మనోహర్ లోహియా

# అవశేషమే విశేషం!

రైతు శరీరభాగాల్లో పురుగుమందుల అవశేషాలు కాన వస్తున్నాయన్న అంశంపై ఇప్పుడు ఎల్లెడలా విస్తృత చర్చ నడుస్తోంది. తన పంట బాగుకు అధిక దిగుబడికి పంట పొలాల్లో పురుగు మందులు చల్లడం, తెగుళ్ల మందుల పిచికారీలు చేయని రైతు ఉండడు. పంట బాగా పండి తన పెరట్లో గాదులు నిండితే చాలు నని రైతు సంతృప్తి పడతాడు. అందుకే వాళ్లు ఆరుగాలం, అహర్నిశలూ కష్టపడుతుంటారు. ప్రపంచదేశాల్లో సగం మంది శరీరంలో పురుగు మందుల అవశేషాలున్నా యన్న గణాంకాల కారణాలు ఏవైనా ప్రపంచానికి ఆహార భద్రతనిస్తున్న రైతు శరీరమే విషాలయంగా మారితే అందుకు బాధ్యులెవరో అంత తేలికగా తేల్చి చెప్పే విషయం కానేకాదు. ఇలాంటి దుర్భరపరిస్థితి ఉదంతాలు వెల్ల డైనప్పుడల్లా ప్రభుత్వాలు, రైతులు, పురుగుమందుల కంపెనీల్లోనూ సందిగ్ధతలు ఉదయిస్తాయి. కానీ మళ్లీ మళ్లీ షరామామూలే. ఇలాంటి ఉదంతాలు పునరావృత మవుతూనే ఉంటాయి. తన వ్యాపారం పెరుగుతుందని పురుగు మందుల తయారీ సంస్థ భావిస్తే రైతు మాత్రం మంచి దిగుబడి కోరుకుంటాడు. మధ్యేమార్గంగా ప్రభుత్వం ఆ ఇరుపక్షాల సంక్షేమం కోసం 'సాగు' ప్రణాళికలు రూపొందిస్తుంది. కానీ అవి వికటిస్తే రైతులకే అధోగతే. హరిత విప్లవం పేరిట దేశంలో దిగుబడులు పెరిగాయి. ప్రపంచ దేశాల్లో ఆహార భద్రతకు మేమే అని చెప్పుకుం టున్నాము. కానీ రైతు ఆకాంక్షలు, పురుగుమందుల నుండి రైతుకు రక్షణ, సాగుకు సంరక్షణ వంటి అంశా లపై పూర్తిస్థాయి భద్రతా విధానాలను పాటించేలా అవగాహన కల్పించడంలో ప్రభుత్వం ఇంకా ఒక అడుగు వెనకనే ఉంది. నిజానికి పంట విధానాలు ఎన్నున్నా 'పెస్టిసైడ్స్' వాడకంలో రైతు ఎక్కడో అక్కడ తప్పటడుగు వేస్తున్నాడని ప్రభుత్వాలు ఆరోపిస్తుంటాయి. వీటిలో ఎంత నిజం ఉన్నా లేకపోయినా రైతు ఆరోగ్యానికి చేటు తప్పడం లేదు. పురుగుమందుల వాడకంలో రైతును సరైనదారిలో పెట్టగల పథకాలేవీ ప్రభుత్వం వద్ద లేవు. శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతఅందుబాటులో ఉన్నా వాటిని సరైన దిశగా అమల్లో పెట్టే రైతాంగం లేదని అనుకోవ డం కష్టం. పంటను కాపాడే మందు అయినా ఇప్పుడా పురుగు మందే రైతు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. తాము వాడుతున్నది అసలు మందులా, నకిలీ మందులో జాడ తెలుసుకోలేక రైతు సందిగ్ధంలో పడిపోతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 93.4 కోట్ల మంది వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తుండగా వారిలో కనీసం సగం పైగా అంటే 40.2 కోట్ల నుంచి 43.3 కోట్ల మంది రైతుల వ్యవ సాయ కూలీల శరీరాల్లో పురుగు మందులకు సంబంధించిన విషపూరిత అవశేషాలను గుర్తించినట్లు 'పెస్టిసైడ్ యాక్షన్ నెట్వర్క్ సంస్థ' తన నివేదికలో వెల్లడించింది. పురుగుల మందుల బారిన పడి యేటా ప్రపంచ వ్యాప్తంగా 11వేల మంది చనిపోతున్నా రు. అందులో 60శాతంభారతీయులే. రైతులు, వ్యవసాయ కూలీలే అని ఒక అంచనా. పశ్చిమ ఆఫ్రికాలోని బుర్కినా ఫాసోలోని రైతాంగంలో 84 శాతం మంది రైతులు, కూలీల శరీరం లో విషకారకాలు బయటపడుతున్నాయి. రైతు పొలంలో చల్లే పురుగుమందుల వల్ల ప్రతి మట్టివిషం, పిల్లలకు చేరుతోంది. ఆ పని వారి రక్తంలో, మూత్రం లో, స్వేదంలోనూ ఈ విషప్రభావం చేరిపోతోంది. ప్రధా నంగా రైతు పురుగుమందుల వినియోగంలో అత్యాశకు పోయి వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదుకన్నా 3-4 రెట్లు ఎక్కువ మందు వాడుతున్నారు. ఒకమందు పనిచేయక పోతే మరో సంస్థ తయారీ మందును వాడే స్తున్నారు. ఎండో సల్ఫాన్, మోనోక్రోటోఫాస్, ఫోరేట్ వంటి అత్యంత విషపూరిత మందులను భారత్లో విక్రయించబడినా వాడుతున్నారు. ఇన్నాళ్లకు ఎండో సల్ఫాన్ వినియోగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హెచ్చరి కలు జారీ చేసింది. రైతును ఆ మందు వాడకుండా ఆపేందుకు ఈ ప్రయత్నం చేశారు. అసలు తయారీనే ఆపించాలి. వీటి వినియోగంతో రైతును ఆశించే అవేక్ పాలు క్యాన్సర్, కిడ్నీ ఫెయిల్యూర్, నరాల బలహీనత, సంతానలోపం, చర్మవ్యాధులకు దారితీస్తాయి. పంజాబ్ లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక రైలు ఉన్నట్లుగానే, కేరళలో ఎండో సల్ఫాన్ బాధితులు ఎక్కువ మంది ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఇలా రైతు శరీరంలో విషం ఉంటే వారు పండించే ధాన్యంలో మనం తినే ఆహారంలో కూడా ఉన్నట్లే. విష అవశేషాల ప్రభావం తల్లిపాల ద్వారా బిడ్డకు, విత్తనం ద్వారా తర్వాత పంటకు చేరిపోతోంది. ఇప్పటికే మార్కెట్లో 27 రకాల పురుగు మందులపై నిషేధం విధించాల్సి ఉందని రైతాంగం కోరుకుంటోంది. ఏవో కొన్ని కారణాల వలన కేంద్రప్రభుత్వం వాటి మీద దృష్టి పెట్టలేకపోతోం ది. కనీసం సేంద్రియ ఉత్పత్తుల ప్రత్యామ్నాయ అవ కాశం చూపితే రైతు ఒడ్డునపడతాడు. జీవన ఎరువులు, వేప ఆధారిత ఎరువులు, సమగ్ర సస్యరక్షణ విధానా లను రైతుకు చేరువచేస్తే తప్ప ఈ విషవలయంలోంచి బయటపడలేరు. ఈ అవశేషాలు ప్రాణాంతకం అన్న విషయం గతంలో కొన్ని ఉదంతాల వలన తేటతెల్లం అయింది. గత మూడేళ్లలో మహారాష్ట్రలో 183 మంది రైతులు పురుగుమందుల పీల్చడం వలన చనిపోయారు. 2017 ఆగస్టు, సెప్టెంబరు నెలలో 'యావత్మాల్'లో పత్తి పంటపై పిచికారీ చేసిన పురుగుమందులకు 21 మంది రైతులు, కూలీలు బలయ్యారు. 2024-26ల మధ్య రాజస్థాన్లో 535 మంది రైతులు ఈ పురుగుమందుల వాడకంతో మృతి చెందారు. ఇలా ప్రాణాంతక వ్యవసా యంగా మారితే రైతులు 'సాగు' రంగాన్ని వీడితే 'ఆహారభద్రత'కే గండి పడుతుంది.



రచయితల సంఖ్య పెరిగే కొద్దీ పాఠకులు సోమరులుగా మారడం సహజం.

గోల్డ్‌స్మిత్



ఒక కంటితో నిద్రపోతూ మరో కంటితో శత్రువులను కనిపెట్టి ఉండే ఎలుగుబంటిలా రాజు శత్రువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

శ్రీకృష్ణదేవరాయలు

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయొద్దు

**దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధిక శాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసిన వారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరపున మాట్లాడటానికి తమ సర్పంచ్ ఉన్నాడనే ధైర్యం ఆనాడు గ్రామ ప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులు లేక తలతాకట్టుపెట్టి అప్పో సప్పో చేసి గ్రామాభివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరించలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.**

దామెర్ల సాయిబాబ

కానుకలు, దక్షిణతాంబూలాలు, మొక్కులు అన్నీ సమ ర్పించుకున్న తర్వాత కూడా దైవం కోరిన వరాలు ఇవ్వక పోతే కోరికలు తీర్చకపోతే పోయావు తాము చెల్లించిన కానుకలు, దక్షిణలు తిరిగి ఇవ్వాలంటూ 'మాదన్నమాకీ రాజన్న దేవుడా' అంటూ భక్తులు వేములవాడలోని రాజ రాజేశ్వర స్వామిని వేడుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదా యం. భక్తులు సమర్పించిన కానుకలు తిరిగి వారికి చెల్లిం చడానికి ఆయన దగ్గర లక్ష్మి ఉండదు కనుక ఏదో వరం ఇచ్చి పంపుతారనేది భక్తుల విశ్వాసం. ప్రజాస్వామ్యవ్యవస్థ కు మూలస్తంభాలైన స్థానిక సంస్థల ప్రతినిధుల పరిస్థితి అందుకు అద్దంపడుతుందేమోననిపిస్తున్నది. పంచాయతీలకు నిధులు, విధులు ఇస్తాం, చట్టాలు తెచ్చాం, గ్రామ సమస్య లను గుర్తించి స్థానికంగానే సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నాం అంటూ ఎంతో కాలంగా పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. కానీ 'అయ్యా మాకేమీ కొత్త చట్టాలు చేసి అద నంగా నిధులు, అధికారాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణల ద్వారా కల్పించిన ముప్పై తొమ్మిది ప్రభుత్వ శాఖలను గ్రామస్థాయిలో తమకు అప్పగిస్తే అదే పదివేలని వారు ఎంతోకాలంగా వేడుకుంటున్నారు. చట్టం లో ఉంది కనుక ఇవ్వమని చెప్పలేరు,అలాని ఇవ్వరు. దశా బ్దాల తరబడి నాన్చుతూనే ఉన్నారు. ఇప్పటికీ చట్టంలో కల్పించిన సగం అధికారాలు కూడా వారికి ఇవ్వలేదు. ఇచ్చినా కొద్దిపాటి శాఖల్లోకూడా అనేక ఆంక్షలు, అధికారుల జోక్యాన్ని పెంచారు. అంతేకాదు ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారనే ఆరోపణలను కొట్టి వేయలేం. సర్పంచులకు గౌరవమర్యాదలకు ఎలాంటి లోటు ఉండదని అంటూనే ఇంకొకపక్క విద్యాకమిటీలు, వనరక్షణ కమిటీలు, నీటి సంఘాలంటూ స్థానిక సంస్థలకు సమాంత రంగా వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్పంచు పదవులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఎన్నోసంక్షేమ కార్యక్ర మాలను, చివరకు లబ్ధిదారుల గుర్తింపులు కూడా జరిగి పోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ఆరంభమైంది కాకపో యినా రెండు,మూడు దశాబ్దాలుగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను బల హీనపరిచే కార్యక్రమం జరుగుతు న్నది. చివరకు చీపురుకట్ట కొనడానికి కూడా స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క ఖర్చు లు పెరిగిపోతున్నాయి. ఆదాయం అంతంత మాత్రమేఉంది. ఆస్తిపన్ను తప్ప మరోపెద్ద ఆదాయవనరు లేకుండాపోయిం ది. ఇకగ్రామంలో ఏ అభివృద్ధి చేయాలన్నా అటు కేంద్ర ప్రభుత్వం వైపు, ఇటు రాష్ట్ర ప్రభుత్వంవైపు చేయి చాచే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏకోణంలో చూసినా పంచాయతీ రాజ్ వ్యవస్థను అంతోఇంతో నిర్వీర్యం చేయాలని అందరూ ప్రయత్నం చేసినవారే. తమ అధికారాలకు, ప్రాబల్యానికి దెబ్బ తగులుతుందనే భయమే ఇందుకు కారణమని చెప్పొ చ్చు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే రాజకీయ ప్రవేశం చేసి ఉన్నతస్థాయికి చేరిన కొందరు నాయకులుకూడాపంచా యతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. దేశంలో కానీ, రాష్ట్రాల్లోకానీ ఎంతో సమర్థవం తులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధికశాతం పంచా యతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసినవారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి

## ఒక్క మాట

అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరపున మాట్లాడటానికి తమ సర్పంచ్ఉన్నా డనే ధైర్యం ఆనాడు గ్రామప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులులేక తలతాకట్టు పెట్టి అప్పోసప్పో చేసి గ్రామా భివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరిం చలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లులకోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. వాటి నిర్ణయాలకు ఆనాటిరాజరిక వ్యవస్థ ఎంతోప్రాముఖ్యత ఇచ్చిం ది. ప్రాచీన కాలం నుండే గ్రామవ్యవస్థ ఏదో ఒకరూపంలో మనదేశంలో కొనసాగుతూ వచ్చింది. 1882లో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. స్వాతం త్ర్య నంతరం 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే కేంద్ర ప్రభుత్వం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ప్రారంభించింది. దాదాపు వంద గ్రామాలకు సుమారు లక్ష జనాభాతో ఒకయూనిట్‌ను ఏర్పాటు చేసి సామాజికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కొంతకాలం కొనసాగిన పిదప అవి ఏ మేరకు లక్ష్యసాధనలో గ్రామ ప్రజలకు ఉపయోగ పడ్డాయి? ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు మార్పులు అవసరమా? అవసరమైతే ఎలాంటి మార్పులు చేయాలి? తదితర అంశాలపై అధ్యయ నం చేసేందుకు 1957లో ఒక కమిటీని వేశారు. బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన ఈ బృందం దేశంలోని అనేక ప్రాంతాలు పర్యటించి సమగ్రంగా పరిశీలించి 1958లో ఒక నివేదిక సమర్పించింది. గ్రామాభి వృద్ధికి నిర్ణయాలు తీసుకునే అధికారం, స్వేచ్ఛస్థానిక సంస్థ లకే ఉండాలని,అవి మూడంచెల విధానంలో ఉంటే బాగుం టుందని తదితర స్పష్టమైన సూచనలు చేసింది. ఆ సూచ నల మేరకే దేశంలో మొదట రాజస్థాన్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. 1964లో గ్రామపంచాయతీ చట్టం తీసుకువచ్చారు.ఎంపి పాయ్‌కమిటీ నివేదికను అనుసరించి 447 బ్లాకులను, 321కు కుదింపు చేశారు. 1985లో సమితులను రద్దు చేసి అంతకుముందు అశోక్ మెహతా కమిటీ చేసిన సూచనలమేరకు 1986లో మండల్ ప్రజాపరిషత్,జిల్లా ప్రజాపరిషత్‌ను ఏర్పాటు చేశా రు. ఇలా ఎన్నోమార్పులు చేర్పులు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే తరహా పంచాయతీ రాజ్ వ్యవస్థ అమలులో ఉండాలనే ఉద్దేశ్యంతో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించిం ది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 మే 30వ తేదీ నుండి ఈశాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టప్రకా రమే రాష్ట్రంలో ఐదంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. జెడ్‌పి టిసి, ఎంపి టిసిలని కొత్త పదవులు సృష్టించారు. కనీసం కూర్చోడానికి కుర్చీకూడా లేకుండా, అధికారాలు లేకుండా ఆ పదవులు ఎందుకు సృష్టించారో ఇప్పటికీ అర్థంకాదు. ఎన్ని మార్పులు చేసినా,మరెన్ని కూర్పులుచేసినా, అధికార వికేం ద్రీకరణ మాత్రం మొదటి నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్త పడుతూనే వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2018 ఏప్రిల్ నుంచి కొత్తచట్టాన్ని తీసుకువచ్చింది. ఈచట్టప్రకారం మరి కొన్ని అధికారాలతో పాటు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలకు అవకాశాలు ఇచ్చింది.మొన్న తెలంగాణలో నూత నంగా ఎన్నికైన సర్పంచులు కొలువు తీరారు.ఆంధ్రప్రదేశ్‌లో త్వర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయి. అనేక సమస్యలు వారి ముందు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిఉన్నాయి. ప్రగతికిమూలం కావాల్సిన పల్లెలు సమ స్యల నిలయాలుగా ఉన్నాయి. ప్రతి గ్రామం ఏదోరక మైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. స్థానిక సంస్థలను భాగ స్వామ్యం చేయకపోడంతో లబ్ధిదారుల గుర్తింపులో కూడా అనేక అవకతవకలు జరుగుతున్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీ పరిధిలోకి తీసు కురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగం కల్పించిన అధికారాలు, స్థానిక సంస్థలకు ఇవ్వ డంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న రాష్ట్రాల నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధి కారాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ●

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భరోసా ఏది?

డా. మోటె చిరంజీవి

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పథకంపై ప్రభుత్వ చిత్తశుద్ధి అవసరం.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ఫీజు రీయిం బర్స్‌మెంట్ పథకం అత్యంత కీలకం. ఆర్థిక స్థోమత లేక చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితిలో ఉన్న అనేక మంది విద్యార్థులకు ఈ పథకం ఒక ఆశాకిరణంగా నిలిచింది. అయితే రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదం డ్రులతో పాటు విద్యాసంస్థల యాజమాన్యాల్లోనూ ఆందో ళన కలిగిస్తోంది. విద్య అనేది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు ఇంజినీరిం గ్, వైద్య, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, వృత్తివిద్య వంటికోర్సులు అభ్యసించేందుకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందితేనే విద్యార్థులు ఆర్థిక ఒత్తిడి లేకుండా తమ చదువును కొనసాగించగలరు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతే దాని ప్రభావం విద్యార్థులపైనే కాకుండా కళాశాలల నిర్వహణపైనా పడు తుంది. బోధనా సిబ్బంది జీతాలు, మౌలిక వసతుల నిర్వహణ, విద్యాప్రమాణాల కొనసాగింపు వంటి అంశాలు ఆర్థిక సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుంది. చివరికి దీనిప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపైపడటంఆందోళనకరం. 2019-20 రూ.27 కోట్లు, 2020-21 రూ.151 కోట్లు, 2021-22 రూ.762 కోట్లు,2022-23 రూ.1,432 కోట్లు, 2023-24 రూ.1,147 కోట్లు, 2024-25 రూ. 24 కోట్లు పెండింగ్ టోకెన్ల మొత్తం రూ.3,543 కోట్లు వున్నాయి. తెలంగాణలో ప్రొఫెషనల్, నాన్‌ప్రొఫెషనల్ కోర్సులకు కలిపి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్ల వార్షిక కేటాయింపు చేస్తోంది. 2025-26 నాటికి బకాయిలు భారీగా పెరిగి, 2024-25 వరకు మొత్తం బకాయిలు సుమారు రూ.9,000 కోట్ల వరకు ఉన్నాయని ప్రైవేట్ కళాశాలల సమాఖ్యలు పేర్కొన్నాయి. ప్రభుత్వాలు పథకాలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటికి అవసరమైన నిధులను సకాలం లో విడుదల చేయాలి. ముఖ్యంగా విద్యార్థుల చదువుతో ముడిపడిన పథకాల విషయంలో ఆలస్యం మరింత తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పారదర్శకమైన, నిరంతర చెల్లింపు వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పెండింగ్ బకాయి లను దశలవారీగా కాకుండా సాధ్యమైనంత త్వరగా పరి ష్కరించడంతోపాటు, భవిష్య త్తులో బకాయిలు పేరుకుపో కుండా బడ్జెట్‌లో తగిన కేటా యింపులు చేయాలి.పేదరికం కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. నిధుల విడుదలలో జాప్యం లేకుండా, విద్యా ర్థుల భవిష్య త్తుకు భరోసా కల్పించే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయడమే సమాజ శ్రేయస్సుకు సరైన మార్గం. ●

# ప్రజావాక్కు



## గురువులను గౌరవిద్దాం

**నేటి** విద్యార్థుల్లో కొందరికి గురువులంటే భయం, భక్తి, గౌరవం తగ్గిపోతున్నాయి. తరగతి గదుల్లోనే గురువులపై కామెంట్లు చేస్తూ,వెకిలిచేష్టలు చేయడంబాధాకరం. గురు వులు తప్పును సరిదిద్దేందుకు మందలిస్తే,కొందరు విద్యా ర్థులు దారుణంగా ప్రవర్తిస్తూ బెదిరించే స్థాయికి వెళ్తున్నా రు.తమ జీవితానికి మార్గదర్శనం చేసే గురువుల పట్ల కనీస గౌరవం లేకుండా ప్రవర్తించడం సరికాదు.గురువు చెప్పే మాటలు మన భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి మార్గదర్శకత్వమని విద్యార్థులు గుర్తించాలి. గురువులను గౌరవించడం అంటే విద్యను, జ్ఞానాన్ని, మన భవిష్య త్తునుగౌరవించడమే. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. పిల్లలు తప్పులు చేయకుండా తల్లిదండ్రులు కూడా వారి ప్రవర్త నను గమనిస్తూ చూడాలి. గురువు విలువను గుర్తించి గౌరవించ డం ప్రతి విద్యార్థి బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## పరిశోధకులను నియమించుకోవాలి

**తెలంగాణా** రాష్ట్రంలో గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నూతన సంస్కరణలో భాగంగా పరిపాలనా పర మైన పరిశోధనలు అవసరం. ప్రతిమంత్రిత్వ శాఖ పరిధి లో ఆయా కార్యాలయాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యో గులలో ఉన్నత విద్యలను అభ్యసించి వివిధ యూనివర్సి టీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన ఉద్యోగుల వివరాలు సేకరించాలి. వారిద్వారా ఆయా శాఖలలో పని విధానం, నిధులు, సౌకర్యాలు, సమస్యలు, పరిష్కరించడం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సహాయకులుగా పనిచేయ డానికి సలహాలు సూచనలు ఇవ్వడానికి వారిని నియమిం చుకోవాలి. ఆయా శాఖల అభివృద్ధికి గాను వీరి సేవలను వినియోగించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## మట్టి విగ్రహాలను పూజిద్దాం

**రాబోయే** గణపతి ఉత్సవాల్లో భాగంగాకేవలం మట్టి విగ్ర హాలను మాత్రమే పూజించి పర్యావరణాన్ని కాపాడుకునే ప్రయత్నం చేద్దాం.మారుతున్న కాలానుగుణంగా రకర కాల రంగురంగుల వినాయక విగ్రహాలను పర్యావరణ పరిరక్షణకు ఇబ్బంది కలగడమే కాకుండా చెరువుల్లో నిమ జ్జనం చేసినప్పుడు నీరు కలుషితంతో పాటు వాటిని త్రాగే పాడిపశువులు,సకల జీవరాశులు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

## అయినా! ట్రంప్ మారడు

**అమెరికా** వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ పరిశ్రమ లను కాపాడటమనే ప్రధాన ఉద్దేశ్యంతో అంతర్జాతీయ వాణి జ్యంలో ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వస్తువులపై విధించే కస్టమ్స్ సుంకాలను ఎడాపడా వేసారు. ఇంతకు ముందున్న అమెరికా అధ్యక్షులెవరికీ లేని దుందుడుకుతనం ట్రంపుది.రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు కొనసా గించడంపై ట్రంప్‌ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తూ,భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ సర్కార్ అదనపు టారిఫ్‌లు, సుంకాల పెంపునిర్ణయాలు ప్రకటించింది. అంతేకాదు జనరిక్ ఔషధాలపై కూడా ట్రంప్ టారిఫ్ విధించారు. ఈకొత్త టారిఫ్ ల విధానాలపై అమెరికాలోని పలు రాష్ట్రాలు కోర్టును కూడా ఆశ్రయించాయి. కోర్టుల్లో పలు కీలక వ్యతిరేక తీర్పులు (ఎదురుదెబ్బలు) తగిలాయి. ఐనా! ట్రంప్ మారడం లేదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## రైతులకు పశువులను అందించాలి

**వర్షాభావ** పరిస్థితులను ఎదురుకునేందుకు పశువులను రుణా లపై అందించాలి అని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించ డం సంతోషకరం. అది గ్రామీణా ఉపాధి కల్పనా కార్యక్రమం ద్వారా కావొచ్చు, లేక ముద్ర పథకం ద్వారా కావొచ్చు. సెర్ప్ సంస్థ పెద్దన్న పాత్ర పోషించి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా డెయిరీని ఏర్పాటు చేసి విజయ డెయిరీ ద్వారా పాల కొనుగోలు కూడా చేపట్టడం గొప్ప అవకాశం. గత ప్రభుత్వం గొర్రెలు దిగుమతి ఆపడానికి గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గొర్రెల సంఖ్యలో దేశంలో రెండో స్థానంలో నిలిపితే ఇప్పటి ఈ ప్రభుత్వం పాల దిగుమతిని ఆపుటకు త ద్వారా పాల ఉత్పత్తి సాధించుటకు కృషి చేస్తున్నది. అయితే ఉపాధి హామీ లేదా వీబీ జీరామ్ జీ ద్వారా ఈ ప్రాజెక్ట్ కూడా చేపడితే పథకం సంపూర్ణ ఫలితాలు అందిస్తుంది.

- భారత అవినాష్, జనగామ

## ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించాలి

**భారత్** చుట్టూ ఉన్న భౌగోళిక, భద్రతా పరిస్థితులను దృష్టి లో ఉంచుకుంటే దేశ రక్షణసన్నద్ధతలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు లేదు. సరిహద్దుల్లో శాంతి కొనసాగాలని భారత్ కోరుకుంటున్నప్పటికీ, ఎలాంటి అనూహ్య పరిస్థితినైనా ఎదు ర్కొనే సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. శాంతిని కోరుకోవడం బలహీనత కాదు,శాంతిని కాపా డగల సైనిక సామర్థ్యమే నిజమైన నిరోధక శక్తి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

# ఆచార్య దేవోభవ! అదే మన స్ఫూర్తిప్రదాత



శ్రీమతి ద్రౌపదీ ముర్ము

తలరాతను మార్చేది ఉపాధ్యాయులే. కోట్లాది మంది విద్యా ర్థుల జీవితాల్లో విజ్ఞానం, నైపుణ్యా లు, విలువలు, స్ఫూర్తి నింపి సుసంపన్నం చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతీయులందరి తరపున కృతజ్ఞ తలు తెలియజేస్తున్నాను. తన జన్మ దినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్స వంగా నిర్వహించాలని భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వ ర్తించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆకాంక్షించిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచిన మేధావి. ప్రఖ్యాత రచయిత. గొప్ప రాజనీతిజ్ఞుడు. అయినప్పటికీ ఉపాధ్యాయునిగా తానుపోషించిన పాత్రనే అన్నింటి కంటే మిన్నగా భావించారు. అత్యంత ఆదరణ పొందిన రాష్ట్రపతుల్లో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంకు ఒక సందర్భంలో మిమ్మల్ని శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలా? రాష్ట్రపతిగాగుర్తుంచుకోవాలా? అనే ప్రశ్న ఎదురయింది. తనను ఓ ఉపాధ్యాయుడిగా గుర్తుంచుకోవాలనిడాక్టర్ కలాం సమాధానమిచ్చారు. సామర్థ్యం, నైతిక విలువలే ఉపాధ్యా యులను పూజనీయులుగా మారుస్తాయి. అలాంటి వారినే విద్యార్థులు దైవంగా భావిస్తారు. వారినే ఆదర్శంగా తీసుకుంటారు. విద్యార్థులపై కోపం ప్రదర్శించకూడదని, సహనంతో ఉండాలని ప్రాచీన గ్రంథాలు సూచిస్తున్నాయి. 'ఆచార్యదేవో భవ' అనే కాలాతీత సందేశాన్ని దాదాపు మూడు సహస్రాబ్దాల క్రితం నాటి తైత్తిరీయ ఉపనిషత్తు లోని శిక్షావల్లి అందిస్తోంది.ఎంతోమంది వివేకవంతులైన, ప్రేమ నిండిన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పొందడం నాకు కలిగిన గొప్ప అదృష్టం. కొన్నిసందర్భాల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాత సైతం తమ గృహాల్లోనే వారు మాకు పాఠాలు చెప్పేవారు. మమ్మల్ని ఎంతోజాగ్రత్తగా చూసుకొనేవారు. ఏడో తరగతి తర్వాత పైచదువుల కోసం మా ఊరు నుంచి బయటకు వెళ్లిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్నప్పుడూ నా ఉపాధ్యాయుల నుంచి అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందగలగడం నాకు దక్కిన భాగ్యం. నా ఉపాధ్యాయుల గురించి ఎంతో వినయంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే వారి కథ... ప్రేమ, అంకితభావంఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలోఅపరిమితమైన సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరు అనే గొప్ప సత్యాన్ని తెలియ జేస్తుంది. మంచి ఉపాధ్యాయున్ని తీర్చిదిద్దే సూక్ష్మం ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతీసంప్రదాయాల ద్వారా మనకు లభించింది. అది నేటి కాలానికి సైతం వర్తిస్తుంది.శతాబ్దాల క్రితం, మహాకవి కాళిదాసు తన మాళవికాగ్నిమిత్రం నాట కంలో, అపారమైన జ్ఞానాన్ని ఉండటంతో పాటు, దానిని ఇతరులకు అందించగల సామర్థ్యం ఉన్నవారే మంచి ఉపాధ్యాయుడు అని రాశారు. విద్యార్థుల్లో స్వతంత్ర్య ఆలోచనను ప్రోత్సహించడం,వారిలో ఆసక్తిని రేకెత్తించడం, తర్కాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, నిర్ణయ సామర్థ్యానికి పదును పెట్టడం, వారు సాధికారత సాధించిన వ్యక్తులుగా ఎదగడానికి సాయ పడటం ఇవే బోధనకు ఉన్న అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలాన్ని అందించే ఉప యుక్తకర అంశాలు. బోధన అంటే మానవాళిని తీర్చిదిద్దే పవిత్రమైన కార్యం.భవిష్యత్తు తరాలకు ప్రకాశవంతమైన మార్గాన్నిఅందించే ఉన్నతమైన బాధ్యత. బోధనకు సంబం ధించిన నా జ్ఞాపకాలు నాకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తాయి. నేను ఒడిశాలోని రాయరంగ్‌పూర్‌లో ఉన్న శ్రీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో చిన్నారులకు బోధించాను. వివిధ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు... సంగీత ప్రదర్శనలకు, క్రీడలకు, నాటకాలకు వారిని సిద్ధం చేయడం లో పూర్తిగా నిమగ్నమై ఉండేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలకోసం మా సన్నాహాలను, ఆ సమయం లో పిల్లల ఆనందోత్సాహాలను గుర్తు చేసుకుంటే ఈనాటికీ నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. విద్యార్థులను అంద మైన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడంలో గొప్ప సంతృప్తిని, అర్థాన్ని కనుగొన్నాను. పాఠశాల విద్యపూర్తయి ఏళ్లు గడిచినా...ఇప్పటికీ నా విద్యార్థులు వారి కుటుంబ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థుల్లో చాలా మంది పేర్లు నాకు స్పష్టంగా గుర్తున్నాయి. వాటితో పాటు మేం వారిని పిలిచిన మారు పేర్లు కూడా గుర్తున్నా యి. నా విద్యార్థుల నుంచి నేను కూడా చాలా నేర్చుకున్నా ను. బాలల నుంచి తక్షణమేస్పందించే గుణాన్ని, ఆసక్తిని ఉపాధ్యాయులు నేర్చుకుంటారని నేను విశ్వసిస్తాను. రాష్ట్ర పతిగా రెండో సంవత్సరాన్ని నేను పూర్తి చేసుకున్నప్పుడు రాష్ట్రపతి భవన్ ఆవరణలోని పాఠశాల విద్యార్థులతో సమయం గడిపాను. అప్పుడు వారికి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించాను. నేను ఎల్లప్పుడూ విద్యార్థులను కలవడానికి, వారి ఆలోచనలను, అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ఆసక్తి చూపుతాను. వారు పంచుకునే విష యాలు నాకు గుర్తుండిపోతాయి. సుమారు పదకొండేళ్ల క్రితం, నేను మా ఊరిలోఒక గురుకుల పాఠశాలను స్థాపిం చాను. ఆ పాఠశాలలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు చదువుకుంటారు. వారిని కలుసుకొనేం దుకు అప్పుడప్పుడూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజు సందర్భంగా ఆబాలల తో సమయం గడపడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సైతం నాతో పాటు పాఠ శాలను సందర్శించి వారిలో స్ఫూర్తి నింపారు. ప్రధానిని కలుసుకున్న అసాధారణ అనుభవం వారికి చిరకాలంస్ఫూర్తి నిచ్చేదిగా నిలిచిపోయింది. విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులకుమాత్రమే పరిమితం కాదు. తమ ప్రవ ర్తన, విజయాల ద్వారా బాలలకు ఆదర్శంగా నిలిచేవారు కూడా నేర్చుకోవడానికి, స్ఫూర్తికి విలువైన వనరుగా ఉం టారు. తమ పిల్లలను చదువుకోవడానికి పంపించేటప్పుడు ఉపాధ్యాయులపై అత్యంత విశ్వాసాన్ని తల్లిదండ్రులు, సంరక్షులు ఉంచుతారు. విద్యార్థులను తమ సొంత పిల్లలా చూసుకుంటారని, వారి భద్రత, అభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారనివారు నమ్ముతారు. తమపై ఉంచిన ఈ పవిత్రమైన నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఉపా ధ్యాయుని ధర్మం. ఉపాధ్యాయుని వైఖరి, ప్రవర్తన, నడ వడిక బాలల్లో భయాందోళనలను కలిగించకూడదు, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు. లేదా వారిలో ఎలాంటి న్యూనతా భావం పెరిగేలా చేయకూడదు.విద్యార్థులను తమ లాంటి ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దేలా ఉత్తమ ఉపాధ్యా యులు దోహదపడతారు. తమ విద్యార్థులను మంచి వ్యక్తు లుగా తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యత ఉపాధ్యాయులదే.తమ ఆలోచనల్లో, చేతల్లో నైతికతను పాటిస్తూ,సంపదను, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తారు. సామాజిక సమ్మిళితత్వమే కేంద్రంగా ఎదగాలనే లక్ష్యం దిశగా భారత్ స్థిరంగా ప్రయాణిస్తోంది. పర్యావరణాన్ని, సకల జీవరాశులను పరిరక్షించే, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సుకోసం కృషి చేసే, దేశమే ప్రథమం అనేస్ఫూర్తితో ముందుకు సాగే విద్యార్థులనుఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని నేనుకోరుకుంటున్నాను. భారత్ అగ్రగామిగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ●

(రచయిత భారత రాష్ట్రపతి)


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో

## - ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా - 2027 ఫిబ్రవరి వరకూ కొనసాగే అవకాశం - ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలు అధికంగా నమోదు : డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో





**జెనీవా, సెప్టెంబర్ 4:** ఎల్ నినో వాతావరణ దృగ్విషయం 2027 వరకు మరింత తీవ్రతరం కానుందని, ఇది ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చని, తద్వారా వచ్చే ఏడాది తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) తెలిపింది. అసాధారణంగా వేడెక్కిన పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతల కారణంగా, ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం దాదాపు 100శాతం ఉందని తమ అంచనాలు చూపిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి వాతావరణ సంస్థ తెలిపింది. ఇంతటి నిశ్చయతను వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి అని డబ్ల్యూఎంఒ పేర్కొంది. "ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, ఇది అత్యంత బలమైనదిగా మార వచ్చు. అంటే, అక్షరాలా ఊహించని స్థాయిలో ఉంటుంద్ణి అని డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో జెనీవాలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎల్ నినో అంటే బల హీన పడుతున్న వాణిజ్య పవనాల వల్ల తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడం. ఇది ప్రతి రెండు నుండి ఏడు సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. 12 నెలల వరకు కొనసాగుతూ, లాటిన్ అమెరికా అంతటా తీవ్రమైన వర్షాలకు, కరువులకు కారణమవుతుంది. చాలా బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిని గణనీయంగా మార్చగలదు. కరువులు, తుఫానుల వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది. వేడెక్కుతున్న సముద్రం: ఇది సహజంగా సంభవించే దృగ్విషయమే అయినా శిలాజ ఇంధనాల వల్ల కలిగే వాతావరణ మార్పుతో దీనికి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, వేడెక్కుతున్న సముద్రపు ఉష్ణోగ్రతల వల్ల ఇది తీవ్రతరం కావచ్చు. "ఎల్ నినో మన కళ్ల ముందే భారీ స్థాయికి చేరుకుంటోంది. దీంతో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయ్ణి అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. 1950 నుండి నమోదైన గణాంకాల ప్రకారం, గతంలో నమోదైన నాలుగు ఎల్ నినో ఘటనలలో కంటే, ప్రస్తుత ఎల్ నినో సమయంలో, పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ (3.6 డిగ్రీల ఫారెన్‌హీట్) కంటే ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తెలిపింది. ఈ ఘటన ఇప్పటికే ఉష్ణ మండల ప్రాంతాల్లోని వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం చూపింది, దీనివల్ల మధ్య అమెరికాలోని 'డ్రై కారిడార్ణ్ ప్రాంతంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. ప్రపంచ ఉష్ణోగ్రతలలో పెరుగుదల: ఈ యేడాది చివరి నాటికి ఇది గరిష్ట స్థాయికి చేరుకుంటుందని డబ్ల్యుఎంఒ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే దీని ప్రభావాలు 2027 వరకు కొనసాగుతాయని, వచ్చే యేడాది ప్రపంచ ఉష్ణోగ్రతలు మరింత పెరిగేలా చేస్తాయని డబ్ల్యుఎంఒ అధికారులు పేర్కొన్నారు. "సాధారణంగా ఎల్ నినో ఘటన తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రతలలో ఒక తాత్కాలిక పెరుగుదల కనిపిస్తుంద్ణి అని డబ్ల్యుఎంఒ వాతావరణ అంచనా సేవల విభాగం అధిపతి విల్‌ఫ్రాన్ మోఫౌమా ఒకియా విలేకరులతో అన్నారు. ఇప్పటివరకు అత్యంత వేడిగా నమోదైన 2024 సంవత్సరాన్ని ప్రస్తావిస్తూ, "2027 రికార్డు స్థాయిలో అత్యంత వేడి సంవత్సరంగా మారే అవకాశం ఉంద్ణి అని ఆయన పేర్కొన్నారు.

# పెనువిషాదాన్ని మిగిల్చిన నేపాల్ భారీ వరదలు!

## 17వేల మంది చిన్నారులపై విపత్తు ప్రభావం

**ఖాట్మండు, సెప్టెంబరు 4:** నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. గతనెల 26న నేపాల్‌చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనానేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 5,000 వరకూ ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని కనుగొనడంలో తెగిపోయిన నెట్‌వర్క్‌లు అతిపెద్ద సవాలుగా మారాయి.

టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. డీఎన్ఏ నమూనాలు సేకరించి మృతులను గుర్తించేందుకు నేపాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.




# నవంబరు 10న భారత్‌లో సోనియా ఆత్మకథ విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** సోనియా గాంధీ రాసిన బిలాంగింగ్-ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకానికి భారత్‌లో కొత్త ప్రచురణకర్త ఖరారైంది. హార్పర్‌కాలిన్స్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించనుంది. 2026 నవంబర్ 10న భారత్‌లో పుస్తకం విడుదల కానుంది. ఈ విషయాన్ని హార్పర్‌కాలిన్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. అత్యంత ఆసక్తి రేపుతున్న రాజకీయ జ్ఞాపకాల పుస్తకాల్లో ఇదొకటని తెలిపింది. ప్రేమ, గుర్తింపు, బాధ్యత, అనుబంధం వంటి అంశాల చుట్టూ సోనియా గాంధీ వ్యక్తిగత జీవితాన్ని ఇందులో వివరించినట్లు పేర్కొంది. ఇటీవల సోనియా గాంధీ పుస్తకానికి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదని ప్రకటించింది. పుస్తకంలోని కొన్ని అంశాలపై రచయితతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని సంస్థ తెలిపింది. అయితే సంపాదకీయ మార్పులకు సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నారన్న వార్తలను పెంగ్విన్ ఖండించింది. బాహ్య ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేసింది. బిలాంగింగ్ పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ నవంబర్ 10న విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించింది. భారత్‌లో మాత్రం ప్రచురణ బాధ్యతలు ఇప్పుడు హార్పర్‌కాలిన్స్ ఇండియాకు దక్కాయి. ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన ఆరు దశాబ్దాల అనుభవాలను ప్రస్తావించారు. 1984లో అత్త ఇందిరా గాంధీ హత్యతో తన జీవితం ఎలా మారిందో వివరించారు. 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన పరిస్థితులనూ పంచుకున్నారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తీరాన్ని పుస్తకంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగిన సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించారు.

2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన పరిణామాలనూ ఆమె తన పుస్తకంలో ప్రస్తావించారు.

# భారత్ కంపెనీతో రూ. 769 కోట్ల ఆయుధ డీల్..

## ఎస్తోనియా రక్షణ మంత్రి రాజీనామా



**టల్లిన్, సెప్టెంబరు 4:** ఆయుధాల ఒప్పందం విషయంలో బయటపడిన అవకతవకలు ఎస్తోనియా రక్షణ మంత్రి పదవికి ఎసరు తెచ్చాయి. రూ. 768.50 కోట్లతో ఫిరంగి మందుగుండు సామగ్రి కొనుగోలుకు సంబంధించిన తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో హాన్నో పెవ్కుర్ రాజీనామా చేశారు. ఈ డీల్‌కు సంబంధించి ఆడిట్‌లో తేలిన అక్రమాల ఆధారంగా నేర విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో హాన్నో నైతిక బాధ్యత వహిస్తూ రక్షణమంత్రి పదవి నుంచి వైదొలిగారు. ఈ వివాదంలో భారత్‌కు చెందిన ఓ కంపెనీ కేంద్ర బిందువుగా మారడం గమనార్హం. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మందుగుండు సామగ్రి కొరత ఏర్పడింది. కీవ్ కోసం వాటిని సమీకరించేందుకు మరో ఐరోపా దేశం ఎస్తోనియా.. ఇటలీకి చెందిన డేటాసెల్ ఎస్ఆర్ఎల్ కంపెనీతో 2024లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటాసెల్ కంపెనీని అదే యేడాది ఆరంభంలో భారత్‌కు చెందిన నెకో డిఫెన్స్ కొనుగోలు చేసింది. ఈ మొత్తం ఒప్పందం విలువ 70 మిలియన్ల యూరోలు. ఐరోపా యూనియన్‌కు చెందిన యూరోపియన్ పీస్ ఫెసిలిటీ నుంచి వచ్చిన డబ్బును ఎస్తోనియా ఈ కంపెనీకి దశల వారీగా ముందుగానే చెల్లించింది. కొన్ని నెలల్లోనే ఈ ఆర్టిల్లెరీ షెల్స్ ఉక్రెయిన్‌కు చేరుకుంటాయని అంతా భావించారు. కానీ, ఆయుధ సరఫరాలు పదేపదే ఆలస్యమయ్యాయి. 2025లో కొన్ని షెల్స్ డెలివరీ అందినా.. అవి పూర్తిగా లోపాలతో ఉన్నాయని ఎస్తోనియా ఆరోపించింది. దీంతో వాటిని ఉక్రెయిన్‌కు పంపించలేదని తెలిపింది. తాను చెల్లించిన డబ్బు తిరిగి పొందేందుకు ఎస్తోనియా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, ఈ ఆరోపణలను డేటాసెల్ తిప్పికొట్టింది. తాము చాలావరకు డెలివరీలు అందించామని, ఒప్పందం గడువు ముగియడానికి ముందే 59 మిలియన్ యూరోల విలువైన మందుగుండు సామగ్రిని సరఫరా చేశామని వెల్లడించింది. అలాగే నాణ్యతా సమస్యల కారణంగానే ఒప్పందం రద్దు చేసుకున్నారన్న వాదనలను ఖండించింది. ఈ వ్యవహారం నేపథ్యంలో ఎస్తోనియాపై డేటాసెల్ కంపెనీ దావా వేసింది. ఈ నేపథ్యంలోనే ఎస్తోనియా రక్షణ నిధుల నిర్వహణ, సైనిక కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ చేపట్టగా అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై విమర్శలు రావడంతో రక్షణ మంత్రి రాజీనామా చేశారు. ఈ డీల్‌కు చెల్లించిన డబ్బులు ఐరోపా యూనియన్‌కు తిరిగిరాకపోతే.. ఎస్తోనియా తన సొంత బడ్జెట్ నుంచి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఎస్తోనియా దేశం ఐరోపా యూనియన్, నాటో కూటమిలో భాగం. దీనికి రష్యాతో సరిహద్దు ఉంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ దేశంలో కూడా భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తాయి. అలాగే ఉక్రెయిన్‌కు ఎస్తోనియా కీలక మద్దతుదారుగా ఉంది.

# రామభక్తుల దీవెనలే నాకు ముఖ్యం

## అయోధ్య రామమందిరం కొత్త సిఇఒ జితేంద్ర



**అయోధ్య, సెప్టెంబరు 4:** అయోధ్య రామాలయం సీఈవోగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులైన విషయం తెలిసిందే. అయితే రామభక్తుల మద్దతు, దీవెనలు తమకు ముఖ్యమని ఆయన అన్నారు. రామ ట్రస్టు వ్యూహాలు త్వరలో ఆచరణలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. ట్రస్టు సభ్యులతో మీటింగ్ నిర్వహించిన తర్వాత ఇవాళ జితేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడారు. భక్తుల విశ్వాసం, దీవెనలు తమ పట్ల ఉండాలని ఆశిస్తున్నట్లు మిశ్రా తెలిపారు. రామభక్తుల ఆశీస్సులు తమకు ముఖ్యమన్నారు. మీ దీనవలు, నమ్మకంతోనే మేం ముందుకు వెళ్తామని, నాకు కొంత సమయం ఇవ్వండి అంటూ మిశ్రా అన్నారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మిశ్రాను తొలి సీఈవోగా నియమించిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య రామాలయ వ్యవహార శైలిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల్లో తమ వ్యూహాలు అమలులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. వివిధ బృందాల సహాకారంతో ఆయోధ్య ఆలయంలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కీలకమైన నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తామన్నారు.

# భారత్, బెల్జియంల మధ్య పది ఒప్పందాలు

## రక్షణ సంబంధాలు మరింత బలోపేతం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్‌లో పర్యటిస్తున్న బెల్జియం ప్రధాని బార్ట్ డివెవర్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారత్‌తో రక్షణ సంబంధాలను బెల్జియం మరింత బలోపేతం చేసుకుంది. పాకిస్థాన్‌తో సైనిక పరికరాలు, రక్షణ సాంకేతికతకు సంబంధించిన సహకారం చేపట్టబోమని భారత్‌కు హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రక్షణ, భద్రతా వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఢిల్లీలో ప్రధాని మోడీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ సమావేశమయ్యారు. మరోవైపు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెల్జియం రక్షణ, విదేశీ వాణిజ్య మంత్రి థియో ఫ్రాంకెన్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. భారత్‌బెల్జియం సంయుక్త ప్రకటనలో గానీ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో గానీ పాకిస్థాన్ ప్రస్తావన లేదు. బెల్జియం రక్షణ ఎగుమతులపై ఏదైనా నిర్దిష్ట దేశానికి సంబంధించిన ఆంక్షలను కూడా బహిరంగంగా ప్రకటించలేదు. ఈ హామీ ఎంతకాలం అమల్లో ఉంటుంది. ఎలా అమలు చేస్తారనే దానిపై కూడా అధికారిక వివరాలు వెల్లడికాలేదు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే భారత్ పోరాటానికి బెల్జియం మద్దతు ప్రకటించినట్లు సంయుక్త ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 2025 ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడిని బెల్జియం ఖండించింది. ఉగ్రవాదులు, వారికి నిధులు అందించే వ్యక్తులు, సంస్థలు, వారికి ఆశ్రయం కల్పించే వ్యవస్థలపై చర్యలు తీసుకోవాలని ఇరు దేశాలు పిలుపునిచ్చాయి. ఇందుకోసం ఐక్యరాజ్యసమితి, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఉగ్రవాద నిరోధక అంశాలపై సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలని అంగీకరించాయి.

గతంలో బెల్జియం పాకిస్థాన్‌కు సైనిక విమానాలను సరఫరా చేసింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం 2021లో బెల్జియం ఏడు సి130బీ రవాణా విమానాలను పాకిస్థాన్‌కు విక్రయించింది. 2003లో పాకిస్థాన్ బెల్జియం నుంచి ఎఫ్16 యుద్ధ విమానాలను కూడా కొనుగోలు చేయాలని ప్రయత్నించింది. అయితే అమెరికాలో తయారైన ఈ విమానాలను బదిలీ చేయడానికి వాషింగ్టన్ అనుమతి అవసరం కావడంతో ఆ ప్రతిపాదిత ఒప్పందం ముందుకు సాగలేదు. 2021-25 మధ్యకాలంలో పాకిస్థాన్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ప్రధాన ఆయుధాల దిగుమతిదారుగా ఉంది. ఆ కాలంలో పాకిస్థాన్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 80 శాతం చైనా నుంచి వచ్చాయి. తుర్కియే 7 శాతం, నెదర్లాండ్స్ 4.6 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# సిఎం విజయ్ కాన్వాయ్‌లోకి చొరబడిన భార్యాభర్తలు!

**చెన్నై, సెప్టెంబరు 4:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కాన్వాయ్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మార్చిలో శివగంగై జిల్లాలో పోలీసుల కస్టడీలో మృతి చెందిన 26 ఏళ్ల యువకుడి తల్లిదండ్రులు సీఎం కాన్వాయ్‌కు అడ్డుగా దూసుకెళ్లారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ వారు బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. చెన్నైలోని సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిరసన చేస్తున్న మృతుడి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ కాన్వాయ్ వస్తుండగా స్థానికులు ఫెన్సింగ్ వెనుక నిలబడి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఇంతలో ఓ మహిళ, ఓ పురుషుడు ఒక్కసారిగా ఫెన్సింగ్ దాటి భద్రతా వలయాన్ని ఛేదిస్తూ కాన్వాయ్ వైపు పరుగెత్తారు. మహిళను పోలీసులు వెంటనే పట్టుకోగా పురుషుడు మాత్రం సీఎం కాన్వాయ్‌కు మరింత దగ్గరగా వెళ్లగలిగాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే కాన్వాయ్‌ను నిలిపివేశారు. శివగంగై జిల్లాకు చెందిన 26 ఏళ్ల దళిత యువకుడు పోలీసుల కస్టడీలో ఉండగా అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం చికిత్స కోసం మదురైలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విచారణ సమయంలో పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేశారని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు ఏఎన్ఐ గతంలో నివేదించింది. మృతుడిని ఆకాష్ డెనిసన్‌గా గుర్తించారు. చిన్నపాటి దాడి కేసులో అనుమానితుడిగా మనమదురై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కుమారుడి మృతిపై అతడి తండ్రి కన్నన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల విచారణ సమయంలో తన కుమారుడిపై తీవ్రంగా దాడి చేశారని, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ కన్నన్, ఆయన భార్య తమ బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి విజయ్ కాన్వాయ్ సమీపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది.




# స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం

**శ్రీనగర్, సెప్టెంబరు 4:** శ్రీనగర్ విమానాశ్రయంలో ఇండిగో విమానం పార్కింగ్ చేస్తుండగా వీఏడీజీఎస్ పోల్‌ను తాకింది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముంబై నుంచి శ్రీనగర్ వచ్చిన ఇండిగో విమానం 6ఈ 225 ఉదయం 9.02 గంటలకు బే నంబర్ 6లో పార్కింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది.

# అవినీతి కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడి కుమారుడు నామల్ రాజపక్స అరెస్ట్

**కొలంబో, సెప్టెంబరు 4:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు, ఎంపీ నమల్ రాజపక్సను దేశ ప్రధాన అవినీతి నిరోధక సంస్థ శుక్రవారం అరెస్ట్ చేసింది. 2013లో జరిగిన ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంలో అవినీతి ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బ్రైబరీ అండ్ కరప్షన్ ఆరోపణల దర్యాప్తు కమిషన్ ప్రకారం ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంపై విచారణకు హాజరు కావాలని 40 ఏళ్ల నామల్ రాజపక్సకు సమన్లు జారీ చేశారు. విచారణ అనంతరం ఆయనను అరెస్ట్ చేసినట్లు కమిషన్ అధికారి తెలిపారు. అనంతరం ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. అయితే నామల్ రాజపక్సపై ఏయే అభియోగాలు నమోదు చేశారన్నది వెంటనే స్పష్టంగా తెలియరాలేదు. ఆయన న్యాయవాది నిశాంత దయానంద అరెస్ట్‌ను ధ్రువీకరించారు.

వివాదాస్పదంగా మారిన 2.3 బిలియన్ డాలర్ల ఎయిర్‌బస్ ఒప్పందానికి సంబంధించి ఈ అరెస్ట్ జరిగినట్లు తెలిపారు. 2016లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ కేసులో సిఐఎబిఒసి ఇప్పటికే మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సను కూడా మే నెలలో ప్రశ్నించింది. విమానాల కొనుగోలు వ్యవహారంలో ఆయన లంచాలు స్వీకరించారన్న ఆరోపణలపై అధికారులు విచారించారు. ఎయిర్‌బస్ విమానాల కొనుగోలులో చెల్లించిన మొత్తంలో కొంత భాగాన్ని శ్రీలంకకు చెందిన ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు లంచాల రూపంలో అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం అవినీతి నిరోధక సంస్థ దర్యాప్తు కొనసాగిస్తోంది. రాజపక్స కుటుంబం తమపై వచ్చిన లంచం, అవినీతి ఆరోపణలను ఖండించింది. తమపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది.

# కొలెస్ట్రాల్ తగ్గించేందుకు జన్యుచికిత్స పరీక్షలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) ఎక్కువైతే గుండె జబ్బులు, గుండెపోటు, స్ట్రోక్ ముప్పు పెరుగుతుంది. సాధారణంగా ఆహారంలో మార్పులు, మందులతో దీన్ని నియంత్రిస్తారు. ఇప్పుడు ఒక్కసారి మాత్రమే ఇచ్చే జన్యు చికిత్సతో ఎల్‌డీఎల్‌ను సగానికి పైగా తగ్గించే అవకాశం ఉందని తొలి మానవ పరీక్ష వెల్లడించింది. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న ఈ చికిత్సకు సీటీఎక్స్310 అని పేరు పెట్టారు. క్రిస్పర్ జన్యు సవరణ సాంకేతికతతో కాలేయ కణాల్లోని ఏఎన్‌జీపీటీఎల్3 ప్రొటీన్ ఉత్పత్తిని తగ్గించడం దీని లక్ష్యం. ఈ ప్రొటీన్ తక్కువగా ఉంటే రక్తంలోని కొవ్వులను శరీరం మెరుగ్గా నియంత్రించగలదు. తొలి దశ పరీక్షలో తీవ్రమైన కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ సమస్యలున్న 15 మందికి సీటీఎక్స్310ను నరాల ద్వారా అందించారు. చికిత్స కోసం క్రిస్పర్ సూచనలను మోసుకెళ్లే నానోకణాలను ఉపయోగించారు. వారిలో ఒకరు చికిత్స తర్వాత 179 రోజులకు మరణించారు. ఆ మరణానికి సీటీఎక్స్310 కారణం కాదని పరిశోధకులు నిర్ధారించారు. మిగిలిన 14 మందిలో ఏడాది తర్వాత కూడా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులు తగ్గినట్లే ఉన్నాయి. తీవ్రమైన కొత్త దుష్ప్రభావాలు కనిపించలేదు. అత్యధిక మోతాదు పొందిన నలుగురిలో ఏఎన్‌జీపీటీఎల్3 స్థాయులు సగటున 78.6 శాతం తగ్గాయి. వారి ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 52.5 శాతం, ట్రైగ్లిజరైడ్లు 47.8 శాతం తగ్గాయి. అయితే ఇది చాలా చిన్న స్థాయిలో జరిగిన తొలి మానవ పరీక్ష మాత్రమే. ఎక్కువ మందిపై, ఎక్కువ కాలం పరిశోధనలు జరగాల్సి ఉంది. జన్యు సవరణలో కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం కూడా ఉంది.


# సంక్షిప్త వార్తలు

## ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 4:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని నా స్నేహితురాలు అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు.

## కరాచీకి వెళ్తున్న రష్యానౌకపై డ్రోన్ దాడి




**మాస్కో, సెప్టెంబరు 4:** రష్యా నుంచి 23 మంది భారతీయులతో బయల్దేరిన ఓ నౌకపై డ్రోన్ దాడి జరిగింది. నోవోరోస్సిస్క్ నుంచి పాకిస్థాన్ నగరం కరాచీకి ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో సిబ్బందికి వసతి కల్పించే ప్రాంతాన్ని డ్రోన్ ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. బుధవారం జరిగిన ఈ ప్రమాదం గురించి ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌యుఎస్‌యుఐ) ఎక్స్ వేదికగా వెల్లడించింది. నౌక సమీపంలో మరో డ్రోన్‌ను గుర్తించినట్లు తెలిపింది. ఈ ఘటన సమయంలో నౌకలో 23 మంది భారత నావికులు ఉన్నారని ఎఫ్‌యుఎస్‌యుఐ వెల్లడించింది.

## బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి

**కోల్‌కత్తా, సెప్టెంబరు 4:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

## ముగ్గురు పిల్లలతో మహిళా వెయిట్ లిఫ్టర్ ఆత్మహత్య



**ముంబయి, సెప్టెంబరు 4:** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో సహా చారిత్రాత్మక నల్‌దుర్గ్ కోటపై నుండి దాదాపు 100 అడుగుల లోతైన లోయలోకి దూకేశారు. ఈ ఘటనలో అశ్విని మరియు ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె రెండున్నరేళ్ల కవల కుమార్తెలలో క్రాంతి అనే చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ ఘోర ప్రమాదం నుంచి మరో కుమార్తె వీరా తీవ్ర గాయాలతో బయటపడింది.

## ముడిచమురు చోరీకి యత్నం.. 37 మంది మృతి

**అబుజా, సెప్టెంబరు 4:** నైజీరియాలో పెను విషాదం చోటుచేసుకుంది. పైప్‌లైన్ నుంచి ముడిచమురును దొంగిలించేందుకు ప్రయత్నించిన 37 మంది విష వాయువులు పీల్చి మృతి చెందినట్లు సమాచారం. ఈ మృతుల సంఖ్యను అధికారులు ఇంకా ధ్రువీకరించ లేదు. రివర్స్ రాష్ట్రంలోని ఒక్రికా ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానిక పర్యావరణ సంస్థ తెలిపింది. అయితే ఎంతమంది చనిపోయారనే విషయాన్ని వెల్లడించలేదు. ఘటనపై దర్యాప్తు కొన సాగుతోందని రివర్స్ రాష్ట్ర పోలీసు ప్రతినిధి బ్లెస్సింగ్ కబోర్లో అగాబే తెలిపారు.

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మూడుసార్లు గుండెపోటు

**బీజింగ్, సెప్టెంబరు 4:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్యంపై కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆగస్టు నెలాఖరులో ఆయన కిర్గిజ్‌స్థాన్‌కు వెళ్లిన సమయంలో, విమానం నుంచి దిగుతూ భార్య పెంగ్ లియువాన్ చేతిని పట్టుకుని నెమ్మదిగా మెట్లు దిగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు ఆయన ముఖం ఉబ్బినట్లు కనిపించిందని, నడకలోనూ ఇబ్బంది ఉన్నట్లు భావించారు. ఆయన ఆరోగ్యంపై టిబెట్, తైవాన్, ప్రవాస చైనీస్ వర్గాల్లో చర్చ మొదలైంది.

# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి



## మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం

## వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు

### మహిళలకు ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేసిన మంత్రి సీతక్క

**సత్తుపల్లి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఇందిర మహిళాశక్తి చీరల పంపిణీ సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానందలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి తెలిపారు. మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఇందుకోసం మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా ఆర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు.సత్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తుల ఆధారంగా వివిధవ్యాపారాలు ప్రారంభించాలని మంత్రి సూచించారు.

స్థానికంగా లభించే ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ఇతర ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు.మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా సదుపాయం కల్పిస్తూ, రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూమహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు.ఇందిర మహిళాశక్తి కార్యక్రమం కింద మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసి చైర్మన్లు దోమ ఆనంద్ బాబు, భాగం నేరజా చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల పాష, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, ఎసీపీ వసుందర యాదవ్ ఐపిఎస్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కే నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## కొండా సురేఖను బిఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదు: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 4:** మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్‌లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బిఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో ఆయన చిట్ చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండ సురేఖ అంశంపై స్పందించారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ పేర్కొన్నారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు, నేతలంతా ఏకతాటిపైనే..

### వెయ్యి రోజుల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు

### 22-ఎ జిఒను పునఃపరిశీలిస్తున్నాం: మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు4:** కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని మైనింగ్,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కెసిఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

## ఇతర రాష్ట్రాలు వెయిటింగ్

### ఫోన్లలో ఆర్డర్లు బుకింగ్

### వివిధ రాష్ట్రాలకు ఎగుమతి

## కరీంనగర్ చేపకు డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా చేపలకు పలు రాష్ట్రాల్లో డిమాండ్ పెరిగింది. సముద్ర తీర ప్రాంత ప్రజలు కూడా ఇక్కడి చేపలను తినడానికి ఆసక్తి చూపుతుండటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడ కూడా సముద్రం లేదు.. ఇక్కడ ప్రాజెక్టులతో పాటు, చెరువులన్నీ మంచి నీళ్లే కావడంతో వాటిల్లో చేపలను పెంచుతున్నారు. మంచి నీళ్లలో పెరిగే చేపలు రుచిగా ఉంటాయని చెబుతు న్నారు. సముద్రంలో లభించే చేపల కంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లభించే చేపల రుచి భిన్నంగా ఉంటుందని అంటున్నారు. ప్రత్యేకంగా పూర్తిగా మంచి నీళ్లలోనే చేపలు పెరుగుతుండటంతో వీటి రుచి బాగుంటుందనే గుర్తింపు వచ్చింది. దీంతో సముద్ర తీర ప్రాంత ప్రజలు కూడా ఇక్కడి చేపలను తినడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే మంచి నీటిలో పెరిగే చేప రుచితో పాటు, సముద్రం చేప కంటే సైజు తక్కువగా ఉంటుంది. పది నుంచి 15 కిలోల వరకు మాత్రమే పెరిగే అవకాశం ఉంది. ఇలాంటి సైజు ఉన్న చేప మరింత రుచిగా ఉంటుందని, అందువల్లే వీటికి మరింత డిమాండ్ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో కరీంనగర్ చేపలను ఇతర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తుండటం, ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో ఇక్కడ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. స్థానిక మత్స్యకారులు చేపలను పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడుకు ఎగుమతి చేస్తూన్నారు. ఇక్కడి నుంచి ముఖ్యంగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీకి చేపలను పంపిస్తున్నారు. ఇక కలకత్తాలో కరీంనగర్ జిల్లా చేపలకు మంచి డిమాండ్ ఉంది. కరీంనగర్ జిల్లా చేపలు మార్కెట్లోకి రాగానే త్వరగానే అమ్ముడుపోతున్నాయని వ్యాపారస్థులు చెబుతున్నారు. భారీ సైజులో ఉన్న చేపలను తినడానికి ఆసక్తి చూపుతుండటంతో అలాంటి వాటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో రవ్వుతో పాటు., జెల్లెకు మంచి డిమాండ్ ఉంటుందని స్థానిక వ్యాపారస్థులు తెలిపారు.

మిగతా చేపలతో పోలిస్తే జెల్లె సైజు తక్కువగా ఉంటుంది. అయితే జెల్లె రకం చేపకు ప్రత్యేక రుచి ఉండటంతో మార్కెట్లలోకి రాగానే త్వరితగతిన అమ్ముడయిపోతున్నాయి. కరీంనగర్ చేప కోసం కలకత్తాలో ఎదురు చూస్తుంటారని వ్యాపారస్తులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంత మంది వ్యాపారులు ఫోన్లో కూడా ఆర్డర్లు బుక్ చేసుకోవడం విశేషం.

## విద్యుత్ ట్రాన్స్‌మిషన్ సంస్థ వాటాల విక్రయం

### పబ్లిక్ ఇష్యూకు 26 శాతం వాటాలు

### కంపెనీ ముఖ విలువ రూ.68 వేల కోట్లు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ టాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో) వాటాలను విక్రయించేందుకు ఆ సంస్థ సిద్ధమవుతోంది. ట్రాన్స్‌కోలో పెట్టుబడుల ఉపసంహారణ చేపట్టేందుకు గాను తెలంగాణ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (టీపీసీసీ) తాజాగా నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ట్రాన్స్‌కో ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పబ్లిక్ ఇష్యూకు వెళ్లాలని యోచిస్తోంది. కన్సల్టెన్సీగా ప్రైస్ వాటర్ హౌస్ కూపర్ సంస్థను నియమించుకోవాలని ఇటీవల టీపీసీసీ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాగా తెలంగాణ ట్రాన్స్‌కోలో రాష్ట్ర ప్రభుత్వానికి 100 శాతం వాటాలున్నాయి. ఇందులో 26 శాతం వాటాను విక్రయించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం కంపెనీ ముఖ విలువ రూ.68 వేల కోట్లుగా ఉంది. సెక్యూరిటీ ఎక్స్‌చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) నిబంధనల ప్రకారం 75 శాతం వాటా ప్రభుత్వం వద్ద ఉండాలి.

దీనికోసం ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కు వెళతారు. తొలుత డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ని సిద్ధం చేసి, కంపెనీ తన వివరాలు, ఆర్థిక పరిస్థితి, డబ్బు ఎందుకు అవసరం వంటి అంశాలను సెబీకి తెలపాల్సి ఉంటుంది. డీఆర్‌హెచ్‌పీ ఆమోదం తర్వాత ఐపీవోకు వెళతారు. ఆ తర్వాత స్టాక్ మార్కెట్‌లో కంపెనీ లిస్ట్ అయ్యి షేర్లను ప్రజలకు అమ్ముతారు.

అలా వచ్చే నిధులు ట్రాన్స్‌కోకు వెళతాయి. మలి విడతలో సెకండరీ మార్కెట్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్‌చేంజ్ (ఎన్ఎసఈ), బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్(బీఎసఈ)లో లిస్టింగ్ అవుతుంది. ఆ తర్వాత కంపెనీ పనితీరు ఆధారంగా షేరు విలువ పెరగడం, తగ్గటం జరుగుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

## దమ్ముంటే రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చెయ్

### నేనూ ఇండిపెండెంట్‌గా పోటీ చేయడానికి సిద్ధం

### కొండా సురేఖకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సవాల్

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబరు 4:** దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వరంగల్ తూర్పులో ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కొండా సురేఖకు సవాల్ విసిరారు.గురువారం వరంగల్ లోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తాను కూడా ఇండిపెండెంట్ గా పోటీకి సిద్ధమని, ఇన్నేళ్లుగా ప్రజల రక్తం తాగుతూ కొండా దంపతులు బీసీ కార్డు వాడుకుంటున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రిని తిడితే ఊరుకోమని, హై కమాండ్ కు ఫిర్యాదు చేసింది తానేనని అన్నారు. మంత్రి పదవి పోవడం కొండా సురేఖ వాళ్ళ స్వయంకృతాపరాధమేనని, మంత్రి పదవి ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డినే తిట్టడం భావ్యం కాదని అన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు కొండా దంపతులవేనని, ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ వారిని బ్లాక్ మెయిల్ చేయడం కొండ వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు.దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని,నేను కూడా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తా ఎవరి భవిష్యత్తు ఏంటో ప్రజలు నిర్ణయిస్తారని సవాల్ విసిరారు. కష్టం వచ్చినప్పుడే బీసీ నినాదం ఎత్తుకుంటారని, ఒక్కరిని కూడా బీసీలను కొండా దంపతులు ఎదగనివ్వలేదని అన్నారు.రామసహాయం సురేందర్ రెడ్డి లాంటి సీనియర్లను విమర్శించడం వారి స్థాయికి తగదన్నారు. సొంత పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెట్టించిన నీచ చరిత్ర కొండ సురేఖదని,వరంగల్ లో ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా వారికి సపోర్ట్ చేయరని అన్నారు.కొండా సురేఖ గెలుపు కోసం పనిచేసిన వారిని పట్టించుకోని వారి బుద్ధి ఇక్కడ అందరికీ తెలుసని,కుడా చైర్మన్ పదవి గుండు సుధారాణికి ఇవ్వడం అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు.ఇంకా మరికొందరికి పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు రావాల్సి ఉందని, ఇప్పుడు అవి వస్తాయని బస్వరాజు సారయ్య అన్నారు. ఈ సమావేశంలో



మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్,బస్వరాజ్ శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి త్రి, చాగంటి శ్రీనివాస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇ-సిగరెట్ల దందాపై ఈగల్ ఫోర్స్ దాడులు.. ముగ్గురి అరెస్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు4:** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జోరుగా సాగుతున్న నిషేధిత ఈసిగరెట్ల దందాపై ఈగల్ ఫోర్స్ పంజా విసిరింది. ఈసిగరెట్స్ విక్రయదారులపై ఆకస్మిక దాడులు చేసింది. వారి నుంచి 152 నిషేధిత ఈసిగరెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసింది. ఈ దాడిలో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఇద్దరు యజమానులు పరారీలో ఉన్నారు. ఈ సిగరెట్ల నిల్వ, అక్రమరవాణా, విక్రయాలపై ఈగల్ ఫోర్స్ దృష్టి సారించింది. నిషేధిత ఈసిగరెట్ల(వేప్స్) విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం అందుకున్న పోలీసులు మాదాపూర్‌లోని రెండు ఔట్‌లెట్లపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 152 నిషేధిత ఈసిగరెట్లను పోలీసులు సీజ్ చేశారు. వారి నుంచి 34 ఫారిన్ సిగరెట్ ప్యాకెట్లు, 3 స్కానర్లు, రూ.9,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేధిత సిగరెట్లు(వేప్స్)విక్రయాలు వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని పోర్టర్, రాపిడో ద్వారా డెలివరీ చేస్తున్నట్లు వారు తెలిపారు. వీటి చెల్లింపులు క్యూఆర్ కోడ్‌ల ద్వారా జరిగినట్లు వారు గుర్తించారు. నిందితులకు చెందిన రెండు బ్యాంకు ఖాతాల్లో రూ.2.31 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలను పరిశీలించిన పోలీసులు హైదరాబాద్‌లో 130 మంది ఈసిగరెట్ల వినియోగదారులు ఉన్నట్లు, 351 మంది కొనుగోలుదారులు ఉన్నట్లు గుర్తించారు. ఈసిగరెట్లను కొనుగోలు చేయడం కూడా చట్టప్రకారం నేరమే అవుతుందని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు, సాధారణ సిగరెట్లలో నికోటిన్ పొగాకు రూపంలో ఉండగా, ఈసిగరెట్లలో నికోటిన్, కొన్ని రసాయనాల మిశ్రమం ద్రవ రూపంలో ఉంటుంది. సాధారణ సిగరెట్లను కాల్చినపుడు పొగ వస్తుంది. కానీ, ఈసిగరెట్లను కాల్చడం ఉండదు. ఇవి బ్యాటరీతో పనిచేసే ఎలక్ట్రానిక్ పరికరాలు. ఇవి రసాయన ద్రవాన్ని వేడి చేసి ఆవిరిగా మారుస్తాయి. ఈ నికోటిన్ ఆవిరిని వినియోగదారులు పీల్చుతారు. ఇవి చూడడానికి పెన్ను మాదిరిగా ఉంటాయి. అందుకే వీటిని వేప్స్ లేదా వేప్స్ పెన్నులు (ఆవిరి పెన్నులు) అంటారు.

## యూరియా యాప్‌ను వ్యతిరేకిస్తూ ఇందల్వాయిలో రైతుల ధర్నా

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** యూరియా యాప్‌తో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఇందల్వాయి మండలం గన్నారం గ్రామ వ్యవసాయదారులు జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో నాగపూర్-హైదరాబాద్ రహదారిపై వాహనాలర రాకపోకలకు శుక్రవారం అంతరాయం కలిగింది. నిజామాబాద్ జిల్లా 44వ నంబర్ జాతీయ రహదారిపై యూరియా కోసం ఇందల్వాయి సొసైటీ పరిధిలోని గన్నారం గ్రామ రైతులు నిరసన చేపట్టారు. యూరియా బస్తాలు ఆన్‌లైన్‌లో పెట్టి వెంటనే ఖాళీ చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా యాప్‌ను వ్యతిరేకిస్తూ సొసైటీ గోదాం వద్ద రైతులు ధర్నా చేశారు. రైతులు యాప్ కారణంగా వ్యవసాయ పనులు వదిలి ఫెర్టిలైజర్ దుకాణాల చుట్టు తిరుగుతున్నామని ఆవేదన చెందారు. పేద రైతులకు దొరకడంలేదని గొప్పవారికి మాత్రం యూరియా అందుతోందని ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతాంగం తీవ్ర ఇబ్బంది పడతున్నారని ధర్నాలో పాల్గొన్న రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గత మూడేళ్ళుగా రైతులను వేధిస్తున్నారని వారు 44 జాతీయరహదారిపై పాలకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## సింగరేణి గనిలో ప్రమాదం

### ఐదుగురికి గాయాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌కు చెందిన బొగ్గు గనిలో ప్రమాదం జరిగింది. రామగుండం ప్రాంతంలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన బొగ్గు గనిలో జరిగిన ప్రమాదంలో సింగరేణి కాలరీస్ కు చెందిన ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. కార్మికులు తమ విధులు నిర్వర్తిస్తుండగా, ఆ ప్రాంతంలోని ఒక ఎయిర్ ట్యాంక్ పేలిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన వారిని ఆపరేటర్ శ్రీనివాస్, ఫిట్టర్లు కిరణ్, లక్ష్మణ్, హెల్పర్లు ప్రశాంత్, మనోజ్‌లుగా గుర్తించారు. ఇతర కార్మికులు వెంటనే గాయపడిన వారిని గని నుండి బయటకు తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం సింగరేణి అధికారులు గాయపడిన వారిని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ వారికి చికిత్స జరుగుతోంది. గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది, అయితే వారు వినికిడి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎయిర్ ట్యాంక్ సాంకేతిక లోపం వల్ల పేలిందా లేక మరేదైనా కారణం వల్ల పేలిందా అనేది ఇంకా తెలియరాలేదు. ఎయిర్ ట్యాంక్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## ధ్రువపత్రాలు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు4:** తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి, దివ్యాంగులకు సందరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేక

## కొత్తగా చేయూత పింఛన్లు

పోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు.కాగా, చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు.

రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

## ప్రజాప్రభుత్వ పాలన చూసి ఓర్వలేక కెటిఆర్ పాదయాత్ర

### నప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ప్రజా పాలనను చూసి ఓర్వలేక బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పాదయాత్ర అంటున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. సిఎల్‌పిలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ ఎందుకు నీ పాదయాత్ర? మూసీ పునర్జీవం జరగకుండా పాదయాత్ర చేస్తాడా? కెటిఆర్ డ్రామాలు ఆపాలని సలహా ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉందని వర్షాలు లేకపోవడంతో ఉన్న నీళ్లను తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నారని



ఆయన తెలిపారు. భవిష్యత్తులో తాగు నీళ్ల లేకుం డా అయితే రాజకీయం చేయాలని చేస్తున్నాడని విమర్శించారు. నల్గొండలో జిమ్మిక్కులు చేస్తే తరిమికొడతామని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. గతంలో తెలంగాణ సెంటిమెంటుతో కెసిఆర్ కోదాడ నుంచి హాలియా పాదయాత్ర చేసి ఏం సాధించాడు? అని ప్రశ్నించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిత్యం సమీక్షలు చేసి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని కితాబు ఇచ్చారు. కోమటిరెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదు.. తెలంగాణ రైతులు సుభిక్షంగా ఉన్నారని అధికారంలోకి వచ్చిన మొదటి యేడాదిలోనే 25 లక్షల మంది రైతుల కుటుంబాలకు 21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని తెలిపారు.

# రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా

### 90 థర్మల్ కేంద్రాలకు 253 లక్షల టన్నులు రవాణా

### సింగరేణి సిఎండి డాక్టర్ ప్రకాష్

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన సరఫరా ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడానికి రోజుకు 1.9 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి శుక్రవారం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, అలాగే రాష్ట్ర ఇంధన శాఖ వారు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందించాలంటూ లక్ష్యాలను నిర్దేశిస్తున్నా రన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని దేశ ఇంధన భద్రత రీత్యా తగినంత బొగ్గును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థల పైన ఉందని, ఇందుకు సింగరేణి కూడా శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని వివరించారు. ఇందుకు అనుగుణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నెలాఖరు సింగరేణి 253 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిందని, దీనిలో 90 పైగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సంస్థ సీఎండీ స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని నుండి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మొదటి రైల్వే రేకుతో బొగ్గు సరఫరా చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంపై దామరచర్ల లోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మరొక రేకు ఇటీవల సరఫరా చేశామని, ఇకముందు కూడా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నైనీ బ్లాక్ నుండి బొగ్గును రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం జరుగుతుందని ఆయన వివరించారు. అలాగే ఆగస్టు నెలాఖరి వరకు ఆఫ్ లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించడం జరిగిందని, అయితే ఇచ్చిన లక్ష్యాలలో ఇది 95 శాతం మాత్రమే కనుక నూరు శాతం పైబడి ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఆఫ్ లోడింగ్ ఏజెన్సీ లను సమాయత్తం చేయాలని పేర్కొన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన ఈ సమయం ఉత్పత్తికి అనుకూలంగా ఉంది కనుక రోజువారీ లక్ష్యాలను దాటి బొగ్గు ఉత్పత్తి సాధించాలని, రైల్వే విభాగం వారితో సమన్వయం జరుపుతూ నూరు శాతం పైబడి బొగ్గు రవాణా సాధించాలన్నారు. రక్షణా ప్రమాణాలు పాటిస్తూ తగిన నాణ్యత గల బొగ్గును సరఫరా చేయడానికి పై అధికారుల నుండి కింది వరకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్. వి సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎమ్. తిరుమల రావు, ఇడి బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భూ పరిహారం, పునరావాసం రెండూ ఇవ్వాలి

## మల్లన్నసాగర్ నిర్వాసితులకు న్యాయం చేయండి

## ప్రతి పిటిషన్ అర్హతను పరిశీలించి నిర్ణయించాలి

## అర్హులైన రైతులకు పునరావాస హక్కు ఉంటుంది: హైకోర్టు స్పష్టీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం జీఓ 123 కింద అంగీకారంతో భూములు ఇచ్చిన రైతులకు భూ పరిహారంతో పాటు పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు కల్పించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఒప్పందం ద్వారా భూములు ఇచ్చారని, పరిహారం తీసుకుని అంగీకార పత్రాలపై సంతకాలు చేశారని చెప్పి ఆ ప్రయోజనాలను నిరాకరించరాదని తేల్చింది. సిద్ధిపేట జిల్లా తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్, తొగుట, రాంపూర్ ప్రాంతాలకు చెందిన తిగుళ్ల బాలమణి, అసర్ల పోచవ్వ, లింగోల్ల బాలనర్సవ్వ, ఎక్కల బాలవ్వ తదితరులు దాఖలు చేసిన పిటీషన్లపై న్యాయమూర్తి జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి తీర్పు వెలువరించారు. పిటిషనర్ల తరపున సిహెచ్. రవికుమార్, ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్ ఖాన్ వాదించారు. జీఓ 214 ద్వారా పునరావాస వ్యయాన్ని భూ పరిహారం నుంచి వేరు చేసినందున వేర్వేరు ప్రయోజనాలని కోర్టు పేర్కొంది. 2017 చట్ట సవరణకు 2014 జూన్ 2 నుంచి పూర్వప్రభావం ఉన్నందున అర్హులైన రైతులకు పునరావాస హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ప్రతి పిటిషనర్ అర్హతను అధికారులు విడిగా పరిశీలించి, వారి వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఇళ్లు లేదా ఇతర నిర్మాణాలకు సంబంధించి ప్రయోజనాలు పొందితే వాటిని లెక్కలోకి తీసుకుని మిగిలిన ప్రయోజనాల్లో సర్దుబాటు చేయాలని, ఒకే ప్రయోజనం రెండుసార్లు ఇవ్వకూడదని పేర్కొంది. దరఖాస్తును తిరస్కరిస్తే కారణాలను వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, వాటి ప్రతులను దరఖాస్తుదారులకు అందించాలని ఆదేశించింది. ఉత్తర్వుల ప్రతిని అందుకున్న తేదీ నుంచి ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన వారికి ప్రయోజనాలు కల్పించాలని స్పష్టం చేసింది. జీఓ 123, జీఓ 214ల చట్టబద్ధతపై ఈ తీర్పులో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, ఆ అంశం డివిజన్ బెంచ్ పరిధిలో ఉందని తెలిపింది.



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి వస్తున్న అథ్లెట్ ప్రతిభ

# నన్ను ట్రోల్ చేస్తున్నారు..

## బంజారాహిల్స్ పోలీసులకు అథ్లెట్ ప్రతిభ ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌పై ఆరోపణలు చేసిన అంతర్జాతీయ అథ్లెట్ తక్కళ్లపల్లి ప్రతిభ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో తనను ఉద్దేశపూర్వకంగా ట్రోల్ చేస్తూ, కించపరిచేలా పోస్టులు, సందేశాలు పెడుతున్నారని ఆమె ఆరోపించారు. తనను అవమానించేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు బెదిరించే ధోరణిలోనూ సందేశాలు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అనంతరం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. ఇటీవల శ్రీనివాస్ గౌడ్‌పై తాను చేసిన ఆరోపణల నేపథ్యంలోనే సోషల్ మీడియాలో తనను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేస్తున్నారని ప్రతిభ ఆరోపించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. తన ఫిర్యాదుతో పాటు సోషల్ మీడియాలో తనకు వచ్చిన సందేశాలు, పోస్టులకు సంబంధించిన ఆధారాలను కూడా పోలీసులకు అందించినట్లు తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్ ఏసిపి సామల వెంకటరెడ్డి ఆమె నుంచి అన్ని వివరాలను సేకరించారు. నల్ల బాలు ఎక్స్ ఖాతాతో పాటు మరి కొంత మందికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతా వివరాలను ఏసిపికి అందించినట్లు వివరించారు. అందులో కొందరికి పేరు చివరన బీఆర్ఎస్ అని ఉందని ఆమె స్పష్టం చేశారు. కాగా ఆమె ఫిర్యాదును బంజారాహిల్స్ పోలీసులు స్వీకరించారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై ప్రతిభ సీసీఎస్ పోలీసులను సైతం ఇప్పటికే ఆశ్రయించినట్లు తెలిసింది.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు4:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నోటీసులు ఇచ్చింది. రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని పేర్కొంది. మార్చి 29న అసెంబ్లీలో కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరింది.

# కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?

## ఆయనను అసెంబ్లీకి రాకుండా నిషేధించాలి: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు4:**తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిరక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు.



# ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం!

## ట్రంప్ దూతలుగా స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్‌కుష్నర్ పర్యటనలు

## అటు ఉక్రెయిన్, ఇటు రష్యా దేశాల్లో రెండురోజుల పర్యటన

**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ట్రంప్ ప్రత్యేక దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ ఈ వారాంతంలో మాస్కో, కీవ్‌లలో పర్యటిస్తారని వైట్‌హౌస్ వర్గాలు పేర్కొంటున్నాయి. శనివారం, ఆదివారం రెండు దేశాల్లోనూ వారు పర్యటించనున్నట్లు రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ వెల్లడించింది. అయితే ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను క్రెమ్లిన్ అధికారికంగా ధ్రువీకరించలేదు. టాస్ కథనంపై స్పందించిన క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ పర్యటనను నేరుగా ధ్రువీకరించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం దీనిపై ఎలాంటి ప్రకటన చేయను. ఈ సంప్రదింపులు జరిగినప్పుడు మీకు సమాచారం అందిస్తాం అని ఆయన విలేకరులతో అన్నారు.అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మాత్రం గురువారం స్పందిస్తూ ట్రంప్ ప్రతినిధులు రానున్న రోజుల్లో మాస్కో, కీవ్‌లకు వస్తారని తెలిపారు. ఉక్రెయిన్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చలు కొనసాగుతున్నాయని, ఆదివారం పర్యటనకు సాధ్యమైన తేదీగా పరిశీలిస్తున్నారని ఉక్రెయిన్‌ప్రతినిధి వెల్లడించారు. విట్‌కాఫ్, కుష్నర్‌లు చివరిసారిగా జనవరిలో మాస్కోకు వెళ్లారు. అప్పట్లో క్రెమ్లిన్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో దాదాపు నాలుగు గంటలపాటు అర్ధరాత్రి చర్చలు జరిపారు. తాజా పర్యటన ద్వారా యుద్ధానికి పరిష్కారం కనుగొనే దిశగా ఇరు పక్షాలతో నేరుగా చర్చలు జరిపేందుకు ట్రంప్ బృందం మరోసారి ప్రయత్నించనుంది.అయితే కీవ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చలు కొనసాగుతున్నాయని ప్రచారంలోకి వచ్చింది. అమెరికా దూతలు కీవ్‌కు వెళ్లడాన్ని రష్యా వ్యతిరేకిస్తోందని, తమ ప్రణాళికను మార్చుకునేలా వారిని ఒప్పించేందుకు ప్రయత్నిస్తోందని ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న వ్యక్తి తెలిపారు. క్రెమ్లిన్ ఈ పర్యటనను ధ్రువీకరించకపోవడం పరిస్థితిపై మరింత అనిశ్చితిని పెంచింది. అయినప్పటికీ ఇరు పక్షాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని పెస్కోవ్ తెలిపారు. పని కొనసాగుతోంది.. సంప్రదింపులు కూడా కొనసాగుతున్నాయి అని ఆయన పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న విభేదాలు దౌత్యపరమైన ప్రయత్నాలు మళ్లీ ఊపందుకున్నప్పటికీ మాస్కో, కీవ్ మధ్య ప్రధాన విభేదాలు మాత్రం ఇంకా పరిష్కారం కాలేదు.



మాస్కో కోరుతున్న నాలుగు ప్రాంతాలపై ఉక్రెయిన్ తన హక్కును వదులుకోవడంతోపాటు, నాటోలో చేరాలన్న ఆకాంక్షను విరమించుకోవాలన్న రష్యా డిమాండ్లలో ఎలాంటి మార్పు లేదని పెస్కోవ్ స్పష్టం చేశారు. రష్యా వైఖరి అచంచలమైనదని ఆయన పేర్కొన్నారు. రష్యా షరతులను ఉక్రెయిన్ తిరస్కరిస్తోంది. భారీ మూల్యం చెల్లించి రక్షించుకున్న భూభాగాన్ని వదులుకోవడం చర్చల ద్వారా కుదిరే శాంతి ఒప్పందం కాదని, అది లొంగుబాటుతో సమానమని కీవ్ వాదిస్తోంది. యుద్ధానికి ముగింపు పలికేందుకు ఒప్పందం కుదిరే అవకాశం ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ గురువారం పేర్కొన్నారు. అదే సమయంలో రష్యా గగనతలాన్ని విదేశీ విమానయాన సంస్థలు నివారించాలంటూ ఉక్రెయిన్ చేసిన హెచ్చరికపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ చర్య ఒక రకమైన బెదిరింపుగా మారి చర్చలను మరింత క్లిష్టతరం చేసే అవకాశం ఉందని పుతిన్ అన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వంతో చివరిసారిగా ఫిబ్రవరిలో చర్చలు జరిగాయి. ఆ చర్చలు జరిగిన కొద్ది కాలానికే అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించాయి.

# మద్దూరులో అభివృద్ధి పనులను పరిశీలించిన సిఎం రేవంత్

**మద్దూరు, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా/కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మద్దూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల భవన నిర్మాణ నమూనా చిత్రపటాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి, భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం, నిర్మాణ విస్తీర్ణం, తరగతి గదులు, ప్రయోగ శాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 4 ఎకరాల స్థలంలోని 13,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఎం.డీ. గణపతిరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం భవనం లోపల జరుగుతున్న నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని, అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు ముఖ్యమంత్రి సూచించారు. వచ్చే మార్చి నెలలోపు కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మద్దూరు ప్రాంతంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**గురుకుల బాలికల పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రోడ్డు మార్గంలో చింతల్ దిన్నె వైపు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అయితే గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి మద్దూరుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలో అభిమానులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, మద్దూరు మున్సిపల్ చైర్ పర్సన్ సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు, సింగిల్ విండో చైర్మన్ నర్సిములు,



రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచర్ల బాలయ్య, మహేందర్ రెడ్డి, మద్దూరు పట్టణ అధ్యక్షుడు జీడి వెంకట్రాములు, మద్దూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదగిరి, నాయకులు మాది జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, నిడ్జింత తిరుపతిరెడ్డి, రమేష్ రెడ్డి, వీరేశ్ గౌడ్, నరసింహులు గౌడ్, జీడి ప్రకాష్ స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సిఎం రేవంత్‌రెడ్డి నకిరేకల్ పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు4:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నకిరేకల్‌లో పర్యటన చేయనున్నారు.సాయంత్రం 4 గంటలకు నకిరేకల్ చేరుకోనిపలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగే భారీ బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారు.అభివృద్ధి పనుల వివరాలు:1.సబ్‌స్టేషన్ శంకుస్థాపన, మునిపంపుల గ్రామంలో రూ.3.62 కోట్ల వ్యయంతో నిర్మించే పవర్ ట్రాన్స్‌ఫార్మర్(పిటిఆర్),33/11 కెవి సబ్‌స్టేషన్, 33 కెవి అండ్ 11 కెవి విద్యుత్ లైన్లు, కంట్రోల్ రూమ్ పనులకు శంకుస్థాపన.2.సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం, కేతేపల్లి మండలం గుడివాడ గ్రామంలో రూ.2.74 కోట్లతో నిర్మించిన 33/11 కెవి సబ్‌స్టేషన్, 33కెవి,11 కెవి లైన్ల ప్రారంభోత్సవం.3.తెలంగాణ పబ్లిక్ స్కూల్:.నకిరేకల్ నియోజకవర్గంలో రూ.9.85 కోట్ల వ్యయంతో నిర్మించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి శంకుస్థాపన.4.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్:, నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించే "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్"కు శంకుస్థాపన. 5.మండల కార్యాలయాల సముదాయం:, నకిరేకల్ మండ లంలో రూ.20 కోట్లతో నిర్మించే సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయానికి (ఎండిఓ,ఎంఆర్వో) శంకుస్థాపన. 6.రహదారుల అభివృద్ధి:.రూ.45.60 కోట్ల వ్యయంతో చేపడుతున్న కింది రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన:నకిరేకల్-గురజాల రోడ్ నుండి బైరౌనిబండ వరకు, బైరౌనిబండ నుండి అమ్మనబోలు-రామాంజాపూర్ రోడ్ వరకు, అమ్మనబోలు-రామాంజాపూర్ రోడ్డు విస్తరణ/అభివృద్ధి పనులు7.ఎక్సైజ్ స్టేషన్: నకిరేకల్‌లో రూ. 1.10 కోట్లతో నిర్మించనున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన.8.100 పడకల ఆసుపత్రి:నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రి ప్రారంభోత్సవం చేస్తారు.

# కామారెడ్డిలో డివైడర్ ఢీకొని బస్సు బోల్తా.. డ్రైవర్ మృతి

## ప్రయాణికులకు గాయాలు

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కల్పించాలి : మంత్రి పొన్నం

**హైదరాబాద్,సెప్టెంబరు 4,ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా జుక్కల్ చౌరస్తా సమీపంలోని 161వ జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి బిచ్కుంద వైపు వెళ్తున్న హైదరాబాద్1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జుక్కల్ మండలంలోని కౌలాస్ చౌరస్తా సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తా పడటంతో డ్రైవర్ డి. ఆంజనేయులు సీటు కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో కండక్టర్ కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి సుమారు 200 మీటర్ల ముందునుంచే బస్సు అదుపుతప్పి వంకరగా వెళ్తుండటాన్ని ప్రయాణికులు గమనించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు కేకలు వేసినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. బస్సును పైకి లేపి డ్రైవర్ ఆంజనేయులు మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాదంలో బస్సు బోల్తా పడటంతో పాటు ముందు రెండు టైర్లు కూడా విడిపోయాయి. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై బాన్సువాడ డిఎస్‌పి విఠల్‌రెడ్డి, బిచ్కుంద సిఐ రవికుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఘోర ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం తీవ్రదిగ్భ్రాంతి**

కామారెడ్డి జిల్లా జుక్కల్ చౌరస్తాలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు డ్రైవర్ మృతి తీవ్రంగా కలిచివేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి పొన్నం ఆదేశించారు.

# 'అనంత' జిల్లాలో బస్సు అగ్నికి దగ్ధం

## ప్రయాణికులంతా క్షేమం

**అనంతపురం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు సమీపంలోని 44 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయింది. అయితే అదృష్టవశాత్తు డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న 33 మంది ప్రయాణికులు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా క్షేమంగా బయట పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఇంటర్సిటీ సర్వీసెస్‌కు చెందిన టిజి13టి1985 బస్సు మిడుతూరు గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ సిద్దయ్యస్వామి వెంటనే బస్సును నిలిపివేశాడు. భయాందోళనలో ఉన్న ప్రయాణికులు వెంటనే బస్సును దిగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో డ్రైవర్‌తో పాటు అతని అసిస్టెంట్లు ముగ్గురు, 33 మంది ప్రయాణీకులు క్షేమంగా ఎలాంటి ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాస్, పెద్దవడుగూరు సిఐ నరేందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

# ఒవైసీ సోదరులకు దేశభక్తి సర్టిఫికెట్లు దేశాన్ని అవమానించడమే

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసం ఒవైసీ బ్రదర్స్ దేశభక్తులంటూ ప్రశంసలు కురిపించడం తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోందని, ఇది సిగ్గుచేటని బిజెపి రాష్ట్ర ఎన్. రాంచందర్ రావు ధ్వజమెత్తారు. దేశభక్తులు అంటే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అని, అలాంటి మహోన్నత నాయకులతో ఒవైసీలను పోల్చడమే ఒక విడ్డూరమని ఎద్దేవా చేశారు. అసలు రేవంత్ రెడ్డి ఏ అర్హతను చూసి ఒవైసీ సోదరులకు దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. గతంలో 15 నిమిషాలు పోలీసులను పక్కకు జరిపితే ఈ దేశంలో ఎవరి పరిస్థితి ఎలా ఉంటుందో చూపిస్తామంటూ బెదిరింపులకు దిగినందుకా? లేక బహిరంగంగా పబ్లిక్‌లో మేము ఆవు మాంసం తింటాం, గోమాంసం బాగుంటుంది అంటూ మాట్లాడినందుకు మెచ్చుకుని దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారా? అసలు దేని కోసం వీళ్లను దేశభక్తులు అంటున్నారో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని, అసలు మీ దృష్టిలో దేశభక్తి అంటే ఏంటో, దేశభక్తికి సీమ రేఖ ఏంటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రతిష్ఠాత్మకమైన వందేమాతరం పాడుతుంటే ఒక్కరంటే ఒక్క మజ్లిస్ ఎమ్మెల్యే గానీ, ఒవైసీతో సహా ఎవ్వరూ కూడా వందేమాతరం కోసం నిలబడలేదన్నారు. మోడీకి, అమిత్ షాకి దేశభక్తి ఉందని రేవంత్ రెడ్డి ఒప్పుకున్నందుకు సంతోషమని, కానీ ఒవైసీలకు దేశభక్తి సర్టిఫికెట్లు ఇవ్వడం మాత్రం ఈ దేశంలో ప్రతి ఒక్కరినీ ఘోరంగా అవమానించడమేనన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు

## శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయి

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను కలిసి వినతిపత్రం అందించిన బిజెపి మహిళా మోర్చా నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు భద్రత పూర్తిగా గాలిలో దీపంగా మారిందని, శాంతిభద్రతలు తీవ్రంగా క్షీణించాయని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ పెరిగిపోతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, దాడులను నిరసిస్తూ శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ని కలిసిన అనంతరం డాక్టర్ మేకల శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ. ఆగస్టు 28న తుక్కు గూడలోని ప్రైమ్‌కేర్ ఆసుపత్రిలో నర్సుగా సేవలందిస్తున్న గిరిజన యువతిపై మహమ్మద్ సనావుల్లా ఖాన్ అనే దుర్మార్గుడు అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేసిన ఘోర ఉదంతాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తండ్రి లేని నిరుపేద కుటుంబంలో ఆ అమ్మాయి సంపాదనే ఏకైక ఆధారంగా బతుకుతున్న కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఒక కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధితురాలి తల్లికి గానీ, సోదరుడికి గానీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించి పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడైన మహమ్మద్ సనావుల్లా ఖాన్‌కు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరిశిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు. నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ఇంట్లో లేని సమయం చూసి.. స్థానిక కాంగ్రెస్ మేయర్, ఆయన అనుచరులు రౌడీ మూకలతో కలిసి వారి ఇంట్లో చొరబడి దాష్టీకానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు, వృద్ధురాలైన వర్షిత్ రెడ్డి తల్లిపై భౌతిక దాడికి దిగడం అత్యంత హేయమైన చర్య అన్నారు. స్పష్టమైన సిసిటివి ఆధారాలు ఉన్నప్పటికీ,బాధితురాలు ఫిర్యాదు చేసినా పోలీసులు ఇంతవరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు.

# డేటా, ఎఐ, కంటెంట్ రంగాలకు రానున్న స్వర్ణయుగం

## టైర్2, టైర్3 నగరాల యువతలో అపారమైన ప్రతిభ, పట్టుదల

## కాన్‌స్టర్ నూతన కార్యాలయం ప్రారంభించిన మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 4:** హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ ప్రైమియా భవనంలో కాన్‌స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) శుక్రవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సంస్థ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను కేటీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ముఖ్యంగా డేటా, డేటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు (ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల కోణాల నుంచి గత రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూసిన అనుభవంతో చెబుతున్నానని, ప్రస్తుతం ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి అద్భుతమైన భవిష్యత్ ఉందని పేర్కొన్నారు. తాను కూడా రెండు దశాబ్దాల క్రితం కార్పొరేట్ ప్రపంచంలో పనిచేశానని, అమెరికాలో విద్యాభ్యాసం చేసి అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసిన అనుభవం ఉందని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్‌జోన్లలో పనిచేస్తూ, అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ వినియోగం, ఉత్పత్తి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దానిని నిల్వ చేయడం, నిర్వహించడం, ప్రపంచానికి చేరవేయడంలో కాన్‌స్టర్ వంటి సంస్థలకు కీలక పాత్ర ఉంటుందని చెప్పారు.నేటి తరం సమాచారాన్ని పొందే విధానమే పూర్తిగా మారిపోయిందని అన్నారు. గతంలో వార్తా పత్రికలను పేజీ పేజీగా చదివే రోజులు ఉండేవని, ఇప్పుడు యువతరం మొబైల్ ఫోన్‌లో ఒక్కోసారి స్వైప్ చేస్తూ ప్రపంచాన్ని చూస్తోందని పేర్కొన్నారు. ప్రతి స్వైప్ వెనుక భారీ స్థాయిలో కంటెంట్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ జరుగుతోందని, ఈ డిజిటల్ విప్లవంతో డేటా, స్టోరేజ్ రంగాల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ టైర్2, టైర్3 నగరాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని కేటీఆర్ చెప్పారు. చిన్న పట్టణాలు, నగరాల నుంచి వచ్చే యువతలో అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆకలి, పట్టుదల ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రతిభావంతులైన యువతను ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు తీసుకురావడం కంటే, కంపెనీలు వారివద్దకే వెళ్లి అవకాశాలు కల్పించాలని సూచించారు.



# బంగ్లా నా దేశం .. అక్కడికే వెళ్తా

## మీడియా ఇంటర్వ్యూల్లో మాజీ ప్రధాని షేక్ హాసీనా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** ఏడాది చివరి నాటికి బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లాలన్న నిర్ణయం తన మాతృదేశం పట్ల ఉన్న బాధ్యత పరంగా తీసుకున్న నిర్ణయమని హాసీనా చెప్పారు. బంగ్లాదేశ్ నా దేశం. నా రాజకీయ జీవితమంతా బంగ్లాదేశ్ ప్రజలతోనే గడిపాను. నా తల్లి, నా సోదరులు, నా కుటుంబంలోని చాలా మంది సభ్యులు బంగ్లాదేశ్ గడ్డపైనే హత్యకు గురయ్యారు. నా రాజకీయ జీవితమంతా ఆ దేశానికి సేవ చేస్తూనే గడిపాను. నా మూలాలు అక్కడే ఉన్నాయి. నా ప్రజలు అక్కడే ఉన్నారు. నా బాధ్యత కూడా అక్కడే ఉంద్ది అని ఆమె గుర్తు చేశారు. తాను ఎదుర్కొన్న జైలు జీవితం, వేధింపులు, హత్యాయత్నాలు, పదేపదే వచ్చిన బెదిరింపులను గుర్తుచేసుకున్న హాసీనా దేశం తీవ్ర ఉన్న సమయంలో దూరంగా ఉండేందుకు తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. తన తిరుగు ప్రయాణం అధికారాన్ని తిరిగి దక్కించుకోవడం కోసం కాదని, తన బాధ్యతను నెరవేర్చడం, ప్రజలతో నిలబడటం, చట్టాన్ని ఎదుర్కోవడం, తనపై తీర్పును బంగ్లాదేశ్ ప్రజలకే వదిలేయడమేనని హాసీనా తెలిపారు. తనను బంగ్లాదేశ్‌కు అప్పగించే విషయంలో భారత ప్రభుత్వం వైఖరిపై తాను వ్యాఖ్యానించబోనని హాసీనా చెప్పారు. భారత్ సార్వభౌమ దేశం. భారత ప్రభుత్వం తరఫున నేను మాట్లాడను. నా అవగాహన ప్రకారం భారత్ అప్పగింత అంశాన్ని చట్టపరమైన వ్యవహారంగా చూస్తోంది. తన సొంత న్యాయ, న్యాయవ్యవస్థ ప్రక్రియల ద్వారా దీనిని పరిష్కరిస్తోంది. దాన్ని భారత్ చూసుకుంటుందని అన్నారు. భారత్‌బంగ్లాదేశ్ స్నేహ సంబంధాలకు తాను ఎప్పుడూ విలువ ఇస్తానని చెప్పారు. బంగ్లాదేశ్ తిరిగి రావడంలో ఉన్న ప్రమాదాలను హాసీనా అంగీకరించారు. అయితే భయం తన బాధ్యతను నిర్ణయించలేదని చెప్పారు. తనపై 19 సార్లు హత్యాయత్నాలు జరిగాయని ఆరోపించారు. తన కుటుంబ సభ్యుల హత్యలను గుర్తుచేసిన హాసీనా 2004 ఆగస్టులో జరిగిన గ్రెనేడ్ దాడి తనను, అవామీ లీగ్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నదని పేర్కొన్నారు. నేను జైలు జీవితం, సైనిక పాలన, రాజకీయ వేధింపులు, పదేపదే వచ్చిన బెదిరింపులను ఎదుర్కొన్నాను. కాబట్టి ప్రమాదం ఏంటో నాకు తెలుసు. కానీ రాజకీయ జీవితంలో వ్యక్తిగత భద్రత ఒక్కటే పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం కాదు. నా ప్రజలకు దూరంగా జీవించడం కంటే నా దేశానికి తిరిగి వెళ్లి ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికే నేను సిద్ధంగా ఉన్నానని హాసీనా అన్నారు. తనపై నమోదైన కేసుల్లో ఒకదానిలో విధించిన మరణశిక్షపైనా హాసీనా స్పందించారు. తన ప్రాణం గురించి తాను ఆందోళన చెందడం లేదని, న్యాయ వ్యవస్థ దన్నదే తన ఆందోళన అని చెప్పారు. కోర్టులు, చట్టాలు, ప్రభుత్వ సంస్థలను రాజకీయ ప్రతీకారం కోసం ఉప యోగిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రేరేపిత ప్రక్రియ ద్వారా విధించిన మరణశిక్షను సత్యంపై తుది తీర్పుగా పరిగణించలేం. సాధారణ, నిష్పక్షపాత, విశ్వసనీయ న్యాయ ప్రక్రియలో నన్ను నేను సమర్థించుకునే నిజమైన అవకాశం నాకు లభించలేదు. నిందితుడి పూర్తి భాగస్వామ్యం లేకుండా, సరైన న్యాయ రక్షణ లేకుండా, రాజకీయ ఒత్తిడిలో వెలువడిన తీర్పు న్యాయం కాద్దు అని ఆమె పేర్కొన్నారు. నేను కోర్టు ముందు హాజరయ్యే అవకాశం ఇవ్వండి. సాక్ష్యాలను సమర్పించనివ్వండి.

నా న్యాయ వాదులు నా తరఫున వాదించనివ్వండి. సాక్షులను ప్రశ్నించనివ్వండి. వారినిమాట్లాడ నివ్వం డని విజ్ఞప్తి చేశారు. 2024 ఆగస్టు 5 తర్వాత బంగ్లాదేశ్లో శాంతి, భద్రత, అభివృద్ధి, ప్రజల హక్కులు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. ప్రజల హక్కులను పునరుద్ధరించే విస్తృత ప్రయత్నంలో భాగంగానే తన స్వదేశానికి తిరిగి రావాలనుకుంటున్నట్లు చెప్పారు. 2024 ఆగస్టు నుంచి అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలు, సాధారణ మద్దతుదారులపై అరెస్టులు, తప్పుడు కేసులు, ఉద్యోగాల నుంచి తొలగింపులు, దాడులు, బెదిరింపులు, హింస చోటు చేసుకున్నాయని హాసీనా ఆరోపించారు. చాలామంది తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చిందని, మరికొందరు దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

వారిని నేరస్థులుగా కాకుండా రాజకీయ వేధింపులకు గురైన బాధితులుగా చూడాలని ఆమె అన్నారు. లక్షలాది మంది అవామీ లీగ్ మద్దతుదారులు, సాధారణ పౌరులు తమ సొంత దేశంలోనే తమకు ఎలాంటి చట్టబద్ధమైన స్థానం లేనట్లుగా వ్యవహరించబడుతున్నారని ఆరోపించారు. అయితే అవామీ లీగ్ బంగ్లాదేశ్ను, ఆ దేశ ప్రజలను వదిలిపెట్టబోదని ఆమె స్పష్టం చేశారు

# నియోనేటల్‌కేర్ వార్డులో అగ్నిప్రమాదం!

## నవజాత శిశువులను వెంటనే తరలించిన యాజమాన్యం

**ముంబయి, సెప్టెంబరు 4:** ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం సంభవించింది. నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో చికిత్స పొందుతున్న 9 మంది నవజాత శిశువులను వెంటనే అక్కడి నుంచి మరో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి అదుపులోనే ఉన్నదని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఆ హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జల్నా రోడ్ ప్రాంతంలో ఉన్న ఏషియన్ హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఎన్ఐసీయూలోని ఒక ఏసీ నుంచి పొగలు రావడాన్ని సిబ్బంది గమనించారు. అక్కడ ప్రత్యేక చికిత్స పొందుతున్న 9 మంది నవజాత శిశువులను వెంటనే బయటకు తరలించారు. పక్కనే ఉన్న జనరల్ వార్డులోని రోగులను కూడా ఖాళీ చేయించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది కూడా ఆ హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. ఇది చిన్న సంఘటన అని, ఎలాంటి అవాంఛనీయం జరుగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని ఆ ఆసుపత్రిని నిర్వహిస్తున్న డాక్టర్ షోయబ్ హాష్మీ తెలిపారు. ముందు జాగ్రత్తగా తమ బృందం పక్కనే ఉన్న జనరల్ వార్డులోని రోగులతో పాటు నవజాత శిశువులను కూడా ఖాళీ చేయించినట్లు చెప్పారు. ఆసుపత్రి బృందం తక్షణ చర్యలు తీసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చిందని వివరించారు. మరోవైపు జనరల్ వార్డు రోగులను తరువాత తిరిగి తీసుకువచ్చినట్లు డాక్టర్ షోయబ్ హాష్మీ తెలిపారు. కుటుంబాల అంగీకారంతో నవజాత శిశువులను ఇతర ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. ఆసుపత్రిని శుభ్రపరిచి, యధావిధిగా పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# యుపి మాజీ సిఎం అఖిలేష్‌తో సిజెపి జాతీయ సహాకన్వీనర్ రహస్యభేటీ



**లక్నో, సెప్టెంబరు 4:** ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయంగా ఏదో పెద్దగా జరగబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో కాక్రోక్ జనతా పార్టీ జాతీయ సహ కన్వీనర్ ఆశుతోష్ రాంకా లక్నోలో రహస్యంగా కలిశారు. దాదాపుగా ఇద్దరు 90 నిమిషాల పాటు భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిగా మారింది. తాము ప్రెజర్ గ్రూపుగా ఉంటామని, రాజకీయాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన సీజేపీ ఇప్పుడు అఖిలేష్‌తో భేటీ కావడం, అది కూడా యూపీ ఎన్నికల ముందు భేటీ కావడం కీలకంగా మారింది. ఎస్పీ ప్రధాన కార్యాలయం సమీపంలోని జనేశ్వర్ మిశ్రా ట్రస్ట్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఈ భేటీపై అటు ఎస్పీ, ఇటు సీజేపీ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల సీజేపీ ప్రభుత్వ పాఠశాలల్ని బాగు చేయాలని ఫిక్స్ ది స్కూల్ కార్యక్రమాన్ని చేపట్టింది. పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు అనుమతి లేకుండా ప్రవేశించవద్దని యూపీ, రాజస్థాన్ ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నిజానికి సీజేపీ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే స్కూళ్లలోని సమస్యల్ని ఎత్తిచూపుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఇప్పుడు రాజస్థాన్, మహారాష్ట్ర తర్వాత యూపీని సీజేపీ టార్గెట్ చేసిందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పేపర్ లీక్, విద్యా వ్యవస్థ సమస్యల్ని లేవనెత్తాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# నవీముంబయిలో మూడేళ్ల చిన్నారిపై వ్యాన్ డ్రైవర్ అత్యాచారం

**నవీముంబయి, సెప్టెంబరు 4:** మహారాష్ట్ర, నవీ ముంబైలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అది కూడా స్కూల్ వ్యాన్‌లోనే లైంగిక దాడికి దిగాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. నవీ ముంబైలో ఒక మూడేళ్ల చిన్నారి రోజూ స్కూల్ వ్యాన్‌లో పాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఆ వ్యాన్‌లో స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే చివరి చిన్నారి ఆ పాపే. వ్యాన్‌లోని మిగతా వాళ్లు ముందే దిగిపోయేవారు. ఆ మూడేళ్ల పాప అందరికంటే చివరి స్టాప్‌లో దిగాలి. దీంతో మిగతావాళ్లు దిగిన తర్వాత వ్యాన్‌లో ఒంటరిగానే ఉండేది. ఈ క్రమంలో వ్యాన్ డ్రైవర్ పాపపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర కడుపు నొప్పితో బాధపడింది. ఈ కడుపు నొప్పి గురించి పాపను తల్లిదండ్రులు ఆరా తీయగా స్కూల్ వ్యాన్ డ్రైవర్ తనతో ఎలా ప్రవర్తించింది చెప్పింది. పాప అత్యాచారానికి గురైనట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి షాక్ తిన్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. లాస్ట్ స్టాప్ వరకు వ్యాన్‌లో ఎవరూ లేకపోవడం, పాప ఒక్కర్తే ఉండటం వల్ల ఈ అత్యాచార ఘటన జరిగింది. డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే, ఇలాంటి ఘటనలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పిల్లలు ప్రయాణించే స్కూల్ బస్సుల విషయంలో ప్రభుత్వం కొన్ని రూల్స్ రూపొందించింది. స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఒక మహిళా సిబ్బంది ఉండాలి. చివరి విద్యార్థి దిగేవరకు ఆ వ్యక్తి బస్సులోనే ఉంటూ, వారి రక్షణ బాధ్యతలు చూసుకోవాలి.


# వరదలు ముంచెత్తిన తొమ్మిదిరోజులకు సొరంగం నుంచి ఇద్దరి వెలికితీత



**ఖాట్మండు, సెప్టెంబరు 4:** నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన మహా విషాదంలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. వరదలు ముంచెత్తిన తొమ్మిది రోజుల తర్వాత, బురద, శిథిలాలతో పూర్తిగా కూరుకుపోయిన ఒక జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీశారు. ఈ ఘటనతో ఇంకా అనేక సొరంగాల్లో చిక్కుకుపోయిన వందలాది మంది కార్మికులు కూడా ప్రాణాలతో బయటపడతారనే ఆశలు బలపడ్డాయి. నేపాల్‌లోని త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్టులో గతనెల 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇద్దరిని ప్రాణాలతో కాపాడటం అక్కడివారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బురదతో నిండిపోయిన కార్మికులను సహాయక సిబ్బంది తమ భుజాలపై మోసుకుని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వీడియోలో, కార్మికుడిని సొరంగం నుంచి బయటకు తీయగానే సహాయక సిబ్బంది ఆనందంతో కేరింతలు కొట్టడం కనిపించింది. మరో చిత్రంలో, బురదలో కూరుకుపోయిన మరో వ్యక్తిని స్ట్రెచర్‌పై తరలిస్తుండగా, అతను చేతులు జోడించి నమస్కరించడం హృదయాలను కదిలించింది. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందంటే.. సహాయక చర్యల్లో ప్రాణాలతో బయటపడిన వారిని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (ఎన్ఈఏ) మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ షా (30), త్రిశూలి3 ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్ (45)గా నేపాల్ హోం మంత్రి సుడాన్ గురుంగ్ గుర్తించారు. సంజయ్ షా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో అతన్ని వెలంటనే హెలికాప్టర్‌లో రాజధాని ఖాట్మండుకు సమీపంలోని బత్తర్‌కు తరలించారు. మరోవైపు, కబీర్ మహర్జన్ స్పృహలోనే ఉన్నాడని, అతన్ని ఖాట్మండులోని చౌనీ మిలటరీ ఆసుపత్రికి తరలిస్తున్నామని అతని భార్య తెలిపారు. "చాలా సంతోషంగా ఉంది, నా గుండెపై భారం తగ్గింది" అని కబీర్ సోదరుడు అమీర్ మహర్జన్ ఆనందం వ్యక్తం చేశారు. హిమనీనదం కూలిపోవడం వల్ల సంభవించిన ఈ జల ప్రళయంలో నేపాల్‌లోని మూడు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,259 మంది మరణించగా, 5,000 మందికి పైగా గల్లంతయ్యారన్నారు.

# బాలుని కడుపులో బ్లేడ్‌లు

**- గాయం కాకుండా బయటకు తీసిన ఉస్మానియా వైద్యులు - పదహారేళ్ల బాలుని కాపాడిన వైనం**



బాలుని కడుపు నుంచి బయటకు తీసిన బ్లేడ్‌లు

**అఫ్జల్‌గంజ్,సెప్టెంబర్ 4ప్రభాతవార్త:** మానసిక రోగి ఐనా ఓ 16 ఏళ్ల బాలుడు మింగిన రేజర్ బ్లేడ్‌లను ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ఎండోస్కోపి పద్దతిలో తొలగించి ప్రాణాలు కాపాడి మరోసాటి తమకు సాటి లేరని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు నిరూపించుకున్నారు. సాదారణంగా బ్లేడ్ ఏ భాగంలో తగిలినా రక్తంవస్తుంది. కాని మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్, డాక్టర్ బి.రమేష్‌కుమార్ ఎంతో నైపుణ్యంతో, చాక, చాక్యంతో బాలుడి కడుపులో ప్రమాదకరంగా ఉన్న బ్లేడ్‌లను శరీర లోపలి బాగంలోఎంటు వంటి ప్రమాదం లేకుండా మింగిన బ్లేడ్‌లను బయటకు తీసి బాలుడి ప్రాణాలను కాపాడారు. ఈ చికిత్స విజయవంతంగా నిర్వహించిన మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతితో పాటు వైద్యులను ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సహాయ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్బంగా ఉస్మానియా ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.రమేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. తాండూరు ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ మహబూబ్‌అలీ కుమారుడు మహమ్మద్ ముజీబుర్ రహ్మాన్(16)గత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. కాగా ఈనెల3వ తేదిన తెల్లవారు జామున రెండు గంటల సమయంలో రేజర్‌బ్లేడ్‌లను మింగాడు. తక్షణమే గమనించిన తండ్రి మహబూబ్‌అలీ తన కుమారున్ని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి జనరల్ సర్జరీ విభాగంలో అడ్మిట్ చేసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇదిలా ఉండగా బాలుడికి ఎక్స్ రే తీయగా కడుపులో రేజర్ బ్లేడ్ ముక్కలు ఉన్నట్లు గుర్తించారు. మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రిఫర్ చేయడంతో ఆ బాలునికి వివిధ పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రమేష్‌కుమార్ ఎండోస్కోపి నిర్వహించి, సెడషన్ ఇచ్చి ఎండోస్కోపిక్ పద్దతిలో బ్లేడ్ ముక్కలను తొలగించడానికి ప్రణాళిక రూపొందించారు. కడుపులో విరిగిన రేజర్ బ్లేడ్‌ల అనేక ముక్కలు ప్రమాదంగా ఉన్నట్లు భావించారు. అపారమైన అనుభవం నైపుణ్యం కలిగిన హెచ్ఓడి డాక్టర్ బి.రమేష్‌కుమార్ ఎంతో సునాయసంగా ఎండోస్కోపి పద్దతిలో నిర్వహించి విరిగిన బ్లేడ్ ముక్కలను తొలగించారు. రోగి కొలువడానికి ఎటువంటి అటంకాలు లేకుండా ఎండోస్కోపి చికిత్సను సాఫీగా, విజయవంతంగా నిర్వహించడంతో ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఎండోస్కోపి ప్రక్రియలో మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగధిపతితోపాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సాహిత్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.అశికా, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సయ్యద్‌నదీమ్, పోస్టుగ్రాడుయ్యేట్ డాక్టర్ షేక్‌మహ్మద్ ఖాసీంతోపాటు అనస్థీషియా వైద్యుల బృందం, నర్సింగ్ సిబ్బంది భారతి, ముత్యాలు పాల్గొన్నారు.

# కొర్వి కృష్ణ స్వామి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : మంత్రులు పొన్నం, వాకిటి



సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద నగర తొలి మేయర్ కొర్వి క్రిష్ణ స్వామికి నివాళులర్పిస్తున్న మంత్రులు,పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర తొలి మేయర్, విద్యావేత్త, జర్నలిస్టు కొర్వి క్రిష్ణ స్వామి ముదిరాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి, రాష్ట్ర పొన్నం ప్రభాకర్, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు తెలిపారు.

నగర తొలి మేయర్ కొర్వి క్రిష్ణ స్వామి 133వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ముదిరాజ్‌లు ఐక్యతతో తమ హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. హైదరాబాద్‌ను మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశారన్నారు. కుల సంఘాల ఏర్పాటుకు నాంది పలికి చాటి చెప్పిన మహనీయుడని పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌లు మాట్లాడుతూ కొర్వి క్రిష్ణ స్వామి జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. కొర్విక్రిష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నాగేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినకర్ బాబు, ముదిరాజ్ సంఘం నేతలు చొప్పరి శంకర్, ఆగం పాండు, వేణుగోపాల్, పిట్ల సురేశ్, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణానికి వేగం పెంచండి

## పోలవరం ముంపు పై కేంద్రం స్పందించే వరకు పోరాటం: మంత్రి పొంగులేటి

**భద్రాచలం, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)** దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులకు వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ అభివృద్ధి పనులపై కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ఇప్పటివరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తూ 24 గంటలూ నిర్మాణం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో ఆలయ నిర్మాణంలో నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడవద్దని సూచించారు. నిర్మాణానికి వినియోగించే రాళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అత్యుత్తమ నాణ్యత కలిగిన వాటినే ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు, అదనపు అవసరాలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐటీడీఏ పీవో రాహుల్ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతులు, నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపిస్తే తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భద్రాచలం ఆలయ పునర్నిర్మాణం కేవలం నిర్మాణ పనులు కాదని, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన పవిత్ర బాధ్యత అని పేర్కొన్నారు. రామయ్య ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# మూడేళ్లుగా సిడిపి నిధులకు బ్రేక్

## పేరుకుపోతున్న నియోజకవర్గ సమస్యలు - రూ.10 కోట్లతో మొదలు.. రూ.5 కోట్లకు కుదింపు

**యాదాద్రి భువనగిరి బ్యూరో ,ప్రభాతవార్త:** నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేల వద్ద ఉండాల్సిన నిధులకు ప్రభుత్వం కత్తెర్ల వేసిందా? సీడీపీకి దాదాపు తలుపులు మూసి.. ఎస్‌డీఎఫ్ పేరుతో విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్న విధానం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం.. రెండో విడతకు వచ్చేసరికి కేవలం రూ.5 కోట్లకే పరిమితం చేసింది. అదీ రాష్ట్రంలోని 76 నియోజకవర్గాలకే.. మరోవైపు గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల సమస్యలు రోజురోజుకూ పెరుగుతుండటంతో నిధులు లేక అభివృద్ధి ఆగిందా? అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది. సీడీపీ నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడం.. దాని స్థానంలో ఎస్‌డీఎఫ్ నిధులను ప్రత్యామ్నాయంగా వినియోగించడం.. నిధుల కేటాయింపులోనూ కోతలు పడటం.. వెరసి నియోజకవర్గ అభివృద్ధి నిధుల వ్యవస్థ గందరగోళంగా మారిందన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఎమ్మెల్యేలు ప్రజలకు ఇచ్చిన హామీలు, స్థానికంగా వచ్చిన అభివృద్ధి వినతులు, అత్యవసర మౌలిక వసతుల పనులకు నిధులు సమకూర్చడంలో పరిమితులు ఎదురవుతున్నాయన్న వాదనలు బలంగా వినిపిస్తు న్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న తర్వాత సీడీపీ నిధులను నేరుగా విడుదల చేయకుండా ఎస్‌డీఎఫ్ పేరుతో నియోజకవర్గాలకు నిధులు కేటాయించే విధానాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 2024 నవంబర్ 25న జీవో ఆర్‌టీ నంబర్ 299 ద్వారా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కదానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.1,190 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులను 2024-25 హెచ్‌డీఎఫ్ గ్రాంట్ కింద విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే రూ.10 కోట్ల నిధులకు కూడా వినియోగ పరిమితులు విధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2 కోట్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.కోటి వెచ్చించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో నియోజకవర్గంలో అత్యవసరంగా ఉన్న ఇతర పనులకు ఎమ్మెల్యేలు తమ ప్రాధాన్యత మేరకు నిధులు కేటాయించే అవకాశం ఉందన్నది ప్రశ్నగా మారింది. మొదటి విడతతో పోలిస్తే రెండో విడతలో నిధుల కేటాయింపు భారీగా తగ్గింది. 2025 నవంబర్ 1న జీవో ఆర్‌టీ నంబర్ 251 ద్వారా రాష్ట్రంలోని కేవలం 76 నియోజకవర్గాలకు మాత్రమే ఒక్కొక్కదానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. అంటే తొలి విడతలో రూ.10 కోట్లు అందుకున్న నియోజకవర్గాలకు రెండో విడతలో సగం నిధులతోనే సరిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# హల్ద్వానీ శుద్ధీకరణ కార్యక్రమంపై జీరో ఎఫ్ఐఆర్

**బెంగళూరు,సెప్టెంబరు 4:** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన శుద్ధీకరణ కార్యక్రమంపై బెంగళూరులోని విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అదే వేదికపై ర్యాలీలో ప్రసంగించిన కొన్ని రోజుల తర్వాత ఈ 'శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఉత్తరాఖండ్ బీజేపీకి చెందిన సభ్యులతో పాటు మరికొందరి పేర్లు ఉన్నాయి. ఘటనపై భారత జాతీయ కాంగ్రెస్ ఎస్టీ విభాగం (ఆదివాసీ కాంగ్రెస్) మాజీ వైస్ చైర్మన్ టీఆర్ రామప్ప ఫిర్యాదు చేశారు. ఖర్గే హాజరైన కారణంగా రామ్‌లీలా మైదానం 'అపవిత్రమైందనే కులవివక్ష సందేశాన్ని పంపే ఉద్దేశంతో శుద్ధీకరణ నిర్వహించారని ఆరోపించారు. ఈ కేసులో ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ పేరును కూడా ఫిర్యాదుదారు ప్రస్తావించారు. శుద్ధీకరణ కార్యక్రమంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేసిన అనంతరం భట్ మీడియా ముందు దాని ని సమర్థించి, సమర్థించుకునే ప్రయత్నం చేశారని రామప్ప ఆరోపించారు. కేసును ఎస్సీ/ ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1995, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల కింద నమోదు చేశారు.



# కూకట్‌పల్లి జెఎన్టీయూలో విద్యార్థుల ఘర్షణ

## పలువురికి గాయాలు.. పోలీసుల అదుపులో స్టూడెంట్స్

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం అర్ధరాత్రి తీజ్ వేడుకల సందర్భంగా విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం ముదిరి.. గౌతమి, మంజీరా హాస్టళ్ల విద్యార్థులు పరస్పరం దాడులకు దిగారు. రెండు వర్గాలుగా విడిపోయి కర్రలతో దాడులు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. గురువారం జేఎన్‌టీయూ హాస్టల్‌లో తీజ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిపై పలువురు దాడి చేయడంతో వివాదం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అనంతరం రెండు వర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో గౌతమి, మంజీరా హాస్టళ్ల విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు విచక్షణారహితంగా దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హాస్టల్ సిబ్బంది, యాజమాన్యం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు. ఈ గొడవ విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు వెంటనే జేఎన్‌టీయూ క్యాంపస్‌కు చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి విద్యార్థులను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా క్యాంపస్‌లో భద్రతా చర్యలు చేపట్టారు. ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, దాడిలో పాల్గొన్న విద్యార్థుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మరోవైపు విద్యార్థుల మధ్య ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యూనివర్సిటీ యాజమాన్యం కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. క్యాంపస్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. కూకట్‌పల్లి జేఎన్టీయూ హాస్టల్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 8 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నామని డీసీపీ రితిరాజ్ వెల్లడించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఘర్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలో డీసీపీ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..గురువారం జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో డయల్ 100కి ఫోన్ రావడంతో పోలీసులు వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు. మళ్లీ అర్ధరాత్రి 2:30కి రెండు వర్గాల విద్యార్థులు ఘర్షణకు దిగారని వివరించారు. దాంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. తొలుత ఓ అమ్మాయికి సమస్య వస్తే.. ఆమె తన స్నేహితుడికి ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న సమయంలో గొడవ పెరిగి గ్రూప్ తగాదాగా మారిందని డీసీపీ రితిరాజ్ చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై కాలేజీ ప్రిన్సిపాల్, వార్డెన్‌తో మాట్లాడతామని అన్నారు.

ఫ్యాషన్ ఫ్యాషన్

# గళ్ల కోక- పట్టు రైక !

అమ్మమ్మల నాటిజ్ఞాపకాలు మళ్లీ కళ్ల ముందు మెదలుతున్నాయి. గళ్ల కోకలు మీకు తెలుసా.. అలా చూడగానే ఇట్టే ఆకర్షణ కనపడుతుంది. అమ్మమ్మ నడిగితే బట్టల మధ్యలోకం చూపిస్తుంది కదే! అప్పుడప్పుడూ తీసి చూస్తూ, తడుముతూ అనుబంధాలను గుర్తుకు తెచ్చుకుంటారు. అందరికీ ఆ అవకాశం ఉండదు. ఫొటోలోనో... లేదంటే లీలగా మెదడు పొరల్లో దాక్కునో గుర్తు చేస్తుంది. ఆ అందమే వేరు అనిపిస్తూ ఉంటుంది. ఆ చీరతో ముడిపడిన జ్ఞాపకం, వారసత్వం, ప్రేమ ఎవరికి వారికే ప్రత్యేకం! కాకపోతే ఫ్యాషన్ ప్రపంచమే వేరు. దానికెప్పుడూ పాత అన్న ముద్ర ఉండదు. అందుకే అప్పుడప్పుడూ వెనక్కెళ్లి... జ్ఞాపకాలను సరికొత్తగా తెస్తుంది. అలా ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయి... 'వింటేజ్ చీరలు'. అందునా గళ్ల చీరలకు మరీ క్రేజ్ పెరుగుతోంది. కాబట్టే, పట్టు ఏదన్న తేడా లేకుండా ఆనాటి రంగులు, చిన్నా పెద్ద గళ్లతో చీరలు మార్కెట్లో సందడి చేస్తున్నాయి. నోస్టాల్జియా అంటూ తమ ఊహల్లో నిక్షిప్తమైన వాటిని తెచ్చేసుకుంటున్







# పని సులువుగా..

ఇంట్లోనైనా, పనిచేసే ఆఫీసులోనైనా సుళువు తెలుసుకుంటే అంతా సజావుగానే నడుస్తుంది. పద్ధతిగా. చేస్తే ఉన్న ఆనందం ఆఫీసులో ఒబ్బిడిగా చేసుకునే వర్క్ రెండింటికీ మెళకువలు తెలుసుకుంటే మేలు. ఆలోచించండి. లేదంటే పనిని ఆస్వాదించడం మానేసి, ఒత్తిడిగా భావిస్తారు. ఒకదాని తర్వాత మరొకటి చేసుకుంటూ వెళ్లిపోవడం కాకుండా మీపనిని విభజించుకోండి. అరగంటలోపు పూర్తయ్యేవి చిన్నవి. అంతకన్నా ఎక్కువ సమయం పట్టేవి పెద్దవి. ముందు పెద్దవి చేసేస్తే చిన్నవేముంది. చకచకా చేసు కుంటూ వెళ్లొచ్చు అని పిస్తుంది కదా! కానీ చిన్నవే తొలుత పూర్తిచేయండి. ఏముందిలే అనుకుంటాం కానీ వీటినే త్వరగా మర్చిపోతాం. మన ఆడవాళ్ల పరిస్థితే విచిత్రం. ఆఫీసులో పని చేయాలి. ఇంటి బాధ్యతలనూ ఓ కంట కనిపెట్టుకోవాలి. ఆ రోజు భర్త, పిల్లలకు గుర్తు చేయాల్సినవి ఏమైనా ఉన్నాయా? ఇంట్లో గమనించుకోవల్సిన విషయాలు, పిల్లలు పూర్తిచేయాల్సిన హోంవర్క్‌లు వంటివి ఏమైనా ఉంటే ముందుగానే వాళ్లకో మెసేజ్ పెట్టే యండి. పని మీద నుంచి దృష్టి పక్కకు మళ్లదు.



ఆఫీసులో కొన్ని మీరే పూర్తి చేయాలి. వాటితో సమస్య ఉండదు. మరి కొన్ని ఇతర విభాగాలతో కలిసి చేసేవి ఉంటాయి. ఇలాంటి వాటి విషయంలో వాళ్లతో ఎలా చేయాలన్నది ముందుగానే మాట్లా డండి. ఆఖరి నిమిషంలో హడావుడి, పొరపాట్లకు తావుండదు. మర్చిపోతా మని జాబితాగా రాసుకుని పెట్టుకోవడం చాలామందికి అలవాటే! మంచిదే కానీ అది కళ్ల ముందు కనిపిస్తోంటే తెలియకుండానే ఒత్తిడి పెరుగుతుందట. కాబట్టి, పక్కన పెట్టేయండి.

# బెల్లంతో భలే !

శీతలంలో బెల్లానికి మించిన దివ్యౌషధం మరొకటి ఉండదు! వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండే ఈ కాలంలో బెల్లం వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది. శ్వాసకోశ ఇబ్బందులు రాకుండా ఉండేందుకూ ఉపకరిస్తుంది.

★ బెల్లం శరీరంలోని వ్యర్థాలను బయటకు నెట్టేస్తుంది. కాలేయంపై భారం పడకుండా చేస్తుంది. అందుకే భోజనం తర్వాత ఒక చిన్నబెల్లం ముక్క తింటే మంచిదనేది. ★. జలుబు దగ్గువంటివి చికాకు పెట్టే రోజులివి. ఆ సమస్య నుంచి ఉపశమన పొందాలంటే టిలో పంచదారకు బదులు బెల్లాన్ని వాడి చూడండి. ★.. బెల్లానికి రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉంది. రోజూ ఓ చిన్నముక్క తింటే రక్తంలోని దోషాలు తొలగిపోతాయి. బిపిని అదుపులో ఉంచుతుంది. ★.. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రక్తహీనతను తగ్గించి, ఇన్‌ఫెక్షన్లను దరిచేరకుండా చూస్తాయి. కీళ్లనొప్పులు రాకుండా ఉంటాయి. ★.. ఫ్యాక్టరీలు, కాలుష్యం ఎక్కువగా ఉండే చోట్ల పనిచేసేవాళ్లు బెల్లాన్ని తింటే ఊపిరితిత్తుల్లో ఉన్న వ్యర్థాలు బయటకు పోయి శరీరానికి మేలు జరుగుతుంది. ★.. నెలసరి రోజుల్లో తీవ్రమైన కడుపునొప్పితో బాద పడేవారు రోజూ బెల్లం తింటే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

# ట్యూబర్‌క్యులస్ ఆర్థరైటిస్



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది 2 విధాలుగా ఉంటుంది.

**మొదటి విధానం :** 1. కేషియస్ ఎక్స్‌డేటివ్ టైప్: ఈ టైప్‌లో ఎముక ఎక్కువగా డామేజ్ అవుతుంది. దీని వల్ల వాపు ఎక్కువై అబ్సెస్ తయారవుతుంది. దీనివల్ల వెన్నెముక వంగిపోవడం వల్ల ప్రక్క నున్న పొరలు ముడుచుకొని పోతాయి. చీముగడ్డలు పగిలి సైనస్ ఏర్పడుతుంది. వీటిలో ద్రవం (ఎక్స్‌డేషన్) ఎక్కువగా ఉండి రసి కారుతుంటుంది. ఇది పిల్లల్లో ఎక్కువగా కన్పిస్తుంది.

**రెండవ విధానం :** 2. గ్రాన్యులార్ టైప్ : ఈ టైప్‌లో బోన్ ఎక్కువగా డామేజ్ కాదు. ఇది పెద్దవారిలో ఎక్కువ. మెల్లగా ఏర్పడుతుంది. ఎక్స్‌డేషన్ (ద్రవం) ఉండదు. క్లాసిక్ సిక్కా భుజంలో ఎక్కువగా కన్పిస్తుంది. కాబట్టి ఇది డ్రై (పొడిగా) ఉంటుంది. ఇవే గాకుండా తుంటి ఎముక ఎఫెక్ట్ అయినప్పుడు ఎముకలోని గ్రేటర్ ట్రోకంటర్ ఎఫెక్ట్ అవుతుంది. ఇది 6-15 సంవత్సరాల వారిలో ఎక్కువ. జాయింట్ క్యాప్స్యూల్ దెబ్బతిని బిరుసు ఎక్కి ముడుచుకొని పోతుంది. కదిలించిన నొప్పి ఉండి అన్ని వైపులా కదలలేరు. తుంటి ఎముక జారినట్లుండి కుంటుతూ నడుస్తారు. ఎక్కువగా కుడివైపు నొప్పి సాయంత్రం పూట ఉంటుంది. మోకాలుకు టిబి రక్తం ద్వారా వ్యాపిస్తుంది. జాయింట్స్ మధ్య, సైనోవియమ్, ఆర్టిక్యులార్ మార్జిన్స దెబ్బ తింటుంది. దీని వల్ల సైనోవియల్ మెంబ్రెన్ ఎర్రగా ఉబ్బి చిన్న చిన్న ట్యూబర్‌క్యులస్‌గా ఉండి ఫైబ్రినస్ ఫ్లెక్స్‌తో ఉంటుంది. ఇది నెలల తరబడి ఉంటుంది. ఆస్టియో ఆర్టికుల్యర్‌గా ఉండి బోన్‌ని తినేస్తుంది. రాను రాను మొత్తం జాయింట్ గ్రాన్యులేషన్ టిస్యూతో నిండి మోకాలు ప్రక్కకు తొలగినట్టుంటుంది.

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి లక్షణాలు నిదానంగా ప్రారంభమవుతాయి. ఒక్కోసారి ఉన్నట్టుండి తీవ్రంగా వస్తుంది. ఇది రోగి వ్యాధి నిరోధక శక్తి తక్కువగా వున్నవారిలో ఎక్కువ. ఒక బోన్ లేదా జాయింట్ మాత్రమే ఎఫెక్ట్ అవుతుంది. మధ్యాహ్నం పూట జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, రాత్రిళ్ళు చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అనేమియా, నిస్సత్తువ, వళ్ళునొప్పులుంటాయి. లోకల్‌గా నొప్పి, వాపు, స్టిఫ్‌నెస్, పట్టేసినట్టుంటుంది. కదిలిన నొప్పి, కండరాల క్షీణత, లింఫ్ గ్రంధుల వాపు ఉంటుంది. ఎముక క్షీణించడం వల్ల మనిషి వంగిపోతాడు. ఛాతీ, మెడ, తొడ భాగంలో ఎక్కువగా కోల్డ్ అబ్సెస్ తయారవుతాయి. ముసలి వారిలో బోన్ (ఎముక) చివరి భాగం ఎఫెక్ట్ అవుతుంది. వీపు కండరాల్లో స్పాజమ్ వల్ల రోగి గూని వచ్చినట్లు వంగిపోవడం వుంటుంది. రోగం నయమైపోయినప్పటికి వ్యాధి లక్షణాలన్ని తగ్గిపోయిన కైఫోసిస్ (గూని) మాత్రం అలాగే ఉంటుంది. కాని ఇన్ఫెక్షన్ వుండడం వల్ల ఇఎస్ఆర్ ఎక్కువగా ఉంటుంది.

**నిర్ధారణ పరీక్షలు :** ఎక్స్‌రేలో ఎముక డామేజ్ అయి ఉంటుంది. టిష్యూ వాపు, బోన్‌లో రీ కాల్సిఫికేషన్, ఎముక పై భాగం మందంగా, క్రొత్త ఎముక తయారీ ఉంటుంది. కార్టిలేజినస్ టిష్యూ మాత్రం డామేజ్ కాదు. జాయింట్ స్పేస్ తగ్గుతుంది. మార్జిన్స్ ఇరెగ్యులర్‌గా, హెజీ నెస్‌గా ఉంటుంది. పెరి అర్టిక్యులార్ ఆస్టియో ఫోరోసిస్ అంటుంది. రక్తం, టి.బి. పరీక్ష, కల్చర్, స్కానింగ్ సిటి, ఎంఆర్ఐ, బయాప్సీ, బోన్‌స్కాన్ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.

**చికిత్స :** బెడ్ రెస్ట్, మంచి పోషకాహారం తీసుకోవాలి. ట్రాక్షన్, మొబలైజేషన్, కీమ్‌థిరపీ, టిబి చికిత్స, కాలీపర్స్ క్రచ్చర్స్ సపోర్ట్ కోసం వాడాలి. వైద్య పర్యవేక్షణలో చికిత్స అవసరం.

# 'చకోర లూనార్ లవ్ బర్డ్' టీజర్ విడుదల



శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగానటిస్తున్న సినిమా 'చకోర లూనార్ లవ్ బర్డ్'. ఈ చిత్రాన్ని వీఐపీ వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ సారథ్యంలో హై జాయ్ కమర్షియల్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ డా.చింతాడ హేమారావు నిర్మిస్తున్నారు. "చకోర లూనార్ లవ్ బర్డ్" సినిమాతో ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన మంగా శ్రీనివాస్ నూతన దర్శకుడిగా పరిచయ మవుతున్నారు. అక్టోబర్ 8న ఈ సినిమా గ్రాండ్ థియేటర్ రిలీజ్‌కి రాబోతోంది.ఈ రోజు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా "చకోర లూనార్ లవ్ బర్డ్' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ బాగుందంటూ ప్రశంసించిన రామ్మోహన్ నాయుడు చిత్ర దర్శక నిర్మాతలకు, ఇతర బృందానికి తన బెస్ట్ విశెస్ అందించారు."చకోర లూనార్ లవ్ బర్డ్" సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే అందమైన వైజాగ్ నేపథ్యంలో సాగే సరికొత్త ప్రేమ కథతో ఈ సినిమా రూపొందినట్లు టీజర్ తో తెలుస్తోంది. ఇది మామూలు ప్రేమ కథ కాదు, అమ్మ చెప్పిన ప్రేమ కథ, అమ్మ చెప్పిన ప్రేమ కథే కాదు అబ్బాయి ప్రేమ కథ, అబ్బాయి ప్రేమ కథే కాదు అమ్మాయి ప్రేమ కథ కూడా , ఇది మామూలు ప్రేమ కాదు. ఇది చకోర ప్రేమ కథ అంటూ వచ్చే వాయిస్ ఓవర్ తో ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. జాబిల్లి చేరేందుకు ప్రయత్నించే చకోర పక్షిని సింబాలిక్ గా చెబుతూ హీరో క్యారెక్టరైజేషన్‌ను డిజైన్ చేయడం కొత్తగా అనిపిస్తోంది. చకోర పక్షి ఒక యూనిక్ బర్డ్.. తన దాహాన్ని తీర్చుకునే ప్రాసెస్‌లో స్వచ్ఛమైన వాన చినుకులనే త్రాగుతుంది తప్ప ఏది బడితే అది త్రాగదు...ఆ వర్షపు చినుకుల కోసం అప్పటివరకూ నిరీక్షిస్తూ ఉంటుంది... ఈ కథలో హీరో కూడా అంత స్వచ్ఛమైన ప్రేమికుడు అని చెప్పడానికి ఈ చిత్రానికి చకోర టైటిల్ పెట్టారు.

# 'చంద్రయాన్' సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్



త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న హిలేరియస్ అడ్వెంచర్ మూవీ రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో 'చంద్రయాన్' టైటిల్‌తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్ పై ప్రవీణ్ మొలక నిర్మిస్తు న్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన 'చంద్రయాన్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. మంద మర్రి అనే ఊరిలోని ముగ్గురు యువకులు బైక్ టైర్లు, కుక్కర్, డంబెల్..ఇలా తమకు దొరికిన వస్తువులతో సొంతంగా మా ఊరి రాకెట్ తయారు చేసుకుని చందమామ దగ్గరకు వెళ్లడం ఈ మోషన్ పోస్టర్ లో ఆసక్తి కలిగిస్తోంది. ముగ్గురు యువకుల చంద్రయాన్ యాత్రను ఎందుకు చేపట్టారు. ఈ సాహసం చేయడం వెనక కారణాలు ఏంటి, శాస్త్రవేత్తలకే సవాలు విసిరే చంద్రయాన్ లో ఈ ముగ్గురు యువకులు విజయం సాధించారా లేదా వంటి అంశాలతో మోషన్ పోస్టర్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ మోషన్ పోస్టర్ కు హర్ష ప్రవీణ్ కంపోజిషన్ లో శ్రీనాథ్ చంద్రశేఖర్ సాహిత్యాన్ని అందించగా కనకవ్వ, శ్రీనిజ భదూరి, లాస్య పాడిన రామ రామ రామ ఉయ్యాలో పాట మరింత ఆకర్షణను తీసుకొచ్చింది.మనవైన కథలు టాలీవుడ్ బాక్సాఫీస్ మీద జెండా ఎగరేస్తున్న ప్రస్తుత ట్రెండ్ లో మరో లోకల్ కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు చంద్రయాన్ సినిమా రెడీ అవుతోంది.

## తెర

# 'కాకా' సెప్టెంబర్ 7 నుంచి షెడ్యూల్ ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ కాకా. వెంకట్ కే నారాయణ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మెగాస్టార్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచిందిప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో 'కాకా' నెక్స్ట్ భారీ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ లెన్తీ షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన వర్కింగ్ స్టిల్‌లో మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి షూటింగ్ లొకేషన్ లో డిస్కస్ చేస్తూ కనిపించారు. ఈ బిహైండ్ ద సీన్ పిక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్, ఆంటోనీ ఎల్. రూబెన్ ఎడిటింగ్. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అడిషనల్ స్క్రీన్ ప్లే రైటర్స్‌గా పనిచేస్తున్నారు. భానునందు డైలాగ్స్ రాస్తున్నారు. 2027 జనవరి 13న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'డెలులు' చిత్రం టీజర్ లాంచ్

'చిరంజీవి నన్ను హీరోగా నమ్ముతున్నప్పుడు నేను కూడా నన్ను నమ్మాలి' డెలులు చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విజయ రాజ్ కుమార్.. క్రియేటివ్ లాంచ్ పాడ్ బ్యానర్ పై



ప్రీతం కస్తూరి దర్శకత్వం లో సంకీర్త్ కొండ నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం డెలులు. విజయ రాజ్ కుమార్, వేణి రావు, సాయి ప్రసన్న, అఖిల్ జాక్సన్, శ్రీరామ మండవ కీలక పాత్రలు పోషించారు. రేష్మిత్ ఎస్ కౌశిక రచించిన ఈ కథకు విజయ రాజ్ కుమార్ డైలాగులు అందించగా జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ చేశారు. ఈ సందర్భంగా సినిమా టోగ్రాఫర్ జై రాజ్ నాయుడు మాట్లాడుతూ... నాకు అవకాశం ఇచ్చి సపోర్ట్ గా నిలిచిన మా డైరెక్టర్‌కి థాంక్స్. ఎడిటర్ హరికృష్ణ మాట్లాడుతూ... "కొత్తవారు అందరూ కలిసి ఈ సినిమా చేశాం. సంగీత దర్శకుడు ఆది చేబ్రోలు మాట్లాడుతూ... "డెలులు అనే పదం జెన్ జి నుండి వచ్చింది. నటుడు అఖిల్ జాక్సన్ మాట్లాడుతూ... "మొదటిసారి ఇలా స్టేజ్ పై మాట్లాడు తున్నాను. నేను ఈ స్థాయిలో ఉన్నాను అంటే దానికి కారణం మా అమ్మ. నాకు అవకాశం ఇచ్చిన సినీ బృందానికి థాంక్స్. హీరోయిన్స్ వేణి రావు, సాయి ప్రసన్న మాట్లాడుతూ... "ఈ కార్య క్రమానికి వచ్చి మాకు సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్. చిత్ర దర్శకుడు ప్రీతం మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి హాజరైన మీడియా మిత్రులకు, ముఖ్య అతిథులకు ధన్యవాదాలు. సినిమా అనేది ఒక్కరి కృషితో సాధ్యం కాదు, మొత్తం టీమ్ సమష్టి కృషి వల్లే సినిమా పూర్తవుతుంది. జిగిరీస్ చిత్ర నటుడు కృష్ణ మాట్లాడుతూ."ఈ సినిమాను సపోర్ట్ చేస్తూ ఇక్కడికి వచ్చిన అందరికీ థాంక్స్.

# 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్ విడుదల



సోషల్ మీడియాలో లాంచ్ చేసిన బ్రహ్మజీ భక్తిరస చిత్రంలో మార్కండే యుడిగా బ్రహ్మజీ శరవేగంగా షూటింగ్ జరుపు కుంటున్న 'కృష్ణంభజే' మూవీ జయశ్రీ మీడియా సమర్ప ణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం'కృష్ణంభజే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మజీ మార్కండేయ పాత్రను పోషి స్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మజీ కృష్ణంభజే ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు. పోస్టర్ లో బ్రహ్మజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మజీ మార్కండే యుడి గెటప్‌లో సంప్ర దాయ ఆధ్యాత్మిక రూపం లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొంది స్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీప్, హీరోయిన్‌గా వంగమయి పటేల్ నటిస్తున్నారు.

# పోలీస్ పవర్-3 షూటింగ్ ప్రారంభం



శివ ఫిలిం ప్యాక్టరి బెనరుపై నిర్మిస్తున్న 'పోలీస్‌పవర్ 3' చిత్రం గురువారం ఫిలిం చాంబర్‌లో ప్రముఖుల చేతుల మీదుగా చిత్రం షూటింగ్ ప్రారంభించటం జరిగింది. హీరో, డైరక్టర్ నిర్మాత శిజొన్నలగడ్డ స్వీయ నిర్మాణంలో జరుగుతుంది. శివ జొన్నగడ్డ మాట్లాడుతూ 'పోలీస్ పవర్-1, చిత్రాన్ని పోలీస్ పవర్-2 ప్రేక్షక దేవుళ్ళు ఎంతగానో ఆదరించారు. అలాగే ఈ రెండు చిత్రాలు కూడా యథార్ధ సంఘటనల ఆదారంగా తీసాము. అలాగే ఈ పోలీస్ పవర్-3, చిత్రం కూడ మూడు యథార్థ సంఘటనల ఆధారంతో తెరకెక్కిస్తుం న్నాము అని తెలిపారు. మొదటి షెడ్యుల్ వారం పదిరోజుల్లో మొదలవుతుంది. తారగణం : శివజొన్న లగడ్డ మరియు ఐదుగుహీరోలు, ఐదుగురు హీరోయిన్స్ నటిస్తారు. అలాగే ముఖ్యమైన పాత్రల్లో సినియర్ నటి, నటులు నటిస్తారు.

# మహిళల టి20.. నేడే హై ఓల్టేజ్ మ్యాచ్





## చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** 2026 మహిళల ఆసియా కప్‌లో సెమీ ఫైనల్ స్థానాన్ని ఇప్పటికే ఖరారు చేసుకున్న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ జట్టుకు, తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో నేడు హై ఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాక్‌తో జరిగే గ్రూప్ ఎ చివరి పోరులో తమ విధానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని టీమిండియా చూస్తోంది. దుబాయ్‌లోని నెమ్మదైన పిచ్‌లపై అసోసియేట్ జట్లు మరోసారి ఆ బలహీనతలను బయటపెట్టడంతో, భారత మిడిల్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం అనే అంశం పరిశీలనకు గురైనప్పటికీ, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పాకిస్థాన్‌పై గెలవడానికి స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆమె ఓపెనింగ్ భాగస్వామి షఫాలీ వర్మ, వరుసగా హాంకాంగ్ చైనా, థాయ్‌లాండ్‌లపై 124 మరియు 64 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఈ మ్యాచ్‌లోకి వస్తున్నారు. ముఖ్యంగా స్మృతి, గురువారం రాత్రి పలు రికార్డులు సృష్టించిన తర్వాత బరిలోకి దిగుతోంది. బౌలింగ్ విభాగంలో, పేసర్ నందినీ శర్మ క్రాంతి గౌడ్‌తో కలిసి వికెట్లు తీస్తూ ఆశాజనకంగా కనిపిస్తుండగా, దీప్తి శర్మ వికెట్ల వర్షం కురిపిస్తూనే ఉంది.

ఇదిలా ఉండగా, థాయ్‌లాండ్‌పై తొలి విజయం సాధించడంతో పాకిస్తాన్ సెమీఫైనల్స్ రేసులో నిలిచింది. కానీ వారి బ్యాటింగ్ బలహీనతలు ప్రధాన ఆందోళనగా మిగిలిపోయాయి. ఆట వేగాన్ని నిర్దేశించడానికి పాకిస్థాన్ ఇప్పటికీ టాప్ ఆర్డర్ వికెట్ కీపర్‌బ్యాటర్ మునీబా అలీ, కెప్టెన్ ఫాతిమా సనాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. కానీ, మరింత పటిష్టమైన భారత జట్టుతో పోటీపడాలంటే పాకిస్థాన్ తమ బ్యాటింగ్‌లో గణనీయమైన మెరుగుదల సాధించాల్సి ఉంటుంది. భారత్ జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), జి కమలిని (వికెట్‌కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని గవాల్, ప్రరంతి గవాల్ శర్మ, పాకిస్థాన్ జట్టులో ఫాతిమా సనా (కెప్టెన్), అయేషా జాఫర్, ఎమాన్ నసీర్, ఈమాన్ ఫాతిమా, గుల్ ఫిరోజా, మొమినా రియాసత్, మునీబా అలీ సిద్ధిఖీ (వికెట్‌కీపర్), సదాఫ్ షమాస్, నష్రా సుంధు, సాదియా ఇక్బాల్, సైరా జబీన్, షావాల్ జుల్ఫికర్, ఉమ్మహస్సాని, తుబాహసానా హస్సాన్ ఉన్నారు.





## క్రికెట్ చరిత్రలో తొలిసారి జపాన్‌తో టీమిండియా టి20

**న్యూఢిల్లీ:** ఏషియన్ గేమ్స్-2026 ప్రారంభానికి ముందే భారత్ క్రికెట్ జట్టు చారిత్రాత్మక మ్యాచ్ ఆడనుంది. భారత్, జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభానికి గుర్తుగా, భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెల 22న జపాన్‌తో తమ మొట్టమొదటి టి20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జపాన్‌తో ఏకైక టి20లో టీమిండియా తలపడనుంది. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగా ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ప్రకటించింది. జపాన్ ప్రధాని సనాయె తకైచి, భారత్ ప్రధాని నరేంద్రమోడీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇండియా, జపాన్ మధ్య క్రీడల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడమే దీని లక్ష్యమని బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది. కాగా జపాన్‌తో ఆడే భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ, సంజు సామ్సన్, జస్ప్రీత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లతో పాటు, వైభవ్ సూర్యవంశీ తదితరులు ఈ మ్యాచ్‌లో ఆడనున్నారు.

## ఇండొనేసియా మాస్టర్స్.. సెమీస్‌కు అన్మోల్

### అశ్మిత ఓటమి



**పొంటియానాక్:** ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీస్‌కు భారత్ షట్లర్ అన్మోల్ ఖర్బ్ చేరుకోగా, ప్రపంచ 81వ ర్యాంకర్‌తో అశ్మితా చలిహా ఓటమిపాలైంది. శుక్రవారం నాడు కాలిమంటన్‌లోని పొంటియానాక్‌లో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీఫైనల్స్‌కు చేరుకోవడానికి, మూడవ సీడ్ అన్మోల్ ఖర్బ్, చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌తో మూడు గేమ్‌ల తేడాతో పోరాడి, చివరికి 21-121, 121-14 గెలుపొందింది. అన్మోల్, హువాంగ్‌ల మధ్య జరిగిన తొలి గేమ్ హోరాహోరీగా సాగింది. సగం గేమ్ పూర్తయ్యేసరికి ఆ ఇద్దరు షట్లర్ల మధ్య కేవలం ఒక్క పాయింట్ తేడా మాత్రమే ఉంది. ఆ తర్వాత అన్మోల్, తర్వాతి 14 పాయింట్లలో 10 పాయింట్లు గెలుచుకుని, గేమ్‌ను 21-14 తేడాతో కైవసం చేసుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గేమ్ 2 కూడా ప్రారంభంలో అదే రీతిలో సాగింది. కానీ ఈసారి విరామం తర్వాత హువాంగ్ పట్టు సాధించి మ్యాచ్‌ను 1-1తో సమం చేసింది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్, టాప్ సీడ్ అయిన అష్మిత చలిహాను 21-10, 21-18 తేడాతో ఓడించిన చైనాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జు వెన్ జింగ్‌తో అన్మోల్ తలపడనుంది.






ఆట

### చైనా మాస్టర్స్.. శ్రీకాంత్ నిష్క్రమణ

## సెమీ ఫైనల్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

**షెన్‌జెన్ (చైనా):** మాజీ ప్రపంచ నంబర్ 1, భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్, హాంకాంగ్‌కు చెందిన లీ చెక్ యియు చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోవడంతో, శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్‌లో అతని చైనా మాస్టర్స్ సూపర్ 750 ప్రయాణం ముగిసింది. మరోపక్క భారత్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి విజయంతో సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీకాంత్ గట్టిగా పోరాడినా 16-21, 16-21 తేడాతో ఓడిపోవడంతో, ఈ టోర్నమెంట్‌లో భారత్ సింగిల్స్ ప్రస్థానం ముగిసింది. లీతో జరిగిన మ్యాచ్‌లో, శ్రీకాంత్ దూకుడుగా ప్రారంభించినప్పటికీ, ప్రత్యర్థిని ఎదుర్కోలేకపోయాడు. దీంతో లీ తొలి గేమ్‌పై పట్టు సాధించి, 21-16 తేడాతో ముగించాడు. రెండవ గేమ్ మరింత హోరాహోరీగా సాగింది, శ్రీకాంత్ గెలుపుకు చేరువలోనే నిలిచినా ఆట ముగింపు దశలో లీ 14-14తో స్కోరును సమం చేశారు. ఆ తర్వాత జరిగిన తొమ్మిది పాయింట్లలో ఏడింటిని హాంగ్ కాంగ్ షట్లర్ గెలుచుకోవడంతో, శ్రీకాంత్ కేవలం మరో రెండు పాయింట్లు మాత్రమే సాధించగలిగాడు. ఇక భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి శుక్రవారం డెన్మార్క్‌కు చెందిన కిమ్ ఆస్ట్రాప్-ఆండర్స్ స్కారుప్ రాస్ముస్సెన్‌లోకి 21-13, 16-21, 21-21, ప్రవేశించారు. ఆట ప్రారంభమైన మొదటి ఐదు నిమిషాల్లోనే ఇండియన్స్ 11-4తో ఏడు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు. ఆట రెండవ భాగంలో డేన్స్ కొంత ప్రతిఘటన చూపి, తమ స్కోరును రెండంకెల సంఖ్యకు పెంచుకున్నప్పటికీ వాటిని అధిగమించి భారత్ జోడీ 16 నిమిషాల్లోనే ఆటను ముగించారు.

## యుఎస్ ఓపెన్.. ముందంజలో జ్వెరెవ్



**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మరో కఠినమైన ఐదు సెట్ల పోరులో ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్‌ను 6-4, 4-6, 7-6(3), 6-7(3), 6-3 తేడాతో ఓడించి, ఆర్థర్ ఆషే స్టేడియంలో మూడవ రౌండ్‌కు చేరుకున్నాడు. తన తొలి రౌండ్ విజయంలో నాలుగు గంటల 53 నిమిషాల పాటు కోర్టులో గడిపిన కేవలం రెండు రోజుల తర్వాత, నాలుగు గంటల 33 నిమిషాల పాటు సాగిన మరో అర్ధరాత్రి ఉత్కంఠభరితమైన పోరులో జ్వెరెవ్ మళ్లీ తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ప్రపంచ 52వ ర్యాంకర్ అయిన హాలిస్‌తో తలపడటానికి జర్మన్ ఆటగాడు కుదురుకోవడానికి సమయం తీసుకున్నాడు. కీలకమైన క్షణాల్లో జ్వెరెవ్ తన ఆట స్థాయిని పెంచుకోగా, హాలిస్ మాత్రం ఆ సందర్భాన్ని ఎదుర్కోవడంలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. 28 యేళ్ల జ్వెరెవ్ తదుపరి ప్రత్యర్థి చిలీకి చెందిన 25వ సీడ్ అలెజాండ్రో టబిలో. గత ఏడాది జరిగిన యూఎస్ ఓపెన్‌లో జ్వెరెవ్ మొదటి రౌండ్‌లో టబిలోను ఓడించాడు. ఎటిపి హెడ్‌టుహెడ్ రికార్డులో 2-0 ఆధిక్యంలో ఉన్నాడు. జ్వెరెవ్ ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం, ఫ్రెంచ్ ఓపెన్ గెలవడం, వింబుల్డన్ ఫైనల్‌కు దూసుకెళ్లడం వంటివి చేశాడు. హాలిస్‌పై సాధించిన విజయంతో, ఈ ఏడాది 20 గ్రాండ్ స్లామ్ మ్యాచ్ విజయాలు నమోదు చేసిన తొలి పురుష ఆటగాడిగా నిలిచాడు. దీంతో 2026లో అతని మేజర్ రికార్డ్ 202కు చేరింది.



## ఆల్‌టైమ్ గరిష్ఠానికి భారత్ ఫారెక్స్ నిల్వలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆగస్టు 28తో ముగిసిన వారంలో 11.475 బిలియన్ డాలర్లు పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠం 740.803 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. శుక్రవారం ఆర్బీఐ వెల్లడించిన వివరాలప్రకారం అంతకుముందు వారంలోనూ ఫారెక్స్ నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే అప్పటివరకు రికార్డు గరిష్ఠంగా ఉంది. అంతకుముందు అత్యధికంగా 728.494 బిలియన్ డాలర్లు ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదయ్యాయి. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రారంభం కావడానికి ముందు ఈ రికార్డు నమోదైన తర్వాత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా రూపాయి విలువపై ఒత్తిడి పెరగడంతో పాటు, రూపాయిని స్థిరీకరించేందుకు ఆర్బీఐ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ల విక్రయాలు చేపట్టింది. దీంతో వరుసగా కొన్ని వారాల పాటు దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గాయి. దేశీయ కరెన్సీపై తీవ్ర ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో జూన్‌లో ఆర్బీఐ రాయితీతో కూడిన ఫారెక్స్ స్వాప్ చర్యలను ప్రకటించిన తర్వాత నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ చర్యల ద్వారా 132 బిలియన్ డాలర్లకు పైగా కొత్త నిధుల ప్రవాహం వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 28తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన ఫారెక్స్ కరెన్సీ ఆస్తులు 9.337 బిలియన్ డాలర్లు పెరిగి 600.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్లలో లెక్కించిన ఫారెక్స్ కరెన్సీ ఆస్తుల విలువలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికా డాలర్‌యేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల, తగ్గుదల ప్రభావాలు కూడా ఉంటాయి. ఇదే సమయంలో దేశ బంగారం నిల్వల విలువ 2.191 బిలియన్ డాలర్లు పెరిగి 116.409 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మరోవైపు, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు అంటే ఎస్డీఆర్‌లు 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిదిసంస్థ ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 11 మిలియన్ డాలర్లు తగ్గి 4.914 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్బీఐ గణాంకాలు వెల్లడించాయి.

## అడోబ్ సిఇఒగా అనిల్ చక్రవర్తి



**ముంబయి, సెప్టెంబరు 4:** టెక్ దిగ్గజం అడోబ్‌కు కొత్త సీఈవో రానున్నారు. భారత సంతతికి చెందిన అనిల్ చక్రవర్తి సంస్థ అధ్యక్షుడు, సీఈవోగా బాధ్య తలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో శంతను నారాయణ్ 18 ఏళ్ల తర్వాత పదవి నుంచి తప్పుకోనున్నారు. డిసెంబర్ 1న అనిల్ చక్రవర్తి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అదే సమయంలో అడోబ్ బోర్డులోనూ చేరనున్నారు. శంతను నారాయణ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. మార్పిడి ప్రక్రియలో అనిల్ చక్రవర్తితో కలిసి పనిచేయనున్నారు. అనిల్ చక్రవర్తి అనుభవజ్ఞుడైన నాయకుడని, విలువలు, నిజాయతీతో పనిచేస్తారని శంతను నారాయణ్ ప్రశంసించారు. అడోబ్ వ్యాపారంపై ఆయనకు లోతైన అవగాహన ఉందని తెలిపారు. అనిల్ చక్రవర్తి 2020జనవరిలో అడోబ్‌లో చేరారు. అంతకు ముందు 2015 నుంచి 2020 వరకు ఇన్ఫర్మాటికా సీఈవోగా పనిచేశారు. అడోబ్‌లో చేరిన తర్వాత డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆర్కెస్ట్రేషన్, వరల్డ్‌వైడ్ ఫీల్డ్ ఆపరేషన్స్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. అనిల్ చక్రవర్తి ఐఐటీ బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని ఎంఐటీ నుంచిఎంఎస్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. సిమాంటెక్, వెరిసైన్, మెకిన్సీ వంటి సంస్థల్లోనూ బాధ్యతలు నిర్వహించారు.

## రూ.40వేల కోట్లమేరకు జియో ఐపిఒ



వాణిజ్యం

**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓకు రంగం సిద్ధమవుతోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్, టెలికాం విభాగం రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ భారీ పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేస్తోంది. నవరాత్రి, దీపావళి పండుగల సీజన్‌లో సుమారు రూ.37,000-40,000 కోటు విలువైన మెగా ఐపీఓను తీసుకురావాలని కంపెనీ భావిస్తున్నది. ఇప్పటికే సెబీ నుంచి డ్రాఫ్ట్ పేపర్లకు అనుమతి లభించడంతో జియో ప్లాట్‌ఫామ్స్ తుది తేదీలను ఖరారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. తర్వాత దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు భారీ స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ పూర్తయితే ఇప్పటి వరకు భారత్‌లో లిస్ట్ అయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఇక జియో ఐపీఓను అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ తొలి వారంలో తీసుకురావచ్చని మార్కెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నవరాత్రి పండుగ రోజుల్లోనే ఐపీఓను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ ఆ సమయంలో సాధ్యం కాకపోతే దీపావళి పండుగను టార్గెట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జియో ప్లాట్‌ఫామ్స్ ముందుగా అంతర్జాతీయ రోడ్‌షోలు, ఆ తర్వాత దేశీయ రోడ్‌షోలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దాదాపు మూడు వారాల పాటు విదేశాల్లో, రెండు వారాల పాటు దేశీయంగా రోడ్‌షోలు నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ద్వారా సుమారు రూ.37,800 కోట్లు సమీకరించే అవకాశం ఉందని బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు. భారత ప్రైమరీ మార్కెట్‌లో సరికొత్త రికార్డుగా నిలవనుందని చెబుతున్నారు. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ ఇండియా 2024లో తీసుకొచ్చిన సుమారు రూ.27,000 కోట్ల ఐపీఓ దేశంలో పూర్తయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది. అంతకంటే పెద్దగా జియో ఐపీఓ నిలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓ విలువ కంటే కూడా జియో ఇష్యూ పెద్దదిగా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ 270 మిలియన్ల వరకు కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని ప్రతిపాదించింది. ఇవి ఐపీఓ అనంతరం కంపెనీ ఈక్విటీ క్యాపిటల్‌లో సుమారు 2.9 శాతం వాటాను సూచిస్తాయి. ఈ ప్రతిపాదిత ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ ఉండదని సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రిలయన్స్ గ్రూప్ నుంచి వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం మరో ప్రత్యేకత. జియో ఐపీఓ తో వచ్చే నిధుల్లో కొంత మొత్తాన్ని దాని ఆపరేటింగ్ సబ్సిడియరీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాన్ని ముందుగానే తీర్చేందుకు వినియోగించనున్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో రూ.27,500 కోట్ల వరకు రుణాన్ని చెల్లించి మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. పెద్ద ఇన్వెస్టర్ల వద్ద కలిపి సుమారు 30.9 శాతం వాటా ఉన్నట్లు సమాచారం. మెటా ప్లాట్‌ఫామ్స్‌కు చెందిన జాదూ హోల్డింగ్స్ వద్ద సుమారు 9.98 శాతం, గూగుల్ ఇంటర్నేషనల్ వద్ద 7.73 శాతం వాటా ఉన్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, సిల్వర్ లేక్, విస్టా ఈక్విటీ, జనరల్ అట్లాంటిక్, కెకెఆర్ అనుబంధ సంస్థలు, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి చెందిన సంస్థలు కూడా జియోలో పెట్టుబడిదారులుగా ఉన్నాయి.

## ప్రైమరీ మార్కెట్‌కు ఆరు ఐపిఒలు




**ముంబయి,సెప్టెంబరు 4:** భారత ప్రైమరీ మార్కెట్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అమెరికాఇరాన్ యుద్ధ పరిణామాల కారణంగా 2026 ప్రారంభంలో నెమ్మదించిన నిధుల సేకరణ ప్రక్రియ మళ్లీ వేగం పుంజుకుంది. ఈనెల 9న ఒకే రోజున రికార్డు స్థాయిలో ఆరు ఐపీఓలు మార్కెట్లో ప్రారంభం కానున్నాయి. ఫర్నీచర్ రెంటల్ వేదిక రెంట్ ఒమోజో, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా), మణిపాల్ పేమెంట్ ఐడెంటిటీ సొల్యూషన్స్ వంటి ప్రముఖ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిపి సుమారు 45.11 బిలియన్ రూపాయలు (477.46 మిలియన్ డాలర్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వచ్చే వారంలోనే మరికొన్ని ఇతర కంపెనీలతో కలిపి కనీసం 11 ఐపీఓలు మార్కెట్లోకి అడుగుపెడుతుండటంతో ఈ ఏడాదిలోనే ఇది అత్యంత రద్దీగా ఉండే వారంగా నిలవనుంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అంచనాల ప్రకారం సెప్టెంబర్ నెలలో మొత్తం మీద దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువైన ఐపీఓలు రానున్నాయి. ఆటోమోటివ్ టెక్నాలజీ సంస్థ హీరో మోటార్స్, ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఎస్‌ఇలతో పాటు ముకేష్ అంబానీ మద్దతు ఉన్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కూడా త్వరలోనే రాబోతోంది. అధిక వృద్ధి అవకాశాలు ఉన్న కంపెనీలకు భారత మార్కెట్లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 26 నాటికి భారత్‌లో 165 ఐపీఓల ద్వారా 8.61 బిలియన్ డాలర్లు సమీకృతమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ నిధుల సేకరణలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. మార్కెట్ నియంత్రణ సంస్థ ఇచ్చే ఐపీఓ అనుమతుల గడువు ఈనెల 30తో ముగియనుండటంతో కంపెనీలు మార్కెట్లోకి వచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గడిచిన ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సగటున 24.5 రెట్లు ఉన్న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్లు, జూలై ఆగస్టు నాటికి 59.1 రెట్లకు పెరిగాయి. అలాగే లిస్టింగ్ లాభాలు కూడా 5.7 శాతం నుంచి 19.5 శాతానికి పైగా పుంజుకున్నాయి. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారులు ప్రతి ఐపీఓలోనూ కాకుండా నాణ్యమైన, మంచి వృద్ధి సామర్థ్యం ఉన్న కంపెనీల్లో మాత్రమే జాగ్రత్తగా పెట్టుబడులు పెడుతున్నారు.

## వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలు



**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ ఈ వారాంతం లాభాల్లో ముగిసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 362 పాయింట్లు పెరగగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 24 పాయింట్లు పెరిగింది. దీంతో నాలుగు రోజులుగా సాగిన నష్టాలకు శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 531.88 పాయింట్ల పెరుగుదలతో 76,684.74 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 78.25 పాయింట్ల పెరుగుదలతో 23,951.70 వద్ద ప్రారంభమైంది. చివరకు సెన్సెక్స్ 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద, నిఫ్టీ 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 విలువ 0.25 శాతం నష్టపోగా, నిఫ్టీ మైక్రోక్యాప్ 250 కూడా 0.67 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ 0.90 శాతం పడిపోగా, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.07 శాతం పెరిగింది. 30 షేర్ బీఎస్ఈ ఇండెక్స్‌లో రిలయన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 95.18 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 4,472 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.45 వద్ద ఉంది. అలాగే బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 0.01శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.24శాతం ఎరిగింది. మార్కెట్లపరంగా ఎన్‌ఎస్‌ఇలో 2016 షేర్లుపెరిగితే 1517 షేర్లు క్షీణించగా మరో 115 షేర్లుస్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో అక్టోబరునాటి ఫ్యూచర్ పసిడి ధరలు పదినరగాములకు రూ.1,56,837గా కొనసాగాయి. లిస్టింగ్ అయిన షేర్లలో ఇఎస్‌డిఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ రూ.895.55 చొప్పున ముగిసింది. 108.75శాతం ప్రీమియంతో కొనసాగింది. ప్రయారిటీ జ్యూయెల్స్ 234.45 వద్ద కొనసాగింది. ఇష్యూ ధర కంటే బిఎస్‌ఇలో 12.6 శాతం ఈ సంస్థ షేర్‌ధరలు కొనసాగాయి.

## 11న ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ ఇష్యూ ధరల ప్రకటన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ ఐపిఒకు సంబంధించి కీలక ప్రకటనకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 11న ఐపిఒ ధరల శ్రేణిని ప్రకటించే అవకాశం ఉందని, సెప్టెంబర్ మూడో వారంలో ఎన్‌ఎస్‌ఇ షేర్లను లిస్ట్ చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎన్‌ఎస్‌ఇ ఐపిఒకు ఆగస్టు 2026లోనే నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించింది. సెప్టెంబర్ 2026లో ఎన్‌ఎస్‌ఇ షేర్లు బీఎస్ఈలో లిస్టయ్యే అవకాశం ఉందని జులైలోనే వెల్లడి అయింది. ప్రపంచంలో ట్రేడింగ్ పరిమాణం పరంగా అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌గా ఉన్న ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ కోసం జూన్ 17న సెబీకి డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. స్ట్రీట్ అంచనాల ప్రకారం ఐపిఒ విలువ రూ.30వేల కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్‌లో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్దఐపిఒగా నిలుస్తుంది. ప్రస్తుతం ఈ రికార్డు హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్లఐపిఒ పేరిట ఉంది. ఎన్‌ఎస్‌ఇ ఐపిఒద్వారా గరిష్ఠంగా రూ.5.26 లక్షల కోట్ల విలువను సంస్థ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. డిఆర్‌హెచ్‌పి ప్రకారం, ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంటుంది. ఇందులో ప్రస్తుత వాటాదారులు సుమారు 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఇవి ఎన్‌ఎస్‌ఇ చెల్లించిన ఈక్విటీ మూలధనంలో దాదాపు 6 శాతానికి సమానం. ఐపిఒ ప్రక్రియ కోసం ఎన్‌ఎస్‌ఇ మొత్తం 20 బ్యాంకులను నియమించింది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జేఎం ఫైనాన్షియల్, మోర్గాన్ స్టాన్లీ, హెచ్‌ఎస్‌బీసీ హోల్డింగ్స్, సిటీగ్రూప్ తదితర ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.